PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 240 | విజయవాడ, గురువారం 3 ఏప్రిల్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 3 April 2025 | Rs



సిపిఎం అఖిల భారత 24వ మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రకాశ్‌కరత్



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బిమన్‌బసు

నవ భారతాన్ని నిర్మిద్దాం..

- జనతా ప్రజాస్వామ్యం, సోషలిజమే లక్ష్యం • లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల మార్గాలే ప్రాతిపదిక
- సిపిఎం 24వ అఖిల భారత మహాసభ ప్రారంభోపన్యాసంలో ప్రకాశ్ కరత్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

'మదురై నగరం నుండి ఈ పిలుపును మరింత బిగ్గరగా, మరింత స్పష్టంగా వినిపించనీయండి. చీకటి శక్తుల దుష్ట చర్యలను తిప్పి కొట్టడానికి అన్ని వామ పక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యం కావాలి. లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల ఆశయాలే ఆలంబనగా జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల సాధన కోసం మనమందరం ఐక్యంగా ఉద్యమిద్దాం. నవ భారతాన్ని నిర్మిద్దాం..' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ అన్నారు. సిపిఎం అఖిల భారత 24వ మహాసభ తమిళనాడులోని సీతారాం ఏచూరి నగర్ (మదురై)లో బుధవారం అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో సిపిఎం సీనియర్ నేత బిమన్‌బసు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన ప్రకాశ్ కరత్ ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ అంశాలను ప్రస్తావించారు. అన్ని లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో చేతులు కలిపి పనిచేయడానికి సిపిఎం తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్టు కరత్ ప్రకటించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల మధ్య నెలకొనే ఇటువంటి విస్తృత ఐక్యతే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటాలకు దోహదం చేస్తుందని చెప్పారు. 'ఈ దిశలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం అన్ని వామపక్ష శక్తులతో కలిసి పనిచేయడానికి సిపిఎం సిద్ధంగా ఉంది' అని కరత్ అన్నారు. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి, వామపక్ష రాజకీయ జోక్యాన్ని విస్తృతం చేయడానికి ఇది సరైన సమయమని ఆయన ఉద్ఘాటించారు. 'నయా ఉదారావాద, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా, శ్రామిక ప్రజల ప్రయోజనాలను వామపక్షాలు మాత్రమే ధృడంగా కాపాడతాయి' అని అన్నారు. దేశానికి ప్రమాదకరంగా మారిన హిందుత్వ నయా ఫాసిజాన్ని ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి ఒక్క వామపక్షాలకు మాత్రమే ఉందని కరత్ చెప్పారు. వామపక్ష శక్తులు మాత్రమే మన దేశంలో సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వం వహించగలవని అన్నారు.

మోడీ మూడవ విడత పాలనపై...

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ నిర్దేశించే హిందుత్వ ఎజెండాతో, మరింత దూకుడుగా నయా ఉదార విధానాలను అమలు చేస్తోంది. నిరంకుశత్వాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. ఈ క్రమంలో అది నయా ఫాసిజాన్ని లక్షణాలు (నియో-ఫాసిస్ట్ కారక్టర్‌స్టిక్స్)ను ప్రదర్శిస్తోంది' అని కరత్ వివరించారు. 'ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తూ ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో రాష్ట్ర యంత్రాంగం సహాయంతో హిందూత్వ శక్తులు ముస్లిములను లక్ష్యంగా చేసుకుని మత హింసకు దిగుతున్నారని చెప్పారు. 'ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నిత్యం హింస, బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఇది శాశ్వత మత విభజనను నెలకొల్పి 'పాన్-హిందుత్వ'గా సమీకరించే యత్నం' అని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి చిరునామాగా మారిందని మిగతా 7లో

రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి

- దేశాన్ని తరగతులుగా విభజించే కుట్ర
- వక్ఫ్ సవరణలపై ఇండియా బ్లాక్ ఆగ్రహం
- పార్లమెంట్ స్థలాన్నీ వక్ఫ్ అంటున్నారంటూ అగ్గి రాజేసిన కిరణ్ రిజిజు



వక్ఫ్ (సవరణ)బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ముస్లింలు (ఫైల్‌ఫోటో)
ఇన్‌సెట్‌లో లోక్‌సభలో బిల్లును ప్రవేశపెడుతున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తరతరాలుగా మైనార్టీల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న వక్ఫ్ చట్టాన్నికి తూట్లు పొడుస్తూ కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొస్తున్న సవరణల బిల్లు రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై జరుగుతున్న దాడిగా ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా బ్లాక్' సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును బుధవారం లోక్‌సభలో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై వివిధ పార్టీల నుంచి 53 మంది సభ్యులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ యుపిఎ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసిందని, ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డినోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు మిగతా 7లో

బిల్లుకు మద్దతు		బిల్లుకు వ్యతిరేకం			
బిజెపి	ఎల్‌జెపి	కాంగ్రెస్	సిపిఐఎంఎల్	వైసిపి	ఐయుఎంఎల్
టిడిపి	జెడిఎస్	ఎస్‌పి	ఎన్‌సిపి (శరద్ పవర్)	ఆర్‌జెడి	విసికెజి
జెడియు	ఆర్‌ఎల్‌డి	డిఎంకె	శివసేన (ఠాక్రే)	జెఎంఎం	ఆర్‌ఎస్‌పి
శివసేన (షిండే)	ఎన్‌సిపి (అజిత్ పవర్)	టిఎంసి		ఆప్	ఎంఐఎం
అప్నాదళ్		సిపిఎం		నేషనల్ కాన్ఫరెన్స్	
జనసేన		సిపిఐ			

పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి- విజయనగరం

నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్తున్న నాగావళి (20810) ఎక్స్‌ప్రెస్ విజయనగరంలో పట్టాలు తప్పింది. బుధవారం ఉదయం 11.50 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఈ రైలు పది నిమిషాల అనంతరం బయలుదేరింది. స్టేషన్ దాటిన కొద్దిసేపటికే సిఎంఆర్ షాపింగ్‌మాల్ వెనుక (వెంకటలక్ష్మి థియేటర్) సమీపాన హౌరా, రాయపూర్ లైన్ల క్రాసింగ్ వద్ద చివర గార్డు బోగీతోపాటు మరో రెండు జనరల్ బోగీలు పట్టాలు తప్పాయి. వీటిలో జనరల్ బోగీలు ఉన్నాయి. ఆ సమయంలో రైలు నెమ్మదిగా వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు. రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన భోగీలను రైలు నుంచి తప్పించారు. ఆ రెండు భోగీల్లోని వారిని అదే రైలులోని వేరే బోగిల్లో ఎక్కించారు. రైలును మధ్యాహ్నం 1.59 గంటలకు సంబల్‌పూర్ పంపించారు. మిగతా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.



టిటిడిలో వంద శాతం ప్రక్షాళన

- అలిపిరిలో బేస్ క్యాంప్ : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో నూటికి నూరు శాతం ప్రక్షాళన జరగాల్సిందేనని, ఏ స్థాయిలోనూ మినహాయింపులు లేవని సిఎం చంద్రబాబు తెలిపారు. టిటిడిపై సిఎం బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులకు అందుతున్న సౌకర్యాలు, సేవలపై టిటిడి అధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు. గత 9 నెలల కాలంలో పెరుగుతున్న యాత్రికుల రద్దీ నేపథ్యంలో తీసుకున్న చర్యలపై సిఎం సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టిటిడిలో యాత్రికులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలన్నారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని యాత్రికులకు మరింత దగ్గర చేయడం, సులభమైన సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి సిఎం పలు సూచనలు చేశారు. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టిటిడిని తీర్చిదిద్దాలని, ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలన్నారు. శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టొద్దని, మనందరమూ ఆలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమేనన్నారు. యాత్రికులు ఇచ్చే కానుకల సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదన్నారు. టిటిడి వందల కోట్లు అనేక కార్యక్రమాలకు ఖర్చు చేస్తోందని, దీనిపై ఇంటర్నల్ ఆడిట్‌తో పాటు కాగ్ మిగతా 7లో

తల్లీకూతుళ్లపై ఉన్మాది దాడి

- అక్కడికక్కడే తల్లి మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమార్తె



పట్టుబడిన నిందితుడు నవీన్‌తో పోలీసులు

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖపట్నం)

విశాఖ నగరం పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకూతుళ్లపై ఓ ఉన్మాది విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో, తల్లి మృతి చెందారు. కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి కొమ్మాది స్వయంకృషి నగర్‌లో శ్రీకాకుళం జిల్లా పొర్ల గ్రామానికి చెందిన నక్క రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. రాజు కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె దీపిక (20) డిగ్రీ చదువుతున్నారు. ఆమెను పాలకొండ ప్రాంతానికి చెందిన నవీన్ ప్రేమ పేరుతో వేధించేవాడు. బుధవారం నవీన్ నేరుగా వారి ఇంటికి వచ్చి వారితో గొడవపడి, కత్తితో తల్లీకూతుళ్లపై దాడి చేశాడు. వారిద్దరి గొంతుకులపై తీవ్రంగా గాయపరిచి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో తల్లి నక్క లక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందారు. దీపికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యాన సిఐ జి.బాలకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, దీపికను నవీన్ ప్రేమ, పెళ్లి పేరుతో వేధించేవాడు. అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఈ విషయం తెలిసిన దీపిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారు. యువకుని జీవితం నాశనం అవుతుందని ఫిర్యాదు చేయకుండా ఆగిపోయారు.

నిందితుడు అరెస్టు

దాడి అనంతరం పరారైన నిందితుడు నవీన్‌ను పోలీసులు శ్రీకాకుళం జిల్లాలో అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మీదుగా వీరఘట్టం వెళుతుండగా పట్టుకున్నారు. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమని, నిందితుడిని కోర్టులో ప్రవేశపెడతామని సిపి వెల్లడించారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

విశాఖలో రెచ్చిపోయిన మానవమృగాన్ని కఠినంగా శిక్షించాలని మిగతా 7లో

పల్నాడులో బర్డ్‌ఫ్లూ కలకలం

- ఆందోళన అవసరం లేదు : డిఎం అండ్ హెచ్‌ఒ
- పచ్చి కోడి మాంసం తినడం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడం చిన్నారి మృతికి కారణమంటున్న వైద్యులు

2

చతికిలపడ్డ స్మార్ట్ సిటీస్ మిషన్

- మోడీ సర్కార్ వైఫల్యంతో దరి చేరని లక్ష్యం

7

ఒక అనన్య..ఒక స్కూల్ బ్యాగ్

- యుపిలో బుల్డోజ్‌రాజ్ బీభత్సానికి సాక్ష్యాలు
- సుప్రీంకోర్టునే కలవరపాటుకు గురిచేసిన చిన్నారి వీడియో



స్కూల్‌బ్యాగ్‌తో పరుగెడుతున్న అనన్య

లక్నో : పసివాడని ఎనిమిదేళ్ల బాలిక అనన్య, ఆమె స్కూలు బ్యాంగ్ దేశానికి ఎన్నో పాఠాలు నేర్పుతోంది. ఉత్తరప్రదేశ్‌లో దళితులను, ముస్లిం తదితర మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని డబుల్ ఇంజిన్ సర్కార్ సాగిస్తున్న బుల్డోజ్‌రాజ్ భీభత్సానికి ఆ చిన్నారి, స్కూలు బ్యాగ్ వీడియో సాక్ష్యాలుగా నిలిచాయి. దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం కలవరపాటుకు గురిచేసిన వీడియో ఏమిటి? ఇంతకీ ఎవరా చిన్నారి..ఆమె స్కూలు బ్యాగ్ చెబుతున్నదేమిటి? యుపిలో అధికారులు ఇళ్ళ కూల్చివేతలను కొనసాగిస్తుండగా తన స్కూలు బ్యాగ్ పట్టుకుని పరుగులు బెడుతున్న 8 ఏళ్ళ బాలికకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఆ వీడియో ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎస్.ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఇటీవల చిన్న చిన్న గుడిసెలను బుల్డోజర్లు కూల్చివేస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. చేతిలో పుస్తకాలతో కూలిపోతున్న గుడిసెకు దూరంగా చిన్నారి బాలిక పరుగులు బెడుతున్న దృశ్యం కనిపిస్తోంది. ఇది ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది." అని జస్టిస్ భుయాన్ వ్యాఖ్యానించారు.

ఎనిమిదేళ్ల ఆ చిన్నారి బాలిక అనన్య యాదవ్. ఈ నెల 21న యుపిలోని అంబేద్కర్ నగర్‌లో జరిగిన కూల్చివేతల సందర్భంగా ఆ బాలిక తన పుస్తకాల సంచీని భద్రంగా పట్టుకుని పరుగులు పెట్టింది. ఐఎఎస్ అధికారి కావాలని, దేశాన్ని రక్షించాలన్నది ఆ చిన్నారి కల. స్కూలు నుండి వచ్చిన తర్వాత తమ గుడిసెను ఆనుకుని వున్న పశువుల పాకలో ఆమె తన పుస్తకాల సంచీ పెట్టింది. ఇళ్ళ కూల్చివేతల సందర్భంగా మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా తన పుస్తకాలు కాలిపోతాయేమోననే భయంతో ఆమె పరిగెత్తింది. తల్లి ఆపేందుకు ప్రయత్నించినా ఆగలేదు. అరయ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అనన్య ఒకటవ తరగతి చదువుతోంది. ఈ పుస్తకాలు కాలిపోతే మళ్లీ స్కూల్లో పుస్తకాలు దొరకవని భయడినట్లు తెలిపింది. తమ కుటుంబం గత 50 ఏళ్ళుగా ఆక్రమించుకున్న భూమిలో కట్టడాలను ఇలా కూల్చివేయడంపై పోరాడతామని అనన్య తాత రామ్ మిలన్ యాదవ్ (70) చెప్పారు. ఈ వీడియో వైరల్ అయిన దగ్గర నుండి చాలామంది రాజకీయ నేతలు తమ ఇంటికి వచ్చారని, ఏం జరుగుతోందో తమకు అర్థం కాలేదని కూలీ పనులు చేసుకునే అనన్య తండ్రి అభిషేక్ చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఆ వీడియోను షేర్ చేయగా, ఆ కుటుంబాన్ని కలిసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం వెల్లింది. కానీ అనన్య బ్యాగ్ వుంచిన షెడ్‌ను, నివాస స్థలాన్ని బుల్డోజర్ తాకలేదని కూల్చివేతలో పాల్గొన్న అధికారులు చెబుతున్నారు. 'ఆ స్థలం ఖాళీ చేయాల్సిందిగా రెండు నెలల క్రితమే నోటీసులిచ్చా మని, తాము ఎప్పుడు వెళ్లినా వారు ఆందోళన చేస్తున్నారని జలాల్‌పూర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ పవన్ జైస్వాల్ చెప్పారు. అక్కడ గల గుడిసెకు ఎలా నిప్పంటుకుందో తమకు తెలియదన్నారు. వెంటనే మంటలను అదుపు చేశారు. ఆ తర్వాత ఒక కట్టడాన్ని కూల్చివేశారు కానీ అది నివాస ప్రాంతం కాదన్నారు. ఆ బాలికతో కూల్చివేతలను ముడిపెడుతూ నకిలీ వీడియోలు చేయడంపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు.

గత సీట్లను నిలబెట్టుకున్నారంతే

- ఉప ఎన్నికల్లో వైసిపి గెలుపుపై మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప ఎన్నికలు నిర్వహించిన 53 స్థానాలు గతంలో వైసిపి బెదిరించి భయపెట్టి గెలిచినవే అని మంత్రి కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఇప్పుడు ఏదో విజయం సాధించినట్లు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీరాలు పలుకుతున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము నిజంగా పోలీసులతో బెదిరించి భయపెట్టి ఉప ఎన్నికలు నిర్వహించి ఉంటే 39 స్థానాల్లో విజయం సాధించేవారా? అని ప్రశ్నించారు. ఆ ఉద్దేశం తమకు లేదు కాబట్టే వైసిపికి 11 స్థానాలు అయినా ఉన్నాయన్నది గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. అధికారం పోయినా ఇంకా జగన్ వక్రబుద్ధి మాత్రం మారలేదని విమర్శించారు. అహంకారంతో 2019-24 మధ్య వైసిపి ఎలా ఎన్నికల్లో విజయం సాధించిందో రాష్ట్ర ప్రజలంతా చూశారని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీస్ వ్యవస్థను చేతిలో పెట్టుకుని గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నేతలను నామినేషన్లు వేయనివ్వలేదని, వేసిన వాటిని ఉపసంహరించుకోవాలని అభ్యర్థులను బెదిరించారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే ఆచరణలో పెట్టామని, ఈ నెలలో డిఎస్‌సి, వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుంటే జగన్‌కు మంచిదని పేర్కొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి

టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ స్వామి నాయుడుతో కలిసి టిడిపి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులు అందించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో జీవరాశిపై తీవ్ర ప్రభావం

- పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరెక్టర్ విఎస్ఆర్‌కె.ప్రసాద్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్లాస్టిక్ వ్యర్థాలతో జీవరాశిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరెక్టర్ విఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై ప్రభావం చూపుతోందని తెలిసినా ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారన్నారు. కొసరాజు వెంకటేశ్వరరావు 43వ వర్ధంతిని పురస్కరించుకొని డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురజాడ అధ్యయన వేదిక కన్వీనర్ చలపతిరావు అధ్యక్షతన 'విశాఖ నగర అభివృద్ధి - పర్యావరణం' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విఎస్ఆర్‌కె.ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ రీసైకిల్ చేయడం ద్వారా డీజిల్‌ను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. నిరుపయోగమైన ఎలక్ట్రానిక్ వస్తువులను రీసైకిల్ చేస్తే కొంత వరకు పర్యావరణాన్ని కాపాడవచ్చని వివరించారు. మన రాష్ట్రంలో ఈ-వేస్ట్ కలెక్షన్ పాయింట్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, లేదా ఉన్న ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలని సూచించారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, దీనివల్ల చేపలు, వాటిని తింటున్న మనుషులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వ్యర్థాల నుంచి ఉత్పత్తులను తయారు చేసే వ్యవస్థ రావాలన్నారు. భవిష్యత్తులో మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతోందని, వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వచ్చే చట్టాలు అటవీ సంపదను పూర్తిగా నాశనం చేస్తాయని తెలిపారు. సిఆర్‌ఇజడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ బీచ్ రోడ్డు ప్రాంతంలో లూలూ మాల్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని, దాని వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిపారు. కొసరాజు వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఆయన కుమారులు స్వతంత్రకుమార్, సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

సమస్యలపై కదం తొక్కిన ఉపాధ్యాయులు

- 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి
- 12వ పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలి
- ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సురేష్‌కుమార్

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో బుధవారం కదం తొక్కారు. 12వ పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్ నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని తదితర డిమాండ్లతో కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపారు. కరోనా కాలంలో మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హృదయ రాజు మాట్లాడుతూ...ఉద్యోగుల హక్కులను కాలరాసే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. పెండింగులో ఉన్న బకాయిలను, రావాల్సిన డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు కె.సురేష్ కుమార్ కె.ప్రకాష్ రావు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. గత ప్రభుత్వం పిఆర్‌సి కమిటీని నియమించి తర్వాత పట్టించుకోలేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వమైనా వెంటనే పిఆర్‌సి కొత్త కమిటీని ఏర్పాటు చేసి కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలను చేపడతామని హెచ్చరించారు.

తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ.. మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సికి కమిషను నియమించాలని కోరారు. ఈలోగా 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డిఇఒ, డైట్ ప్రిన్సిపల్, డిఇఒ పోస్టులు అందని ద్రాక్షలా మిగిలిపోయాయన్నారు. వెంటనే జిఒ నంబర్ 73, 74, 75 అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నినదించారు.

విజయనగరం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. గత పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఫ్యాప్టో కాకినాడ జిల్లా ఛైర్మన్ కె.కాశీవిశ్వనాద్ అధ్యక్షతన తొలుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.

అబద్ధాలు, మోసాలతో కూటమి పాలన

- కార్యకర్తలకు అండగా ఉంటా
- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోసాలు, అబద్ధాలతో పాలన సాగిస్తోందని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలు, వైసిపి ప్రజా ప్రతినిధుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీ ఇచ్చి అమలు చేయడం లేదని, హత్యా రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. పి4 పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 1.61 కోట్ల ఇళ్లు ఉంటే 1.48 కోట్ల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయని, అంటే 90 శాతం మంది పేదవారే ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 8.60 లక్షల మంది మాత్రమే ట్యాక్స్ కడుతున్నారని, 25 లక్షల మంది ఐటి ఫైల్ చేస్తున్నారని, అంటే 1.80 లక్షల మందికి 1.48 కోట్ల తెల్లరేషన్‌కార్డుదారులను అప్పగించాలని అది జరిగే పని కాదని తెలిపారు. ఇందులోనూ మోసం ఉందని వివరించారు. సిఎం మాట్లాడుతుంటే ప్రజలు మీటింగులో నుండి వెళ్లిపోతున్నారని, అయినా అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు ఎగ్గొట్టేందుకే అప్పుల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు టిడిపి ఎంపిటిసి లేని మండలంలోనూ కూటమి తరపున అభ్యర్థిని నిలబెట్టి పోలీసులతో వైసిపి వారిని బెదిరించి కోరం లేకపోయినా గెలిచినట్లు ప్రకటించారని విమర్శించారు. ఎన్నికల కోసం నకిలీ వార్డు



మెంబర్లను సృష్టించారని, వారికి ఐడి కార్డులు కూడా ఇచ్చారని అన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వైసిపి సభ్యులు బలంగా నిలబడినచోట ఎన్నికలు వాయిదా వేయిస్తున్నారని ఆరోపించారు. అయినా వైసిపి కోసం నిలబడ్డవారందరికీ తాను అండగా ఉంటానని అన్నారు. కొన్నిచోట్ల వైసిపి సభ్యులకు రక్షణ కల్పిస్తున్నట్లు నటించిన పోలీసులు వారిని తీసుకెళ్లి టిడిపి నాయకుల వద్ద వదిలిపెట్టారని, విశాఖలో కార్పొరేట్ల ఇళ్లకు వెళ్లి వారి భార్యలను బెదిరించారని ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని పేర్కొన్నారు. వ్యవసాయం ముందుకు సాగడం లేదని, రైతులు.. దళారులపై ఆధారపడి సాగు చేయాల్సిన దుస్థితిని సిఎం చంద్రబాబు తీసుకొచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.3,500 కోట్ల బకాయి పెట్టారని, దీంతో వారు వైద్యం చేయడానికి ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. 104, 108 అంబులెన్సుల నిర్వహణ కూడా సరిగ్గా లేదని తెలిపారు. విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని, టోఫెల్ క్లాసులనూ ఎత్తేశారని అన్నారు. పార్టీ కోసం నిలబడ్డ కార్యకర్తలను చూస్తుంటే గర్వంగా ఉందని, రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు.

సిగ్నల్‌లో సాంకేతిక సమస్య సృష్టించి రైళ్లలో దోపిడీ

ప్రజాశక్తి- కోవూరు

నెల్లూరు జిల్లాలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో బిట్రగుంట-నెల్లూరు రైల్వే స్టేషన్ల మధ్య అల్లూరు రోడ్ స్టేషన్ - పడుగుపాడు స్టేషన్ల మధ్య రైళ్లను ఆపి దోపిడీకి పాల్పడ్డారు. సిగ్నల్‌లో సాంకేతిక సమస్య సృష్టించి.. బెంగళూరు ఎక్స్‌ప్రెస్, చండీగఢ్ ఎక్స్‌ప్రెస్‌లను ఆపారు. అనంతరం బోగీల్లోకి ప్రవేశించి మహిళల మెడలలోని బంగారం, ప్రయాణికుల బ్యాగ్‌లు దోచుకెళ్లారు. దాదాపు 20 నిమిషాల పాటు దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేశారు. పడుగుపాడు స్టేషన్ వద్ద మరికొందరిపై దాడి చేసి బంగారం లాక్కుపోయారు. ప్రయాణికుల నుంచి వివరాలు సేకరించేందుకు చెన్నయ్ పెరంబదూర్ స్టేషన్‌లో రెండు రైళ్లను నిలిపారు. ఈ సంఘటనతో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు 25 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి. అల్లూరు రోడ్ స్టేషన్‌లోని సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించి, విచారణ జరుపుతున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

ఎంఎస్ఎంఇలపై కాకి లెక్కలు

- పదేళ్లలో 8.42 లక్షలు ఏర్పాటు
- మూతపడిన వాటిపై స్పష్టత కరువు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మధ్య, చిన్న, సూక్ష్మ పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు పదేపదే చెబుతున్నప్పటికీ వాటి నిర్వహణలో మాత్రం కాకి లెక్కలే కనిపిస్తున్నాయి. గత పదేళ్లలో సాధించిన విజయాలపై లెక్కలు చెప్పడం తప్పితే వాటి పరిస్థితి తాజాగా ఏమిటన్నది మాత్రం అధికారులు తేల్చిచెప్పలేకపోతున్నారు. ఇదే సమయంలో అరకోటి మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు కూడా వెల్లడించడం చూస్తే వాస్తవాలకు అతీతంగా ఈ గణాంకాలు ఉన్నట్లు కొంతమంది అధికారులే అభిప్రాయపడుతున్నారు.

తాజాగా వెలుగు చూసిన ఒక నివేదికలో అంకెలు విస్తుగొలిపేవిగా కనిపిస్తున్నాయి. 2014-15 నుంచి ఇప్పటి వరకు 8.42 లక్షల ఎంఎస్ఎంఇ పరిశ్రమలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సంవత్సరంలో 9,987 ఎంఎస్ఎంఇలు ఉండగా, 2022-23 నాటికి వీటి సంఖ్య ఏకంగా 92,707 వరకు పెరిగినట్లు తేల్చారు. ఇక 2023-24 సంవత్సరంలో అయితే 2.71 లక్షల వరకు ఉన్నట్లు అధికారులు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2.61 లక్షల వరకు ఎంఎస్ఎంఇలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంటే ఈ ఏడాది పది వేల వరకు తగ్గినట్లు కనిపిస్తోంది. ఇలా తగ్గడానికి కారణాలు మాత్రం అధికారులు చెప్పడం లేదు.

పెట్టుబడులు భారీగానే

రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేస్తున్న ఎంఎస్ఎంఇలతో రూ.59 వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటించారు. ఈ పెట్టుబడులతో 67.55 లక్షల మందికి ఉపాధి లభించినట్లు కూడా పేర్కొన్నారు. అంటే రాష్ట్ర జనాభాలో 13 శాతం మందికి ఉపాధి లభించినట్టయింది. ఒకవైపు పరిశ్రమలపై అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం ప్రత్యేక విధానాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే వీటిని అమలు చేయడంలోనే సరైన విధానాలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఉద్యమ్ కింద 14 లక్షల ఎంఎస్ఎంఇలను రిజిస్టర్ చేసినట్లు కూడా అధికారులు చెబుతున్నారు. ఇలా రిజిస్టర్ అయిన వాటికి లభించిన ప్రయోజనాలు ఏమిటి, ఎంతమంది లబ్ధి పొందారన్నది విస్పష్టంగా తెలియడం లేదు. రాష్ట్రంలో ఎక్కువగా కృష్ణా, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, ఎన్‌టిఆర్ వంటి జిల్లాల్లోనే 70 శాతం వరకు ఎంఎస్ఎంఇలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిల్లో మహిళలు నిర్వహించేవే అధికంగా ఉన్నాయి. ఈ సమయంలో లెక్కలతో సరిపెట్టకుండా నిజమైన అభివృద్ధికి ప్రయత్నిస్తే ఎంఎస్ఎంఇలు మనుగడ మెరుగ్గా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పల్నాడులో బర్డ్‌ఫ్లూ కలకలం

- ఆందోళన అవసరం లేదు : డిఎం అండ్ హెచ్‌ఒ బి.రవికుమార్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా; అమరావతి బ్యూరో

బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1) కారణంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి ఆరాధ్య మృతి చెందినట్లు నిర్ధారణ కావడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవికుమార్ స్పందించారు. నరసరావుపేటలో కలెక్టరేట్ వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడారు. గత నెలలో నరసరావుపేటలో ఓ చిన్నారిని జ్వరం, ఫిట్స్ లాంటి లక్షణాలతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారని చెప్పారు. 2, 3 రోజులకు ఆరోగ్యం కొంత మెరుగైందని తెలిపారు. ఆ తర్వాత మళ్లీ జ్వరం తిరగబెట్టడంతో మంగళగిరి ఎయిమ్స్‌లో చేర్పించారని చెప్పారు. ఆ పాప చికిత్స పొందుతూ గత నెల 15న మృతి చెందిందని, లెప్టోస్పైరోసిస్ (పురుగు కాటు వల్ల వచ్చే వ్యాధి) వల్ల అలా జరిగిందని ఎయిమ్స్ పరీక్షల్లో ప్రాథమికంగా తెలిసిందన్నారు. అదనంగా, రక్త నమూనాలను పరీక్షలకు పంపగా బర్డ్‌ఫ్లూ లక్షణాలు కూడా ఉన్నట్లు మార్చి 25, 26 తేదీల్లో వెల్లడైందని. చెప్పారు. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. చిన్నారి నివాసిత ప్రాంతంలో రెండ్రోజులుగా 1,500 మందికిపైగా పరీక్షలు నిర్వహించామని, ఎవరిలో బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించలేదని తెలిపారు. చిన్నారి కుటుంబ సభ్యుల్లో కూడా ఎలాంటి లక్షణాలూ లేవని చెప్పారు. నెల రోజుల క్రితం జరిగిన ఈ ఘటన విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఆందోళనా అవసరం లేదన్నారు. బర్డ్ ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు ఇంతకాలం ఉండవని తెలిపారు. సాధారణంగా బర్డ్ ఫ్లూతో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతాయని, అలాంటిది పల్నాడు జిల్లాలో ఎక్కడా నమోదు కాలేదని డిఎం అండ్ హెచ్‌ఒ చెప్పారు. ప్రజలు ధైర్యంగా చికెన్ తినొచ్చన్నారు బాగా ఉడికించుకోవాలని సూచించారు. పచ్చి కోడి మాంసం తినడం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడం చిన్నారి మరణానికి దారితీసిందని వైద్యులు గుర్తించారు. చిన్నారి కుటుంబసభ్యులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు.

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ఉనికి లేదు : పశుసంవర్ధక శాఖ

మార్చి నెలలో రాష్ట్రంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ నమోదు కాలేదని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహ చెందాల్సిన పనిలేదని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి దామోదరనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రెండు నెలల కిందట కొన్ని ప్రాంతాల్లో కోళ్లలో బర్డ్ ఫ్లూ సోకిందని తెలిపారు. ప్రభుత్వం, కోళ్ల పెంపకందారులు సంయుక్తంగా సరైన చర్యలు తీసుకోవడం ద్వారా బర్డ్‌ఫ్లూను నియంత్రించగలిగినట్లు పేర్కొన్నారు.

ఇన్‌ఫ్లూయేంజా పట్ల అప్రమత్తం : ఎయిమ్స్

ఇన్‌ఫ్లూయేంజా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి ఎయిమ్స్ పేర్కొంది. ఈ మేరకు ఎయిమ్స్ మీడియా సెల్, ప్రొటోకాల్ విభాగం స్పోక్స్‌పర్సన్ వంశీకృష్ణారెడ్డి కొల్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్లూ లక్షణాలు జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా శరీరంలో నొప్పులు వంటివి కనిపిస్తే రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించడం మంచిదని సూచించారు. ఫ్లూ సంబంధిత సమస్యలు ఉంటే సకాలంలో రోగ నిర్ధారణ చికిత్స కోసం సమీపంలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఇన్‌ఫ్లుయేంజా కేసుకు సంబంధించి వివరణ తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన రెండు సంవత్సరాల ఆడశిశువును జ్వరం, శ్వాసకోశ సమస్య లక్షణాలతో మార్చి నాలుగున పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్పించారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో చేరిన సమయంలో ఆ బిడ్డకు లెప్టోస్పిరోసిస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. నాసోఫారింజియల్ స్వాబ్ పరీక్ష ద్వారా ఇన్‌ఫ్లుయేంజా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. ఇన్‌ఫ్లూయేంజా ఉప రూపాంతరాలను గుర్తించడానికి నమూనాను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామని తెలిపారు. ఉవిఎన్ ఇన్‌ఫ్లూయేంజా (హెచ్5ఎన్1)గా నిర్ధారణ అయిందని వివరించారు. వైద్య సంరక్షణ పొందినప్పటికీ ఆ చిన్నారి పరిస్థితి క్షీణించి మార్చి 15న మరణించిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మంగళగిరి ఎయిమ్స్‌లో ఇటువంటి కేసులు నమోదు కాలేదనిపేర్కొన్నారు.

హస్త కళలకు మరింత ప్రాచుర్యం

- చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత
- ఎన్ఐడితో ఎంఒయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో హస్త కళలకు మరింత ప్రాచుర్యం తీసుకొస్తామని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దీనికోసం హస్త కళాకారులకు నూతన డిజైన్లు, సరికొత్త ఆకృతుల తయారీపై శిక్షణతోపాటు ఉత్పత్తులు మార్కెట్ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ (ఎపిహెచ్‌డిసి), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ మధ్య రెండు ఒప్పందాలు బుధవారం సచివాలయంలో కుదిరాయి. మంత్రి సవిత, చేనేత, జౌళిశాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్ సమక్షంలో ఈ ఒప్పందాలపై లేపాక్షి ఎమ్‌డి విశ్వ, ఎన్ఐడి అహ్మదాబాద్ డైరెక్టర్ అశోక్ మండల, ఎపి డైరెక్టర్ బవుమిక్ నగర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల ప్రకారం రెండేళ్లపాటు బనానా ఫైబర్, గుర్రపు డెక్కలతో ఉత్పత్తుల తయారీపై హస్తకళాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. హస్త కళాకారులకు నూతన అభిరుచులకు అనుగుణంగా శిక్షణ అందిస్తామన్నారు. ఈ ఒప్పందాలు వల్ల రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంతోపాటు గ్రామీణ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి, కళాకారుల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని చెప్పారు. రాష్ట్ర హస్తకళల పరిశ్రమ ఉనికి ప్రపంచ మార్కెట్‌లో బలోపేతమవుతుందని మంత్రి ఆకాంక్షించారు.


సంచార జాతుల అభివృద్ధే సిఎం ధ్యేయం

రాష్ట్రంలో సంచార జాతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని మంత్రి సవిత పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు అందజేస్తామని వెల్లడించారు. ఎంబిసి కుల సంఘాల నాయకులతో సచివాలయంలో బుధవారం ఆమె సమావేశమయ్యారు. సంచార జాతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుతామని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తామని, కళాకారులకు పెన్షన్ల మంజూరు విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎంబిసికి చెందిన సంచార జాతులతో స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నూతన ఆవిష్కరణకు ఎపి వేదిక

- వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు
- పారిశ్రామికవేత్తలకు, మేధావులకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



నూతన ఆవిష్కరణలకు ఎపిని వేదిక చేయాలని, వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. నూతన ఆవిష్కరణలతోపాటు పెట్టుబడులనూ తేవాలన్నారు. బుధవారం సచివాలయం నుండి పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌పై సిఎం సమావేశం నిర్వహించారు. దీనికి టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. విదేశాల్లో తలసరి ఆదాయం ఎక్కువగా ఆర్జిస్తున్న వారికి 30 శాతం మంది తెలుగువారు ఉన్నారని పేర్కొన్నారు. గతంలో తాను తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలకు అవకాశాలు వచ్చాయని తెలిపారు. గతంలో హైదరాబాద్‌ను ఐటి హబ్‌గా మార్చినట్లుగానే ఇప్పుడు అమరావతిని క్వాంటర్ వ్యాలీగా చేయాలనేది తన సంకల్పమని చెప్పారు. ఈసారి జీరో పావర్టీ కోసం పి4 కార్యక్రమం ప్రవేశపెట్టామని అన్నారు. సమాజంలో ఉన్నత వర్గాలు అట్టడుగున ఉన్న పేదలకు అండగా నిలవడమేనని తెలిపారు. అంబేద్కర్, అబ్దుల్‌కలాం వంటి వారు ఇతరుల సాయంతోనే పైకి వచ్చారని సిఎం అన్నారు. పి4 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న బిట్స్ పిలానీ విసి వి రామగోపాలరావు మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ఏర్పాటు చేస్తామని, క్వాంటమ్ వ్యాలీలో భాగస్వాములం అవుతామని చెప్పారు. విశాఖపట్నంలో జిఎంఆర్ ఐటి ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జిఎంఆర్ సంస్థల అధినేత పేర్కొన్నారు.

20 వేల స్టార్టప్‌లు

వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల ద్వారా లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని, 10 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు వస్తాయని సిఎం తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుందని, దీనికి టాటా గ్రూపు లీడర్‌గా ఉంటుందని పేర్కొన్నారు. ఎల్‌అండ్‌టి, ఎఎంఎన్ఎస్ పార్ట్‌నర్లుగా వ్యవహరిస్తాయన్నారు. దీనికి ఐదు విభాగాలు ఉంటాయని పేర్కొన్నారు. దీనిలో భాగంగా అనంతపురానికి జెఎస్‌డబ్ల్యు, తిరుపతికి అదానీ, విజయవాడకు మేఘా, రాజమహేంద్రవరానికి గ్రీన్‌కో, విశాఖపట్నానికి జిఎంఆర్ గ్రూపులు వ్యవహరిస్తాయని సిఎం తెలిపారు.

ఎమ్మెల్సీలుగా ఐదుగురు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనమండలికి ఇటీవల ఎంపికైన ఐదుగురు శాసనమండలి సభ్యులు సోమువీర్రాజు, బిటి నాయుడు, కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు), పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ భవనంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సభ్యులతో మండలి సభ్యులుగా బుధవారం ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన నాగబాబు దంపతులు

ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం నాగబాబు ఆయన సతీమణి పద్మజతో కలిసి సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎంను నాగబాబు శాలువాతో సత్కరించారు. అనంతరం నాగబాబును సిఎం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని నాగబాబుకు సిఎం బహూకరించారు.

నిబంధనలు అతిక్రమించిన మందుల షాపులపై కేసులు

- త్వరలో 'డెకాయ్ ఆపరేషన్స్'
- ఈగల్ ఐజి రవికృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆపరేషన్ గరుడలో భాగంగా మందుల షాపులపై నిర్వహించిన దాడుల్లో నిబంధనలు అతిక్రమించిన 158 షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఈగల్ ఐజి రవికృష్ణ తెలిపారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం ఈగల్, డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీమాంధ్ర డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజి రవికృష్ణ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఎక్స్, ఎక్స్ఆర్ఎక్స్ డ్రగ్స్ ఎటువంటి ప్రిసిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మందుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన బిల్ బుక్స్‌ను సరైన పద్ధతిలో నిర్వహించడం లేదన్నారు. అంతేకాకుండా కాలంచెల్లిన మందులను నిరక్షరాస్యులు, పిల్లలు, వృద్ధులకు డిస్కౌంట్ పేరుతో అమ్ముతున్నట్లు ఈగల్ గుర్తించిందన్నారు. అటువంటి మందుల షాపులపై ఎన్‌డిపిఎస్ అండ్ డ్రగ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం సీజ్, వార్నింగ్ మెమో, లైసెన్స్‌లను రద్దు చేయడంతోపాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. డాక్టర్ ప్రిసిప్కన్స్ లేకుండా సైకోట్రిక్స్ మందులు ఇవ్వబోమనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో డ్రగ్ డీలర్ల అసోసియేషన్స్ ముందుకు రావాలన్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్‌ను అరికట్టడానికి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్స్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పి నగేష్‌బాబు, డిజి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాద్, సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యులు, ఈగల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పట్టణాల్లో వాటర్ రిసోర్స్ రికవరీ సెల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమృత్ 2.0 సంస్కరణల్లో భాగంగా జల్ హై అమృత్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో కూడిన వాటర్ రిసోర్స్ రికవరీ సెల్ (డబ్ల్యుఆర్ఆర్‌సి)ని ఏర్పాటు చేసింది. నీటి వినియోగం, నిర్వహణకు సంబంధించి ఈ కమిటీ నిర్ణయాలు చేయనుంది. ఈ మేరకు బుధవారం పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎపియుఎఫ్ఐడిసి ఎమ్‌డి ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఎపిపిసిబి, జలవనరులశాఖ, ఎపిఐఐసి, విశాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్లు సభ్యులుగా ఉండనున్నారు. వారితోపాటు పిహెచ్ ఇఎన్‌సి, ఎపి ట్రాన్స్‌కో ప్రతినిధి, విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ నుండి సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ సభ్యులుగా ఉంటారు. దీనికి ఎపియుఎఫ్ఐడిసి చీఫ్ ఇంజినీరు మెంబర్ కన్వీనరుగా ఉంటారు.

ఎస్‌వియులో ఆగని చిరుత దాడులు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి)





తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాలలో రెండు సంవత్సరాలుగా చిరుత పులి యథేచ్ఛగా సంచరిస్తోంది. రెండు రోజుల క్రితం ప్రధాన లైబ్రరీ వెనుక భాగంలో ఒక జింక పిల్లపై దాడి చేసింది. బుధవారం ఇంజనీరింగ్ కళాశాల సభ సమీపంలో ఒక తల్లి జింకపై దాడి చేసింది. చిరుత సంచారంతో అటవీశాఖ ఉన్నతాధికారులు పలు చోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. బోన్‌లో చిక్కకుండా చిరుత తప్పించుకుంటోంది. వర్సిటీలో ఉదయం ఏడు గంటల లోపు సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎవరూ సంచరించవద్దని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. చిరుత పులి ఇక్కడే పిల్లల్ని కని, ఈ ప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకుని పిల్లలకు ఆహారం అందించేందుకు పరిసర ప్రాంతాల్లోని కుక్కలను, జింకలను, పందులను వేటాడుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోందని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

మోడీ సర్కార్‌పై ధర్మ యుద్ధం

- 'బిసిల పోరు గర్జన' ధర్నాలో తెలంగాణా సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిసి రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం అనుమతించకుంటే బలహీన వర్గాలు.. మోడీ సర్కార్‌పై ధర్మ యుద్ధం ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతినిస్తే 10 లక్షల మందితో సభ పెట్టి ప్రధాని హోదాలో మోడీని సన్మానిస్తామన్నారు. ఇకపై విజ్ఞప్తులు తీసుకొని హస్తినకు రామని, బిజెపి నేతలు ఎలా గల్లీలోకి వస్తారో చూస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లకు కేంద్రం అనుమతించాలని బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో 12 బిసి సంఘాలు 'బిసిల పోరు గర్జన' ఆందోళన చేపట్టాయి. ఈ ఆందోళనలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ రిజర్వేషన్లకు మద్దతుగా దాదాపు 17 పార్టీల నుంచి సుమారు 60 మంది ఎంపిలు జంతర్ మంతర్‌లో బిసిల పోరు గర్జనకు సంఘీభావం తెలిపాయన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

త్వరలో వియత్నాంలో చైనా, ఇయు నేతల పర్యటన

హనోయ్ : అమెరికా అధ్యక్షులు ట్రంప్ టారిఫ్ ముప్పుల నేపథ్యంలో రాబోయే వారాల్లో చైనా, యురోపియన్ యూనియన్ (ఇయు) నేతలు వియత్నాంలో పర్యటిస్తున్నారు. వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త అవకాశాలను అన్వేషించడం, సృష్టించుకోవడం ఈ పర్యటనల లక్ష్యంగా వుంది. ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త టారిఫ్‌లను ఈ దేశాలన్నీ ఎదుర్కొంటున్నాయి. ఈ నెల 14న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వియత్నాం నేతలతో భేటీ అవుతారని భావిస్తున్నారు. గత 18 మాసాల్లో జిన్‌పింగ్ వియత్నాంలో పర్యటించడం ఇది రెండవసారి. కంబోడియా, మలేసియాలతో సహా ఆగ్నేయాసియా దేశాల్లో జిన్‌పింగ్ విస్తృతంగా పర్యటించనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ పర్యటన ఎప్పుడు ప్రారంభమవుతుందనే సమాచారం ఇంకా లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పత్రికా సమావేశంలో తెలిపింది. వియత్నాం విదేశాంగ శాఖ కూడా దీనిపై స్పందించలేదు. చైనాతో ఉత్తర వియత్నాంను రైల్వే నెట్‌వర్క్ ద్వారా కలపడంతో సహా వాణిజ్య అంశాలు చర్చకు రానున్నట్లు వియత్నాం వర్గాలు తెలిపాయి. మారుతున్న ట్రంప్ విధానాల నేపథ్యంలో ప్రధాన దేశాలు వ్యూహాత్మక సద్దుబాట్లకు దిగుతున్నారని, ఆ పరిస్థితుల్లోనే జిన్‌పింగ్ పర్యటన కూడా జరుగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. జిన్‌పింగ్ పర్యటనకు కొద్ది రోజులు ముందుగా స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఈ నెల 9న వియత్నాం నేతలను కలవనున్నారు. అనంతరం ఇయు వాణిజ్య కమిషనర్ మారోస్ సెఫ్‌కొవిక్ కూడా వియత్నాం నేతలతో భేటీ కానున్నారు. తదనంతర వారాల్లో ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్ కూడా హనోయ్‌లో పర్యటించనున్నారని ఇయు అధికారులు, దౌత్యవేత్తలు తెలిపారు. టారిఫ్‌లు, ఎగుమతి నియంత్రలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విశ్వసనీయమైన భాగస్వాములతో వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త అవకాశాలు సృష్టించాలనుకుంటున్నామని వాన్ డెర్ లేయన్ గత నెల్లో హనోయ్‌లో సమావేశమైనపుడు ఆసియాన్ ఉన్నతాధికారులతో చెప్పారు.

ఛత్రపతి శివాజీ వంద శాతం సెక్యులర్ పాలకుడు : నితిన్ గడ్కరి

న్యూఢిల్లీ : ఛత్రపతి శివాజీ మహారాజ్ వంద శాతం సెక్యులర్ పాలకుడు అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. శివాజీ ఎన్నో యుద్ధాల్లో విజేతగా నిలిచినా.. ఒక్క మసీదును కూడా ధ్వంసం చేయలేదని గడ్కరి అన్నారు. విశ్వాస్ పాటిల్ రాసిన 'ది వైల్డ్ వార్‌ఫ్రంట్' అనే పుస్తకం ఆంగ్ల అనువాదాన్ని కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడ్కరి మాట్లాడుతూ "శివాజీ మహారాజ్ ఒక ఆదర్శవంతమైన పాలకుడు. ఆదర్శనీయుడైన ఓ తండ్రి. ఆయన వంద శాతం సెక్యులర్. ఎన్నో యుద్ధాలను గెలిచినా గానీ ఒక్క మసీదునూ ఆయన ధ్వంసం చేయలేదు. ప్రస్తుతం పెద్ద పెద్ద నాయకులు కూడా కులం, మతం గురించి మాట్లాడుతుండటం దురదృష్టకరం. కులం, మతం గురించి ఎవరూ మాట్లాడొద్దు' అని గడ్కరీ అన్నారు.

పదవీ విరమణ రోజే ప్రాణాలు కోల్పోయిన లోకో పైలట్

రాంచీ : జార్ఖండ్‌లో ఒక లోకోపైలట్‌కు పదవీ విరమణ రోజే జీవితంలో చివరి రోజు అయ్యింది. సాహెబ్‌గంజ్ జిల్లాలో రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో లోకో పైలట్ గంగేశ్వర్ మరణించడంతో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు రాంచీలోని సాహిబ్‌గంజ్ జిల్లాలో విద్యుత్ సంస్థ ఎన్‌టిపిసికి చెందిన రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు గూడ్సు రైళ్ల డ్రైవర్లు మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మరణించిన లోకో పైలట్ గంగేశ్వర్ మంగళవారమే పదవీ విరమణ చేయాల్సి ఉంది. విధుల్లో చివరి రోజున తోటి వారితో కలిసి సరదాగా గడిపి..ఎన్నో జ్ఞాపకాలతో తిరిగి వస్తాడనుకున్న తన తండ్రి ఇంకెప్పటికీ రాడనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని అతడి కుమార్తె కన్నీరుమున్నీరైంది. రేపటి నుంచి ఇంట్లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటానని ఆనందంగా చెప్పి వెళ్లిన తండ్రి విగతజీవిగా తిరిగి వచ్చాడని ఆవేదన వ్యక్తం చేసింది.

బిల్లుల తయారీలో బిఎస్ఎన్ఎల్ వైఫల్యం

- రిలయన్స్ జియో నుంచి బకాయిల వసూలులో తాత్సారం
- పదేళ్లలో కేంద్రానికి 1,757 కోట్ల నష్టం
- ఎత్తిచూపిన కాగ్

న్యూఢిల్లీ : గత పది సంవత్సరాలుగా రిలయన్స్ జియో నుండి రావాల్సిన బకాయిలకు సంబంధించి బిల్లులను తయారు చేయడంలో ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ విఫలమైంది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి ఈ కాలంలో రూ.1,757.56 కోట్ల నష్టం వాటిల్లింది. బిఎస్ఎన్ఎల్ కు చెందిన మౌలిక సదుపాయాలను ఉపయోగించుకున్నందుకు రిలయన్స్ జియో దానికి ఏటా కొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అయితే దానిని సంబంధించిన బిల్లులను తయారు చేసి, రిలయన్స్ జియోకు అందజేయడంలో బిఎస్ఎన్ఎల్ విఫలమైందని మంగళవారం విడుదల చేసిన నివేదికలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వేలెత్తి చూపింది. ఫలితంగా రిలయన్స్ జియో వద్ద 2014 మే నుండి బకాయిలు పేరుకుపోయాయని తెలిపింది.

మౌలిక సదుపాయాలను వాడుకునే విషయంలో బిఎస్ఎన్ఎల్ , రిలయన్స్ జియో మధ్య ఒప్పందం ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకొని బకాయిలు రాబట్టుకోవడంలో బిఎస్ఎన్ఎల్ విఫలమైందని కాగ్ నివేదిక చెప్పింది. టెలికం మౌలిక సదుపాయాలు కల్పించిన వారికి (టిప్స్) చెల్లించిన రెవెన్యూ వాటా నుండి తనకు రావాల్సిన లైసెన్స్ ఫీజును మినహాయించుకోవడంలో కూడా బిఎస్ఎన్ఎల్ విఫలమైంది. ఫలితంగా రూ.38.36 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. 'రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ (ఎంఎస్ఏ) అమలయ్యేలా చూడడంలో బిఎస్ఎన్ఎల్ విఫలమైంది. బిఎస్ఎన్ఎల్ మౌలిక సదుపాయాలలో అదనపు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్నందుకు రిలయన్స్ జియో చేయాల్సిన చెల్లింపులకు సంబంధించి బిల్లులే సమర్పించలేదు. ఫలితంగా రూ.1,757.76 కోట్ల నష్టం వాటిల్లింది. దానిపై వడ్డీని కూడా కోల్పోయింది. 2014 మే నుండి 2024 మార్చి వరకూ ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చింది' అని కాగ్ తన నివేదికలో వివరించింది.

'రిలయన్స్ జియోతో కుదుర్చుకున్న ఎంఎస్ఏలో పొందుపరచిన నియమ నిబంధనలను బిఎస్ఎన్ఎల్ పట్టించుకోలేదు. ఎస్కలేషన్ క్లాజును వర్తింపచేయకపోవడంతో మౌలిక సదుపాయాల షేరింగ్ ఛార్జీలలో జీఎస్టీ సహా రూ.29 కోట్ల నష్టం వచ్చింది' అని కాగ్ తన నివేదికలో తెలియజేసింది.

పారిశుధ్య కార్మికుడికి రూ.34 కోట్ల ఆదాయ పన్ను!

ఆగ్రా : కేవలం రూ.15 వేల జీతం సంపాదిస్తున్న ఓ పారిశుధ్య కార్మికుడు రూ.34 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఆదాయ పన్ను విభాగం నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు. దీంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన కరణ్‌కుమార్ ఖైర్‌లో ఉన్న ఎస్‌బిఐ బ్రాంచ్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. ఇటీవల ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి నోటీసులు అందాయి. "2019-2020లో కరణ్ రూ.34 కోట్ల ఆదాయాన్ని పొందారు. ఆ ఏడాదికి ఎలాంటి రిటర్న్లు ఫైల్ చేయలేదు" అని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. వారు చెప్పిన లెక్కలతో తీవ్ర ఆందోళనకు గురైన అతడు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. అయితే, కరణ్‌కుమార్ పాన్ కార్డ్ వివరాలను ఎవరైనా దుర్వినియోగం చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాను గతంలో పనిచేసిన యజమానికి తన పాన్ వివరాలు, గుర్తింపు పత్రాలు సమర్పించిన విషయాన్ని కరణ్ గుర్తుచేసుకున్నారు. కాగా, ఇటీవల అలీగఢ్‌కు చెందిన జ్యూస్ సెంటర్ వ్యాపారికి రూ.7.5 కోట్లు చెల్లించాలని నోటీసులు అందిన సంగతి తెలిసిందే.

అమెరికాలో విదేశీ విద్యార్థులపై ఎఐ నిఘా

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. అక్కడి విదేశీ విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఎట్నుంచి ఏ ముప్పు వచ్చి మీదపడుతుందోనని వారంతా బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కొందరు విదేశీ విద్యార్థులపై ట్రంప్ యంత్రాంగం బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. వీరంతా స్వచ్ఛందంగా అమెరికాను వదిలిపెట్టి వెళ్లిపోవాలంటూ వందలాది మందికి యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ (డీఓఎస్) నుంచి ఇటీవలే ఈ-మెయిళ్లు అందాయి. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులతోపాటు.. ఆందోళనల్లో పాల్గొన్న వారిని, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్, లైక్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ నేపథ్యంలో ట్రంప్ యంత్రాంగం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విదేశీ విద్యార్థులపై నిఘా పెట్టేందుకు కృత్రిమ మేధస్సు (ఎఐ) టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడంతోపాటు.. సోషల్ మీడియాలో వారికి అనుకూల పోస్టులు పెడుతున్న వారిని గుర్తించేందుకు ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎఐ టెక్నాలజీతో అంతర్జాతీయ విద్యార్థులపై నిఘా పెట్టే ఈ కార్యక్రమానికి విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వం వహిస్తున్నారని విదేశాంగ శాఖ సీనియర్ అధికారులు తెలిపారు.

ఔషధాల ధరల పెంపు సరికాదు.. : మమత

కొల్‌కతా: ఏప్రిల్ 1 నుంచి దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరల పెంపుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔషధాల ధరలు పెంచడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ బెంగాల్ వ్యాప్తంగా ఏప్రిల్ 4-5 తేదీల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోగులకు వైద్యులు మందులు రాసినప్పుడు వారు 40, 50, 60 శాతం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుందన్న మమత ప్రభుత్వం మందుల ధరలను ఎందుకు పెంచుతోందని అడిగారు. కేంద్రం నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

సంపాదకీయం

ప్రభుత్వ బడి

'ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అంటారు నెల్సన్ మండేలా. సమాజ పురోగమనంలో విద్య యొక్క కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. భారతదేశంలో మితవాద ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం జాతి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోంది. నయా ఉదారవాద విధానాల పుణ్యమా అని సమాజంలో ఎక్కువ మందికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది. 'ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అందరూ ఉద్యమించాలని, విద్య అందరికీ చేరువైతేనే సామాజిక న్యాయం దక్కుతుందని, మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచకపోగా, రేషనలైజేషన్ పేరుతో పెద్దయెత్తున ప్రభుత్వ స్కూళ్లు మూసివేసేందుకు రాష్ట్రప్రభుత్వం యత్నిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచే ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ఉంచేటట్లు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ పిలుపునివ్వడం అత్యంత సముచితం. 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' అన్న నినాదం ఊపందుకోవాలి.

ప్రభుత్వ పాఠశాల అంటేనే... చిన్నచూపు. ఉన్నతమైన చదువులు చదవాలంటే కార్పోరేట్ పాఠశాలలు, కాలేజీలే మేలన్న అపోహతో కొందరు ఎల్‌కెజీ నుంచే లక్షలు ఖర్చుచేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49 శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, ప్రైవేట్ బడుల్లో చదివేవారి సంఖ్య 51 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021 ఏప్రిల్ నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం... ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 44,54,038. జీవో 117 పేరుతో పాఠశాలల సంఖ్యను కుదించిన తర్వాత...కచ్చితమైన లెక్కలు బహిర్గతం కావడంలేదు. ఉపాధ్యాయ సంఘాలు సేకరించిన సమాచారం మేరకు 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించే బడులు 4600 వుంటే, దానిలో 20లోపు ఎన్‌రోల్‌మెంట్ ఉన్న బడులు 2,730. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల పైచిలుకు ఉంటే... 20 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు 8,900 వరకు ఉన్నాయి. సుమారుగా 12,000 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించిన వివరాలు ప్రభుత్వం అధికారికంగా ఎక్కడా వెబ్‌సైట్‌లో పెట్టలేదు. కానీ, 36 లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం లేదని లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో పెద్దఎత్తున ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, తగినన్ని మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల విద్యలో నాణ్యత పడిపోతోంది. దీంతో ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. విద్యార్థులు తగినంత మంది లేరన్న సాకుతో ప్రభుత్వం వీటిని మూసివేస్తోంది. ఇదంతా విద్య ప్రైవేటీకరణకు ప్రభుత్వం ఆడుతున్న నాటకం.

తల్లిదండ్రులు సైతం... ప్రభుత్వ బడుల్లో చదువు చెప్పే ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించడం లేదు. ప్రభుత్వం బడి పట్ల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఆ యా తరగతిలో సామర్థ్య ఆధారిత బోధన అందిస్తామనే భరోసాను, నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలి. పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటిస్తూనే... ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలి. అంతేకాదు, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు తల్లిదండ్రులను, విద్యావేత్తలను కలుపుకుని ఒక ఉద్యమంగా కదలాలి. నాణ్యమైన విద్యకు ప్రాధాన్యమివ్వడంలో కేరళ దేశంలోనే ప్రథమ స్థానంలో వుంది. విద్యపై చేసే ఖర్చును భావితరాల భవితకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. ఇలా నాణ్యమైన విద్య అందించడమన్నది ప్రభుత్వ అజెండాగా వుండాలి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే ఎజెండాగా పెట్టుకున్నాయి. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారానే సమాజంలో అందరికీ విద్య అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ బడి అమ్మ ఒడిలా మారాలి. ప్రతి చిన్నారీ బడి మెట్లెక్కాలి. అప్పుడే ప్రభుత్వ విద్య లక్ష్యం సాకారమౌతుంది. నైతిక, రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయి.

మహనీయుల మాట




ప్రతి మనిషికి
మరణం వుంటుంది కానీ...
మానవత్వానికి కాదు.
- మదర్ థెరిసా

టెలికాంలోకి మస్క్ ప్రవేశం ఉత్థానమా! పతనమా?

విశ్లేషణ

ప్రబీర్ పురకాయస్థ





గతంలో స్పెక్ట్రమ్‌ను బహిరంగ వేలం పాట ద్వారా కేటాయించాలని కోరిన జియో కంపెనీ ఇప్పుడు ఏం చెబుతుందో చూడాలి. ఎయిర్‌టెల్ కంపెనీ మాదిరే పరిపాలనా పద్ధతిలో స్పెక్ట్రమ్ కేటాయించమని అడుగుతుందా లేక మొదటగా లేవనెత్తినట్లు వేలంపాట వెయ్యమని అడుగుతుందా? అదేగాక నిన్నా మొన్నటి వరకు ఈ రెండు కంపెనీలు స్టార్‌లింక్ కంపెనీ ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉన్నట్టుండి తమ వైఖరి మార్చుకుని అదే కంపెనీతో అంటకాగడానికి ఎందుకు సిద్ధపడినట్లు? ఇవి కేవలం సందేహాలో, ప్రశ్నలో కాదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక వివిధ దేశాల్లో ఉన్న వనరులను కొల్లగొట్టడానికి ఏకపక్షంగా వాణిజ్య యుద్ధానికి తెర తీశాడు.

అమెరికన్ కుబేరుడు ఎలాన్ మస్క్ తాజాగా ఒక ప్రకటన చేస్తూ భారతదేశంలోని (రిలయన్స్) జియో, భారతి ఎయిర్‌టెల్ కంపెనీలతో తన స్పేస్-ఎక్స్, స్టార్ లింక్ కంపెనీ వాణిజ్య భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకొనున్నదని ప్రకటించాడు. ఈ ప్రకటన అనేక సందేహాలు రేకెత్తిస్తున్నది. ఇందులో రెండు ప్రధానమైన ప్రశ్నలు ఇమిడి ఉన్నాయి. 1. టెలికాం రంగంలో మరింత గుత్తాధిపత్యానికి దారి తీయనున్నదా? 2. అంతరిక్ష స్పెక్ట్రమ్‌ను వేలం వెయ్యకుండా స్టార్‌లింక్ కంపెనీకి కట్టబెట్టడం నిబంధనలను అతిక్రమించడం కాదా? అన్నిటికీ మించి కీలకమైన ఈ వనరును ఈ రకంగా వాణిజ్య కార్యకలాపాలకు కట్టబెట్టడం దేశ భద్రతకు, జాతీయ ప్రయోజనాలకు భంగం కాదా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

టెలికాం రంగంలో జియో, ఎయిర్ టెల్ కంపెనీలే ఇప్పుడు దాదాపు 75 శాతం వాటా కలిగి ఉన్నాయి. తాజాగా ఈ రెండు కంపెనీలతో స్టార్ లింక్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా మార్కెట్‌పై ఈ కంపెనీల గుత్తాధిపత్యం మరింత బలపడనున్నది. వొడా ఫోన్, బి.ఎస్.ఎన్.ఎల్ కంపెనీలు పై రెండు కంపెనీలకు ఎంత మాత్రం పోటీ ఇచ్చే పరిస్థితిలో లేవు. ఇలాంటి నేపథ్యంలో అంతరిక్ష స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వమే రెండు కంపెనీలకు ప్రాధాన్యతా కేటాయింపులు చెయ్యడం ద్వారా మార్కెట్‌లో ఆ రెండు కంపెనీలు మరింత బలపడడానికి నేరుగా సహకరించడం చట్టబద్ధమేనా? దీని మూలంగా వినియోగదారుల ప్రయోజనాలు దెబ్బతినవా?

ఈ ఒప్పందం అమలయితే కీలకమైన కమ్యూనికేషన్ సేవల కోసం దేశంలోని రెండు ప్రధాన టెలికాం కంపెనీలు అమెరికన్ కంపెనీ మీద ఆధారపడాల్సి వస్తుంది. ఇది టెలికాం రంగంలో మన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసుకోవడం కాదా? స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వమే ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి సాధనంగా మారడం, కీలకమైన కమ్యూనికేషన్ల రంగాన్ని ఒక విదేశీ సంస్థకు అప్పచెప్పడం మోడీ ప్రభుత్వానికే చెల్లింది. 'స్టార్ లింక్ కంపెనీ వాటా స్వల్పమే కదా, అట్లాంటప్పుడు టెలికాం రంగం మీద దాని అధిపత్యం ఎలా ఏర్పడుతుంది?' అని కొంతమంది అడ్డ సవాళ్ళు విసురుతున్నారు. స్టార్‌లింక్ కంపెనీ వాటా ఎంత తక్కువయినా ఉపగ్రహాలకు 'ఫీడ్' చేసేది ఆ కంపెనీయే కాబట్టి మొత్తం కమ్యూనికేషన్ల వ్యవస్థ మీద దాని నియంత్రణ ఉంటుంది.

ఇహ ఇప్పుడు స్పెక్ట్రమ్ విషయానికి వద్దాం. 2జి స్పెక్ట్రమ్ లైసెన్సులను జారీ చేసినప్పుడు అది దేశంలోనే అతి పెద్ద కుంభకోణంగా చర్చ నడిచింది. సెక్ట్రమ్ అనేది కేవలం టెలికాం రంగానికే కాదు. టెలివిజన్ సేవలకు కూడా అత్యంత కీలకమైనది.

సెక్ట్రమ్ అంటే విద్యుత్ అయస్కాంత క్షేత్రం అని మనం చిన్నప్పుడు స్కూలు పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాం. ఈ విద్యుత్ అయస్కాంత క్షేత్రంలో రేడియో తరంగ దైర్ఘ్యాలు, కాంతి, ఎక్స్-రే, గామా కిరణాలు ఇమిడి ఉంటాయి. ఎక్స్‌రే, గామా కిరణాలను 'మెడికల్ ఇమేజింగ్'లో వినియోగిస్తారు. టెలికాం రంగంలో 2జి నుండి 5జి సేవల వరకు రేడియో తరంగ దైర్ఘ్యాల మీద ఆధారపడాలి. ఇది 900 మెగా హెర్ట్‌జ్‌లు (హెర్ట్జ్ అంటే సెకను కాలంలో సంభవించే తరంగ దైర్ఘ్యాలు). అయితే 2జి సేవలకు, ఆపై క్రమంగా 5జి సేవలకు 26 గిగా హెర్ట్‌జ్‌లు అవసరం. ఆనాడు కేంద్ర కమ్యూనికేషన్లు, టెలికాం శాఖా మంత్రిగా ఉన్న ఎ. రాజా 2జి స్పెక్ట్రమ్‌ను వేలం పాట ద్వారా వివిధ కంపెనీలకు కేటాయించారు. అయినప్పటికీ ఈ కేటాయింపులలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో సుప్రీం కోర్టులో కేసులు నడిచాయి. ఈ కేసులను విచారించిన సుప్రీం కోర్టు "అత్యంత అరుదైన ప్రకృతి వనరు అయిన స్పెక్ట్రమ్ కేటాయింపులు పారదర్శకంగా, బహిరంగ వేలంలో అమ్మాల"ని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదనంతరం కేటాయించిన 3జి, 4జి, 5జిలు సుప్రీం ఆదేశాలకు లోబడి వేలంపాట ద్వారా కేటాయించారు.

గత ఏడాది మే నెలలో మోడీ ప్రభుత్వం పరిపాలనా పద్ధతి ద్వారా స్పెక్ట్రమ్ కేటాయించాలని చేసిన ప్రయత్నాన్ని సుప్రీం కోర్టు నిలవరించింది. స్పెక్ట్రమ్‌ను వాణిజ్య సేవలు అందించడానికి వినియోగిస్తున్నారు కాబట్టి దానిని వేలంలో అమ్మి తీరాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటిది ఇప్పుడు సుప్రీం ఆదేశాలను ఉల్లంఘించి మోడీ ప్రభుత్వం స్పెక్ట్రమ్‌ను వేలంపాట ద్వారా కాకుండా జియో, ఎయిర్‌టెల్ కంపెనీలకు ఎలా కేటాయించింది?

ఇంకా ఆసక్తికరమైన అంశం ఏమిటంటే గతంలో ఇదే జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవల్లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ కంపెనీ ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. జియో కంపెనీ స్పెక్ట్రమ్‌ను బహిరంగ వేలం ద్వారా అమ్మాలని కోరింది. ఎయిర్‌టెల్ కంపెనీ మాత్రం పరిపాలనా పద్ధతిన కేటాయింపుకు అంగీకరించింది. కానీ స్టార్‌లింక్ కంపెనీ కోరుతున్నట్లు ఇరవయ్యేళ్ళ కాలానికి కాకుండా ఐదేళ్ళ కాలానికే కేటాయింపులు పరిమితం కావాలని కోరింది. ఇప్పటికే జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు వేర్వేరు కంపెనీలతో ఉపగ్రహ స్పెక్ట్రమ్ సేవల కోసం ఒప్పందాలు కుదుర్చుకుని ఉన్నాయి. జియో కంపెనీ లగ్జెంబర్గ్ లోని యస్.ఇ.యస్ కంపెనీతో ఎయిర్‌టెల్ కంపెనీ ఇ.యు టెలిశాట్ వన్ వెబ్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అంతరిక్ష విభాగం ఐ.ఎన్-స్పేస్ ఇ ఆమోద ముద్ర కూడా వేసింది. తాజాగా ఈ రెండు భారతీయ కంపెనీలు స్టార్‌లింక్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలలో స్పెక్ట్రమ్ వినియోగ రుసుం ఎంత చెల్లించనున్నాయనే అంశం గోప్యంగా ఉండిపోయింది. యస్.ఇ.యస్, వన్‌వెబ్ కంపెనీల కన్నా తక్కువ రుసుముకి స్టార్‌లింక్ తన సేవలు అందిస్తుందా లేక హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నామనే పేరిట ఎక్కువ రుసుము వసూలు చెయ్యనున్నదా అనేది స్పష్టం చెయ్యాల్సిన అవసరం ఉన్నది. 2-జి సెక్ట్రమ్ కేసులో సుప్రీంకోర్టు వేలంపాట పోటీలో మాత్రమే స్పెక్ట్రమ్‌ను అమ్మాలని తీర్పు ఇచ్చింది కాబట్టి స్టార్ లింక్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో స్పెక్ట్రమ్ సేవలకు చెల్లించాల్సిన రుసుము ఎలా నిర్ణయించారు? ఎంతని నిర్ణయించారు? ఈ రుసుము ఇప్పటికే ఆ సేవలు అందించడానికి సిద్ధపడిన కంపెనీ వసూలు చేసే రుసుము కన్నా తక్కువగా ఉన్నదా లేదా అనేవి తేల్చాల్సిన బాధ్యత మోడీ ప్రభుత్వం మీద ఉన్నది.

ఉపగ్రహ కమ్యూనికేషన్ల వ్యవస్థలో ఇతరత్రా అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. అంతరిక్ష ఆధారిత ఇంటర్నెట్ సేవలను (శాట్‌కాయ్) స్థిర కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు అందిస్తాయి. ఇవి అంతరిక్షంలో భూపరిభ్రమణ వేగంతో సమానమైన వేగంతో తిరుగుతూ విస్తారంగా శాట్‌కాయ్ సేవలు అందిస్తాయి. ఒకవేళ అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహానికి భూమికి మధ్యన సాపేక్షంగా కదలిక ఏదన్నా ఏర్పడితే అప్పుడు వినియోగదారులకు అంతరాయం లేకుండా ఇంటర్నెట్ సేవలు అందించడానికి ఆ ఉపగ్రహంతో అనుసంధానంగా మరిన్ని ఉపగ్రహాలు నెలకొల్పాల్సిన అవసరం ఏర్పడుతుంది. వీటినే 'లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ (ఎల్.ఇ.ఓ) లు అంటారు. అంటే భూమికి అతి దగ్గరలో ఉన్న కక్ష్యలో తిరుగాడే ఉపగ్రహాలు అన్నమాట. వీటి ద్వారానే అత్యధిక ప్రాంతాలకు టెలికాం సేవలు, బ్రాడ్‌బాండ్ సేవలు అందిస్తుంటారు. స్పేస్ ఎక్స్-స్టార్ లింక్ కంపెనీకి ఇలాంటి ఎల్.ఇ.ఓలు సుమారు 7000 పై చిలుకు ఉన్నాయి. త్వరలోనే మరిన్ని ఉపగ్రహాలను జత చెయ్యనున్నది.

అంతరిక్షంలో ఏ దేశం, ఏ కంపెనీ, ఎంత కక్ష్య ప్రాంతాన్ని వాడుకోవచ్చు అనే విషయమై ఇప్పటి వరకూ ఎలాంటి నియంత్రణ కానీ, అంతర్జాతీయ ఒప్పందాలు కానీ లేవు. ఎవరి శక్తి మేరకు వాళ్ళు ఆక్రమించుకోవడానికి అవకాశం ఉండడం మూలంగా బలం ఉన్న వాళ్ళకే అంతరిక్షం స్వంతం అవుతుంది. ఇది విపర్యవసానాలకు దారితీస్తుంది.

అంతరిక్షానికి పరిమితి లేకపోవచ్చుగానీ తరంగ దైర్ఘ్యాలకు పరిమితులు ఉన్నాయి. అంటే ఇంటర్‌నెట్ వినియోగం కోసం అంతరిక్షంలో తరంగ దైర్ఘ్యాల ప్రసరణ, పున:ప్రసరణలు ఆ యా సార్వభౌమ దేశాల నియంత్రణలో ఉంటాయి. కాబట్టి అంతరిక్ష ఆధారిత కమ్యూనికేషన్ల వ్యవస్థను వాడుకోవడానికి ఎంతమందికి, ఎంత సొమ్ము చెల్లిస్తే అనుమతులు ఇవ్వవచ్చు అనేది ప్రభుత్వ నిర్ణయాల మీద ఆధారపడి ఉంటుంది.

గతంలో స్పెక్ట్రమ్‌ను బహిరంగ వేలం పాట ద్వారా కేటాయించాలని కోరిన జియో కంపెనీ ఇప్పుడు ఏం చెబుతుందో చూడాలి. ఎయిర్‌టెల్ కంపెనీ మాదిరే పరిపాలనా పద్ధతిలో స్పెక్ట్రమ్ కేటాయించమని అడుగుతుందా లేక మొదటగా లేవనెత్తినట్లు వేలంపాట వెయ్యమని అడుగుతుందా? అదేగాక నిన్నా మొన్నటి వరకు ఈ రెండు కంపెనీలు స్టార్‌లింక్ కంపెనీ ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉన్నట్టుండి తమ వైఖరి మార్చుకుని అదే కంపెనీతో అంటకాగడానికి ఎందుకు సిద్ధపడినట్లు?

ఇవి కేవలం సందేహాలో, ప్రశ్నలో కాదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక వివిధ దేశాల్లో ఉన్న వనరులను కొల్లగొట్టడానికి ఏకపక్షంగా వాణిజ్య యుద్ధానికి తెర తీశాడు.

వివిధ దేశాల మీద ఇష్టారాజ్యంగా వాణిజ్య సుంకాలు విధించి ఆ యా దేశాల ప్రకృతి వనరులను అమెరికాకు కట్టబెట్టడానికి ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఇది వాణిజ్య యుద్ధాల ద్వారా నయా వలసవాదాన్ని నెలకొల్పడం అని భ్రమపడరాదు. ట్రంప్ నేరుగా ఒకప్పటి వలస పాలనను తిరిగి ప్రపంచ దేశాల మీద రుద్దాలని చూస్తున్నాడని గ్రహించాలి. హాంగ్‌కాంగ్ కేంద్రంగా ఉన్న కంపెనీకి పనామా కాల్వపై ఉన్న వాటాలను (షేర్లను) అమెరికాకు చెందిన బ్లాక్ రాక్ కంపెనీకి అమ్మించేలా పనామా దేశం మీద ఒత్తిడి తీసుకువచ్చాడు. డెన్మార్క్ దేశంలో స్వయంపాలిత ప్రాంతంగా ఉన్న గ్రీన్‌లాండ్ భౌగోళిక ప్రాంతంలో అపారమైన చమురు, సహజ వాయువు నిల్వలు ఉన్నాయని వెల్లడి కావడంతో గ్రీన్‌లాండ్ దేశాన్ని అమెరికాకు తిరిగి అప్పచెప్పాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్‌ని కెనడాని అడిగినట్లు 52వ రాష్ట్రంగా చేర్చుకుంటానని అడగడం లేదు. దానిని వలస దేశంగా తీసుకోవాలని ట్రంప్ భావిస్తున్నాడు. ఇప్పటి వరకు రష్యాతో చేస్తున్న యుద్ధానికిగాను ఉక్రెయిన్‌కు అందించిన ఆర్థిక, ఆయుధ సాయానికి బదులుగా ఆ దేశంలోని ఖనిజ లవణాలను అమెరికాకు అప్పచెప్పమని కోరుతున్నాడు. గాజా సముద్ర తీర ప్రాంతంలో చమురు నిక్షేపాలను కైంకర్యం చెయ్యడానికి పాలస్తీనా దేశాన్ని రివర్ ఫ్రంట్‌గా మారుస్తానని, ఆ భూభాగంలో నివసించే ప్రజానీకాన్ని లెబనాన్, సిరియా దేశాలు వలస రావడానికి అనుమతించాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ఎలాన్ మస్క్ స్టార్ లింక్ కంపెనీకి మన ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచి ఆహ్వానించడం వెనుక ఏం జరిగి ఉంటుందో ఎవరైనా ఇట్టే ఊహించుకోవచ్చు. అమెరికా బెదిరింపులకు లొంగి ఒకసారి సాగిలపడితే అది ఇక్కడితో అగుతుందా?

1990లలో ఫ్రాన్సిస్ ఫుకుయామా ప్రకటించినట్లు అమెరికా ఆధునిక రోమ్ కాదు, ఏకైక ప్రపంచాధిపతీ కాదు. బలహీన పడుతున్న అమెరికన్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టుకోవడానికి ట్రంప్ అర్థ బలాన్ని, అంగ బలాన్ని ప్రదర్శించడానికి బరితెగించాడు. నానాటికీ బలహీన పడుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదం న్యాయబద్ధంగా వ్యవహరిస్తుందనే భ్రమలకు లోనుకాకూడదు. అన్నిటికీ మించి ఆర్థిక వ్యవస్థ పతనానికన్నా ఎక్కువ వేగంగా అమెరికన్ ప్రపంచాధిపత్యం క్షీణిస్తున్నది. బహుళ ధ్రువ ప్రపంచం నిలదొక్కుకుంటుంది. అమెరికా ఎదుర్కొంటున్న ఈ ఆధిపత్య క్షీణత ట్రంప్ రూపంలో దురుసుగా వ్యవహరిస్తూ ప్రపంచ దేశాలకు ప్రమాదం కొనితెచ్చి పెడుతున్నది. చరిత్ర నుండి మనం నేర్వాల్సిన గుణపాఠం ఇదే.

/ స్వేచ్ఛానువాదం /

మన దేశంలో టెలికాం కంపెనీల మార్కెట్ వాటా

కంపెనీ	వినియోగదారుల సంఖ్య (మిలియన్లలో)	మార్కెట్ వాటా (శాతాల్లో)
రిలయన్స్ జియో	465.1	40.4
భారతి ఎయిర్‌టెల్	385.3	33.5
వొడాఫోన్ ఐడియా	207.3	18.0
బి.ఎస్.ఎన్.ఎల్	91.7	8.0

అణు కుంపటితో అనర్థం

సమస్య

కె. లోకనాధం



ఇక్కడ గమనించాల్సిన ప్రధాన అంశం ఏమిటంటే, ఆర్థిక, సాంకేతిక వంటి అన్ని రంగాల్లోనూ బాగా అభివృద్ధి చెందిన అమెరికా, రష్యా, జపాన్ లాంటి దేశాలే అణు విద్యుత్ ప్లాంట్లను తట్టుకోలేక పోయాయి. ఇప్పటికీ వాటి ప్రభావాలను ఎదుర్కొంటున్నాయి. అలాంటిది మన లాంటి దేశం ఏ చిన్నపాటి అణు ప్రమాదాన్నైనా తట్టుకోగలదా? అణు విద్యుత్ ఉత్పత్తిని అనేక దేశాలు క్రమేణా నిలుపుదల చేస్తుండగా...అణు రియాక్టర్లు అమ్ముడు పోకపోవడంతో, వాటి ఉత్పత్తిదారులైన ముఖ్యంగా అమెరికా బహుళ జాతి సంస్థల లాభాల కోసమే ఉత్తరాంధ్రను డంపింగు యార్డుగా మార్చేస్తున్నారు.

కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తరవాత సంస్కరణలు వేగవంతం చేసింది. ప్రధాని మోడీ అమెరికా కనుసన్నలలో నడుస్తున్నారు. అందులో భాగంగానే అణు విద్యుత్ ప్లాంట్‌కు 2 వేల ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి హుకుం జారీచేసింది. నాడు శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ తీర ప్రాంతంలో అణు విద్యుత్ కేంద్రానికి అడుగులు వేస్తే నేడు అనకాపల్లి జిల్లాలో మరో అణు విద్యుత్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందులో 2800 మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ప్రకటించింది. ఇది కూడా నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్.టి.పి.సి) ఆధ్వర్యంలో జరుగుతుంది. చేతికి మట్టి అంటకుండా సరికొత్త నాటకాన్ని కేంద్ర ప్రభుత్వం మొదలెట్టింది. అణు విద్యుత్ ప్లాంట్ వల్ల తలెత్తే పరిణామాలు, జరిగే ప్రమాదాలతో మానవాళికి ఎలాంటి ముప్పు వాటిల్లుతుందనేది ప్రపంచ ప్రజలకు అవగాహన వుంది.

ప్రపంచంలో అణు విద్యుత్ ప్లాంట్ల ప్రమాదాలు చాలా విధాలుగా జరిగాయి. వాటి ప్రభావాలూ తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా మూడు ప్రధాన అణు ప్రమాదాలు చరిత్రలో గుర్తించబడ్డాయి. ఇవి 1. చెర్నోబిల్ ప్రమాదం (1986, సోవియట్ యూనియన్ ప్రస్తుత ఉక్రెయిన్), 2. త్రీ మైల్ ఐలాండ్ ప్రమాదం (1979, అమెరికా), 3. ఫుకుషిమా ప్రమాదం (2011, జపాన్). చెర్నోబిల్ ప్రమాద ప్రభావం వల్ల రెండు లక్షల మంది వరకు మరణించి ఉండవచ్చని అంతర్జాతీయ పర్యావరణ సంస్థ గ్రీన్ పీస్ నివేదిక పేర్కొంది. లక్షలాది మంది ఆరోగ్య సమస్యలకు (క్యాన్సర్, జనన లోపాలు) గురవగా, భారీ స్థాయిలో భూమి, నీరు కలుషితమైంది. త్రీ మైల్ ఐలాండ్ ప్రమాదంతో అణు విద్యుత్‌పై ప్రజల్లో భయం పెరిగింది. అమెరికాలో అణు ప్లాంట్ల నిర్మాణం మందగించింది. రేడియేషన్ వల్ల ఆరోగ్య సమస్యలు (క్యాన్సర్, జనన లోపాలు) తలెత్తాయి. భూమి, నీరు, గాలి కలుషితమయ్యాయి. వేలాది మంది ఇళ్ల వదిలిపెట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫుకుషిమా ప్రమాదం వల్ల వేల మంది ఆ స్థలం విడిచి వెళ్లాల్సి వచ్చింది. ఫలితంగా జపాన్ అణు విద్యుత్ వ్యూహంలో మార్పులు చేసుకుంది.

అణు విద్యుత్ ప్లాంట్ ఎంత ప్రమాదకరమైనదో అంతర్జాతీయ ఘటనలు తెలియజేస్తున్నాయి. ఐస్‌లాండ్, చెర్నోబిల్, ఫుకుషిమా ప్రమాదాలు అనేక గుణపాఠాలు నేర్పుతున్నాయి. ఇలాంటి ఉదంతాల తరువాత 22 దేశాలలో 108 అణు విద్యుత్ ప్రాజెక్టులు నిలిపివేశారు. ఒక మోగా వాట్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు 20 కోట్ల నుండి 25 కోట్ల వరకు పెట్టుబడి అవుతుంది. 2800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు సుమారు 50 వేల కోట్లు అవసరం అవుతుందని అంచనా. అందరూ వద్దనుకుంటే భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో ఎందుకు పెట్టాలని అనుకుంటున్నారు? తీర ప్రాంతంలో అణు విద్యుత్ కేంద్రాలకు ఇక్కడ ప్రభుత్వాలు మొగ్గు చూపుతున్నాయి. ఒకవైపున పర్యావరణానికి మరొకవైపున ప్రజలకు భద్రత లేని అణు విద్యుత్ ఎవరికోసం? కొన్ని రాష్ట్రాలు అణు విద్యుత్‌ను వ్యతిరేకిస్తుంటే ఆంధ్ర పాలకులకు అంత భ్రమలు ఎందుకు? మొన్న కొవ్వాడ నేడు అనకాపల్లి కేంద్రాలుగా అణు విద్యుత్ ప్లాంట్ పెట్టాలని ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి. కరెంట్ చార్జీలు తగ్గుతాయా అంటే అది కూడా కాదు. యూనిట్ విద్యుత్ ధర రూ.12 నుండి రూ.15 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రపంచంలోనే అణు విద్యుత్ వాటా 17 శాతం నుండి 10 శాతం తగ్గినట్లు నివేదికలు చూపుతున్నాయి. ప్రపంచ దేశాలు అణు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పాలన్న ఆలోచనలను విరమించుకుంటున్నాయి. భారత పాలకులకు మాత్రం ఏమీ పట్టనట్లు వుంది. కేవలం కార్పొరేట్ కంపెనీలకు దేశ భద్రతను అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగా అణు కుంపటి ముందుకు వచ్చింది.

ఇక్కడ గమనించాల్సిన ప్రధాన అంశం ఏమిటంటే, ఆర్థిక, సాంకేతిక వంటి అన్ని రంగాల్లోనూ బాగా అభివృద్ధి చెందిన అమెరికా, రష్యా, జపాన్ లాంటి దేశాలే అణు విద్యుత్ ప్లాంట్లను తట్టుకోలేక పోయాయి. ఇప్పటికీ వాటి ప్రభావాలను ఎదుర్కొంటున్నాయి. అలాంటిది మన లాంటి దేశం ఏ చిన్నపాటి అణు ప్రమాదాన్నైనా తట్టుకోగలదా? అణు విద్యుత్ ఉత్పత్తిని అనేక దేశాలు క్రమేణా నిలుపుదల చేస్తుండగా... అణు రియాక్టర్లు అమ్ముడు పోకపోవడంతో, వాటి ఉత్పత్తిదారులైన ముఖ్యంగా అమెరికా బహుళ జాతి సంస్థల లాభాల కోసమే ఉత్తరాంధ్రను డంపింగు యార్డుగా మార్చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు విలువైన ప్రాంతం ఉమ్మడి విశాఖ. ఆర్థిక రాజధానిగా చెప్పుకుంటున్న పాలకులు ఈ ప్రాంత రక్షణలో చిత్తశుద్ధి చూపించడంలేదు. అణు విద్యుత్ ప్లాంట్‌కు అనుమతులిస్తే గాలి, నీరు, పర్యావరణం తీవ్ర కలుషితమౌతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో దేశభద్రతకు సంబంధించి ఈస్టర్ నేవల్ కమాండ్, ఎన్ఎఒబి, బార్క్, డాక్ యార్డు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్, షిప్ యార్డు, విశాఖ, గంగవరం పోర్టులు, ఎన్‌టిపిసి, ఫార్మా పరిశ్రమలు, ఎస్ఇజెడ్ వంటి కీలక పరిశ్రమలున్నాయి. అణు ప్రమాదం సంభవిస్తే క్షణాల్లో ఈ ప్రాంతం విధ్వంసం అవుతుంది. అణు ప్రమాద తీవ్రత 80 కిలోమీటర్ల వరకు వుంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 30 కిలో మీటర్ల పరిధిలో అణు ధార్మిక ప్రభావం వుంటుంది. సాంప్రదాయ మత్స్యకారులు ఇప్పటికే ఫార్మా పరిశ్రమల వల్ల తమ వృత్తి కోల్పోతున్నారు. ప్రాజెక్టు చుట్టూ ఒక కిలోమీటరు పరిధిలో నిషేధిత ప్రాంతంలో ప్రజలు నివశించకూడదు. ప్రాజెక్టు చుట్టూ 5 కిలో మీటర్ల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకూడదు. 16 కిలోమీటర్ల పరిధిలో ప్రమాదం జరిగితే అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ నుండి ప్రజలను తరలించి పురావాసం కల్పించడానికి నిరంతరం తయారై వుండాలి. ప్రమాదం జరిగితే రియాక్టర్లు తయారైన సంస్థల నుండి ఇవ్వకుండా...రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారాలు చెల్లించాల్సి వుంటుంది. క్యాన్సర్, ఎక్యూట్ రేడియేషన్ సిండ్రోమ్, ఎనీమియా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. ఇప్పటికే దేశంలో అనేక ప్రమాదాలు జరిగాయి. 1984 భోపాల్‌లో గ్యాస్ లీకైన ప్రమాదంలో వేలాది మంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో అక్కడ బాధపడుతున్నారు.

2020లో విశాఖ ఎల్జీ పాలిమర్స్ విషవాయువు లీకేజీ ప్రమాదం ఎంత విషాదం సృష్టించిందో మనందరికీ విదితమే. 2024 ఆగష్టు 21న అచ్యుతాపురం ఎస్ఇజెడ్ లోని ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించగా 39 మంది క్షతగాత్రులయ్యారు. బ్రాండిక్స్ వస్త్ర పరిశ్రమలో విషవాయువుల లీకేజీతో 500 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. దీనిని ఎన్‌జిటి సుమోటోగా స్వీకరించి వారికి పరిహారం ఇవ్వాలని చెప్పినా కోర్టుకెళ్లి పరిహారం చెల్లించకుండా ఎగ్గొటింది. ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏ పరిశ్రమలో ఏ రియాక్టర్ పేలుతుందో తెలియని ప్రమాదాలు ఇక్కడ పొంచి వున్నాయి. ఈ ప్రమాదాల వల్ల కలిగే నష్టాన్ని పూడ్చుకోవాలంటే వందల సంవత్సరాలు పడుతుందని అనుభవాలు తెలియజేస్తున్నాయి.

కేంద్ర విద్యుత్ చట్టం 2020ని అమలు చేయాలి. లేదంటే కేంద్ర గ్రాంట్ నిలుపుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తిరస్కరిస్తున్నాయి. అణు విద్యుత్ ప్లాంట్‌ను అనకాపల్లి తీరంలో పెట్టాలనే వార్త ఆంధ్ర రాష్ట్ర ప్రజలలో ముఖ్యంగా ఉమ్మడి విశాఖ ప్రజల్లో అలజడి రేకెత్తిస్తోంది.

ఒక వైపున విద్యుత్ పెంపు కోసం సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్‌లతో పర్యావరణ, కాలుష్య రహిత ప్రత్యామ్నాయ మార్గాలు అనేకం ఉండగా అణు కుంపటి ఎందుకు తీసుకొస్తున్నట్లు? పాలకులు ఎవరి ప్రయోజనాల కోసం వున్నారో చెప్పాలి? ఆంధ్ర రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించింది. ప్రజల ప్రయోజనాలు, దేశ భద్రత, ప్రజల ఆరోగ్య-జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని అణు విద్యుత్ ప్లాంట్లకు భూములు కేటాయించవద్దు. అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు కేటాయించాలన్న ప్రతిపాదనలు విరమించుకోవాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /



నవ్వుకుందాం రండి!

కవిత్వం

నవ్వుకి చైతన్యాన్ని అద్దినవాడా!
నవ్వుని ఆయుధం చేసిన మొనగాడా!
నిన్ను దేశమంతా నవ్వుతూ ప్రేమిస్తుంది!!

డియర్ కునాల్ కమ్రా!
భ్రష్టు పట్టిన నేతలపై నీ వెటకారాన్ని సంధిస్తూనే ఉండు
రంగులు మార్చే రాజకీయాన్ని ఎద్దేవ చేస్తూనే ఉండు
నీ నవ్వుల అస్త్రాలు ఇప్పుడు దేశానికెంతో అవసరం

నీ నవ్వుల పాఠాలు
ప్రజాచైతన్య గీతికలై గానం చేస్తున్నాయి
సామాన్యుల గొంతులో పోరాట నినాదాలవుతున్నాయి

అధికారమూ రాజకీయమూ ఏకమొత్తంగా
ఒక విదూషకుడ్ని వెంటాడుతున్న దృశ్యాన్ని
దేశమంతా చూసి నవ్వుతుంది!

ఇన్నాళ్ళూ నీది ఒంటరిపోరు
ఇప్పుడు ఈ పోరాటం మా అందిరిదీ!
ప్రజాద్రోహం చేసే రాజకీయ నేతలను
దిష్టిబొమ్మలను చేసి దేశ ముఖచిత్రం మీద
వేలాడదీశావు

దేశాన్ని సరిదిద్దలేని
ప్రజలకు భరోసా ఇవ్వలేని
ఉన్మాద మూక రాజకీయాల్ని చూసి
ఇప్పుడు దేశమంతా ఏడ్వలేక నవ్వాల్సిందే!

సముద్రపు అలల్లా ఎగిసిపడే
ఆ నవ్వుల జ్వాలల్లో మూకోన్మాద రాజకీయాలు
భస్మమై దేశం ప్రక్షాళనం అవ్వాలి

హాస్యాన్ని ఆస్వాదించలేని
వెన్నెముకలేని రాజకీయ నేతలను చూసి
పగలబడి నవ్వుదాం రండి!
కునాల్ కమ్రా సాక్షిగా....

- వీరప్రసాద్, సెల్ : 9490099059

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

హంద్రీ నీవాతో శుభారంభం

- జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే కార్యక్రమంతో హంద్రీనీవాతో ఆరంభం కావాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనుల పురోగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణా, గోదావరి జలాలను రాయలసీమకు తరలించి రతనాలసీమగా మార్చాలని ముఖ్యమంత్రి మహత్తర ఆశయంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. దీనికి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ శుభారంభం కావాలని తెలిపారు. 2025 జూన్ కల్లా మొదటిదశ పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చురుగ్గా పనులు చేయాలని తెలిపారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, ఇఎన్‌సి ఎం వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు సిఇ, ఎస్ఇ పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో దూకుడు పెంచిన సిట్

- సాక్షుల మృతుల బంధువుల విచారణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిట్ బృందం దూకుడు పెంచింది. కీలక సాక్షి వాచ్‌మెన్ రంగన్న మృతి చెందడంతో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. వివేక హత్య కేసులో సాక్షులు ఒక్కొక్కరుగా అనుమానాస్పదంగా మృతి చెందారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. హత్య కేసు విషయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించింది. దీనిపై 16 మందితో కూడిన ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసింది. రంగన్న ఇంటి చుట్టుపక్కలవాళ్ళను సిట్ బృందం విచారించింది. 2019 సెప్టెంబరు రెండున అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కటికరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యుల్లో [illegible] ఇదివరకే పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో విచారణ నిర్వహించిన సంగతి తెలిసిందే. బుధవారం శ్రీనివాసులురెడ్డి బంధువులు పరమేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలను కడప క్రైమ్ బ్రాంచ్ పోలీసుస్టేషన్‌లో సిట్ బృందం విచారించింది. వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించి రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఈ హత్య కేసులో శ్రీనివాసులురెడ్డి కీలక సాక్షిగా ఉన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు
- విశాఖలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ, మహాధర్నా



జివిఎంసి వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ నగరంలో మున్సిపల్ కార్మికులు బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

డిఆర్‌ఎం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆందర్ (బ్రిడ్జి), ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆశీలు మెట్ట జంక్షన్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు సాగింది. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులకు ఉపయుక్తంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టబోవడంతో కార్మికులను వెట్టి చాకిరీలోకి, బానిసత్వంలోకి నెట్టేయడమేనని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఆప్కాస్ రద్దు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కోరారు. అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా పెంచాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను టిడిపి కూటమి ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక చర్యలను ప్రభుత్వం విడనాడాలని కోరారు. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. వందలాది మంది కార్మికులు, మహిళలు మండుటెండను ఖాతరు చేయకుండా ర్యాలీ, మహా ధర్నాలో పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్ నిరసన తెలుపుతున్న నాయకులు, అభ్యర్థులు

మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలి

- కడప కలెక్టరేట్ ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి-కడప అర్బన్

మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ బుధవారం కడప మహావీర్ సర్కిల్ నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా టిడిపి కూటమి ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని, పరీక్షల తేదీని ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అభ్యర్థులకు అరచేయిలో వైకుంఠం చూపిస్తుందని విమర్శించారు. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇంతవరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని యువగళంలో లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్న ఇంతవరకు అతీగతీ లేదన్నారు. తక్షణమే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వంశీ, విద్యుత్ రామకృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు ఉదయ్ కుమార్, నాగార్జున, అంజి, శేఖర్, సాయి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి సాయం అందించాలి

- సింగపూర్ ప్రతినిధులతో సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో మాదిరిగానే సహకారం అందించాలని సింగపూర్ ప్రతినిధులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కోరారు. సిఎస్‌ను సింగపూర్ ప్రతినిధులు బుధవారం కలిశారు. సిఆర్‌డిఎ, మున్సిపల్ అధికారులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. 2014-19లో అమరావతి నిర్మాణంలో సింగపూర్ కీలకంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం అదే సాయం కొనసాగించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం అమరావతి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే అమరావతికి కేంద్ర నిధులతోపాటు హడ్కో, ప్రపంచ బ్యాంకు, ఎడిబి వంటి సంస్థలు నిధులు అందిస్తున్నాయని, ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందీ లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరే సింగపూర్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. గురువారం దీనిపై మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. అమరావతిని శరవేగంగా పూర్తి



చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా అమరావతిని నిర్మించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అంతకుముందు సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. గవర్నమెంటు కాంప్లెక్స్, ట్రంకు రోడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పన పనులు పెద్దయెత్తున సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెలలో ప్రధాన మంత్రి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధి ఫ్రాన్సిస్ చోంగ్ మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణానికి సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు. సమావేశంలో ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధి, అదనపు కమిషనర్లు ప్రవీణ్‌చంద్, నవీన్, ఆడ్రేటాన్, ఎలీజా ఆంగ్, నాజ్నీబేగం వివేక్ రఘురామన్, డెన్నిటాన్, వైష్ణవి వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

8న చేనేత కార్మికుల ధర్నా జయప్రదం చేయాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న ఎడి కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం చేనేతలను మాటలతో మోసం చేస్తోందని విమర్శించారు. చేనేత కార్మికులకు ఉచిత కరెంటుకు జిఒ విడుదల చేశామని ప్రకటించినప్పటికీ విద్యుత్ శాఖ కార్యాలయాలకు ఇంకా ఉత్తర్వులు రాలేదని, దీంతో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించమంటున్నారని తెలిపారు. చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు జరపాలని, చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన పావలా వడ్డీ రిబేట్, యారన్ సబ్సిడీ కింద రూ.150 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కార్మికునికి మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పి ఇవ్వలేదని తెలిపారు. అధికారంలోనికి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేయనని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత నేతన్న నేస్తం పథకం రద్దు చేసి చేనేతలకు ద్రోహం చేశారన్నారు. నేతన్న నేస్తం పథకం అమలు జరపాలని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా చేనేత జౌళి కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు.

ఎసిబి విచారణకు విజయకుమార్ హాజరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో సమాచార, పౌరసంబంధ శాఖ మాజీ కమిషనర్ తమ్మా విజయకుమార్ రెడ్డి బుధవారం గుంటూరులో ఎసిబి విచారణకు హాజరయ్యారు. 2019 నుంచి 24 మధ్య కాలంలో ఆయన వివిధ మీడియా సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా రూ.859 కోట్ల వరకు ప్రకటనల రూపంలో కేటాయించారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు కొద్ది నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఎసిబి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఎసిబి అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో విజయకుమార్‌రెడ్డి గుంటూరులోని ఎసిబి జిల్లా కార్యాలయానికి వచ్చారు. దాదాపు తొమ్మిది గంటలకుపైగా ఆయనను అధికారులు విచారించారు.

రాష్ట్ర సమాచార కమిషనర్‌గా ఉన్న కాలంలో ప్రభుత్వ ధనం దుర్వినియోగంపై పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఎసిబి అదనపు ఎస్పి ఎం.మహీంద్ర ఆధ్వర్యంలో విచారణ జరగ్గా గత ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు తాను ప్రకటనలు జారీ చేశానని చెప్పినట్టు తెలిసింది. వివిధ శాఖల అంశాలకు సంబంధించి ప్రకటనలు జారీ చేసినట్టు ఆయన విచారణలో వెల్లడించినట్టు సమాచారం. గురువారం కూడా విచారణ కొనసాగనుందని తెలిసింది.

పి4 విధానానికి సిబిజి ప్లాంట్లు నాంది

- తప్పుడు ప్రచారాలు చేస్తే రెడ్ బుక్‌లోకి పేరు
- ప్రకాశంలో రిలయన్స్ సిబిజి ప్లాంట్ శంకుస్థాపనలో లోకేష్

ప్రజాశక్తి - పిసిపల్లి (ప్రకాశంజిల్లా)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన పి4 విధానానికి రిలయన్స్ సిబిజి ప్లాంట్స్ నాంది అని, పేదరిక నిర్మూలనలో ఇదొక ముఖ్యమైన అడుగు అని మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండల పరిధిలోని దివాకరపురంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇంటెగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) హబ్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎపి, తెలంగాణ మెంటార్ పివిఎల్. మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సిఇఒ హరీంద్ర, కె.త్రిపాఠితో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఎలాంటి నీటి వసతి లేని మెట్ట ప్రాంతం రైతులకు ఈ ప్లాంట్ ద్వారా పెద్ద ఎత్తున మేలు జరగబోతోందన్నారు. నేపియర్ గడ్డితో గ్యాస్ తయారు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములకు రూ.15 వేలు, రైతుల భూములకు రూ.31 వేల చొప్పున కౌలు ఇస్తారని, రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధర చెల్లిస్తారని వివరించారు. సిబిజి ప్లాంట్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్, రిలయన్స్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు

పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110 లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు తయారవుతుందని తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. రాష్ట్రంలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిందని, ఈ రంగంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోందని తెలిపారు. తద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయన్నారు. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాల బీడు భూమిని వినియోగంలోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చామని, కనిగిరిలో 497 ఎకరాలు కేటాయించామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని వైసిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారిని రెడ్ బుక్‌లోకి ఎక్కిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ప్రకాశం కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

3 లక్షల పెన్షన్లు కోత

- మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతినెలా పెన్షన్ల పేరుతో ఆర్భాటపు ప్రచారం చేస్తూ మూడు లక్షల పెన్షన్లకు కోత పెట్టారని మాజీ మంత్రి ఆర్‌కె రోజా విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలను నమ్మించి మోసం చేశారని, హామీలను అమలు చేయకుంటే సిఎం పదవి నుండి దిగిపోవాలని కోరారు. చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, పక్కదారి పట్టించేందుకే వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి పేర్కొన్నారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సర్కార్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో వరుస ఘటనలు జరుగుతున్నాయని, విశాఖలో ప్రమోన్మాది దాడి ఘటన ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

మత స్వేచ్ఛను హరించేందుకే వక్ఫ్ సవరణ బిల్లు

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముస్లిములకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చి మైనార్టీలను అణచి వేసే కుట్ర చేస్తోందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ముస్లిముల మనోభావాలు దెబ్బతీయడమే మోడీ అజెండా అని, పార్లమెంట్ ముందుకు సవరణ బిల్లు రావడం అంటే దేశానికి బ్లాక్‌డే అని అన్నారు. దేశ చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయే చర్యగా ఆమె అభివర్ణించారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కోసమే ఈ పన్నాగమని, వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలో 20 కోట్ల మంది ముస్లిములు ఆందోళనలు చేస్తున్నా.. మోడీ పట్టించుకోలేదని విమర్శించారు.


కాకాణి గోవర్ధన్‌కు మళ్లీ నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైసిపి నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలోని కాకాణి నివాసానికి వెళ్లిన కావలి పోలీసులు.. ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కాకాణి ఇంట్లో లేరని చెప్పడంతో ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డిఎస్‌పి ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు కాకాణికి నోటీసులు అందజేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు.

బిలియనీర్లలో 18వ స్థానంలో అంబానీ

- అదానీకి 28వ స్థానం
- ఫోర్బ్స్ జాబితా వెల్లడి



వాషింగ్టన్ : ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025లో టెస్లా అధినేత ఎలన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నారు. గతేడాదితో పోల్చితే147 బిలియన్ డాలర్ల సంపద పెరిగి 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్‌లో నిలిచారు. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ బుకర్‌బర్గ్ 216 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉన్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానం దక్కించుకున్నారు. భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో 18వ స్థానంలో నిలిచారు. గౌతం అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. అత్యధిక బిలియనీర్లు కలిగిన దేశంగా అమెరికా టాప్‌లో ఉంది. అక్కడ 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో కొత్తగా 288 మంది చేరారని ఫోర్బ్స్ వెల్లడించింది.

విదేశాల్లో లిథియం బ్లాక్‌లపై కోల్ ఇండియా దృష్టి

- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో చర్చలు
- సిఐఎల్ సిఎండి పిఎం ప్రసాద్ వెల్లడి

కోల్‌కత్తా : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) విదేశాల్లోని లిథియం గనులపై దృష్టి పెట్టింది. విద్యుత్ రంగ వాహనాలు, సోలార్, విండ్ పవర్‌లో లిథియం బ్యాటరీలకు డిమాండ్ పెరుగుతోన్న నేపథ్యంలో ఈ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థ భావిస్తోందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అర్జెంటీనా, ఆస్ట్రేలియాలో లిథియం బ్లాక్‌లను కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతోన్నామని కోల్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) పిఎం ప్రసాద్ తెలిపారు. దీంతో క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు మద్దతివ్వాలని లక్ష్యంగా



పెట్టుకున్నామన్నారు. ఈ ఏడాది బొగ్గు కొరత ఉండదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 875 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 11వ ఆసియన్ మైనింగ్ కాంగ్రెస్, ఇంటర్నేషనల్ మైనింగ్ ఎగ్జిబిషన్ కర్టెన్‌రైజర్ సందర్భంగా ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కోల్ ఇండియా కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్‌కు సహాయంగా టన్ను బొగ్గు ధరను రూ.10 పెంచడానికి ఆమోదించామన్నారు. పెంచిన ధరలు ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

ఆస్ట్రేలియాలో లిథియం బ్లాక్‌ను కొనుగోలు చేసేందుకు చురుగ్గా చర్చలు జరుగుతున్నాయన్నారు. అదే విధంగా అర్జెంటినాలోని లిథియం బ్లాక్‌ల స్వాధీనానికి తమ బృందాలు అనేకసార్లు సందర్శించాయన్నారు. ఇరు దేశాల ప్రభుత్వం మధ్య చర్చలు జరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బైన్‌ల కోసం బ్యాటరీల ఉత్పత్తిలో లిథియంను కీలక ఖనిజంగా వాడుతోన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బొగ్గు సరఫరాపై ఆందోళనలపై ప్రసాద్ స్పందిస్తూ.. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి యూనిట్లకు బొగ్గు కొరత ఉండదని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పిట్‌హెడ్‌ల వద్ద భారత బొగ్గు నిల్వలు 106 మిలియన్ టన్నులుగా ఉన్నాయన్నారు. గతేడాది లాగా కొరత ఉండదని స్పష్టం చేశారు. మొత్తం భారత బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా 80 శాతం వాటాను కలిగి ఉంది.

ఆర్‌బిఐ నూతన డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా



న్యూఢిల్లీ : ఎన్‌సిఎఇఆర్ డైరెక్టర్ జనరల్ అయిన పూనమ్ గుప్తాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన డిప్యూటీ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. తాజా నియామకాన్ని నియామకాల కేబినెట్ కమిటీ ఆమోదించిందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. డిప్యూటీ గవర్నర్‌గా ఎండి పాత్రా జనవరిలో పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది. ఈ నెలాఖరులో ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షకు ముందు పూనమ్ నియామకం జరగడం విశేషం.

సెన్సెక్స్‌కు 593 పాయింట్ల లాభం

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐటి, బ్యాంకింగ్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతుతో బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 592.93 పాయింట్లు లేదా 0.78 శాతం పెరిగి 76,617కు చేరింది. ఇంట్రాడేలో 76,065- 76,680 మధ్య కదలాడింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 167 పాయింట్లు లేదా 0.72 శాతం లాభపడి 23,332 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 1.61 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.12 శాతం చొప్పున రాణించాయి. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్‌అండ్‌టి షేర్లు నష్టాలు చవి చూశాయి.

పెన్షన్ల పంపిణీకి సిపిఎఓ ఆమోదం

- ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : సెంట్రల్ పెన్షన్ అకౌంటింగ్ ఆఫీసు (సిపిఎఓ) తన తరుపున పెన్షన్‌లను పంపిణీ చేయడానికి తమ బ్యాంక్‌కు అవకాశం ఇచ్చిందని ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. దీంతో ఇకపై అఖిల భారత సర్వీస్ అధికారులు, మాజీ పార్లమెంటు సభ్యులు, హైకోర్టులు, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, భారత మాజీ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పౌర మంత్రిత్వ శాఖలు, విభాగాల అధికారులు ఇప్పటి నుంచి తమ బ్యాంకు నుంచి కూడా పెన్షన్లను పొందవచ్చని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. రైల్వేలు, పోస్టల్, టెలికాం, రక్షణ శాఖల మాజీ ఉద్యోగులను ఇందుకు మినహాయించిందని పేర్కొంది. పెన్షనర్లు తమ జీవిత భాగస్వామితో కలిసి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాను తెరిచి పెన్షన్ పొందవచ్చని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సౌకర్యాలను ఉపయోగించి తమ పొదుపు ఖాతాలో పెన్షన్ పొందాలని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కంట్రీ హెడ్, రిటైల్ లయబిలిటీస్ చిన్మయ్ ధోబుల్ పేర్కొన్నారు

వియట్రిస్‌కు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు


న్యూఢిల్లీ : వరుసగా నాలుగవ సంవత్సరం తమ సంస్థకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు లభించిందని మైలాన్ లేబరేటరీస్ లిమిటెడ్ (వియాట్రిస్ కంపెనీ) తెలిపింది. ఇది ఉద్యోగుల సంక్షేమం, సంస్కృతిని ప్రోత్సహించడంలో తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందని వియాట్రిస్ ఇండియా హెచ్‌ఆర్ హెడ్ అనుపమ్ భట్ పేర్కొన్నారు. వరుసగా నాలుగవ సంవత్సరం గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధృవీకరణను పొందడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు.

స్విగ్గీకి రూ.158 కోట్ల జిఎస్‌టి నోటీసు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక స్విగ్గీకి ఆదాయపు పన్ను శాఖ నుంచి పన్ను ఎగవేత నోటీసులను జారీ చేసింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.158.25 కోట్ల బకాయిలను చెల్లించాల్సిందిగా ఐటి శాఖ తన నోటీసుల్లో ఆదేశించింది. ఈ విషయమై తమకు ఐటి శాఖ నోటీసులు ఇచ్చిందని స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి మధ్య కాలంలో డెలివరీ ఛార్జీలపై జిఎస్‌టి బకాయిలు చెల్లించాల్సి ఉందని నోటీసుల్లో సమాచారం ఉందని పేర్కొంది. కాగా దీనిపై అధికారుల వద్ద అప్పీల్‌కు వెళ్లనున్నట్లు స్విగ్గీ పేర్కొంది.

20 కేజీల నల్లమట్ట చేప లభ్యం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)



కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ మత్స్యకారుడికి అరుదైన నల్లమట్ట చేప లభ్యమైంది. ఉప్పాడకు చెందిన మత్స్యకారుడు మడద విగ్నేష్ సముద్రంలో చేపల వేటకు బుధవారం వెళ్లారు. అతని వలకు అరుదైన 20 కేజీల నల్లమట్ట చేప చిక్కుకుంది. దీనిని హార్బర్ వద్ద వేలం వేయగా ఒక వ్యక్తి రూ.ఆరు వేలకు సొంతం చేసుకున్నారు. నల్లమట్ట చేప మూడు కేజీల నుంచి 40 కేజీల వరకు పెరుగుతాయని మత్స్యకారులు తెలిపారు. బిర్యానిలో ఈ చేపను ఎక్కువగా ఉపయోగిస్తారని, రుచి ఎక్కువగా ఉండటంతో దీనికి మంచి డిమాండ్ ఉంటుందని, ఈ రకం చేపలు చాలా అరుదుగా దొరుకుతాయని చెప్పారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి : ఏపి రైతుసంఘం

ప్రజాశక్తి -నల్లచెరువు
నల్లచెరువు మండల పరిధిలోని కల్లిపల్లి గ్రామంలో జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి లైనింగ్ పనులను వెంటనే ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో లైనింగ్ పనులను బుధవారం అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి గల ఏకైక వనరు హంద్రీనీవా సుజల స్రవంతి అని అన్నారు. ఈ కాలువకు లైనింగ్ వేస్తే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. లైనింగ్ పనుల వలన భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లా సత్యసాయి జిల్లా రైతులకు అన్యాయం చేయొద్దన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పరిధిలో అన్ని గ్రామాలలో గల పిల్ల కాలువలను ఏర్పాటుచేసి వాటి పరిధిలో గల చెరువులను నింపి తర్వాత చిత్తూరు జిల్లాలోని కుప్పంకు నీటిని తీసుకెళ్లాలని అన్నారు. పదివేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కాలువలను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా లైనింగ్ పనులను ఆపకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో కలసి ఉద్యమాలను ఉధతం చేస్తామని హెచ్చరించారు.

రాయదుర్గం మీదుగా మైసూర్-అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

ప్రజాశక్తి-రాయదుర్గం
వేసవి రద్దీ నివారణకు మైసూరు నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు సర్వీసును నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 06281వ నెంబర్ రైలు ఏప్రిల్ 5, 12, 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14వతేదీల్లో శనివారం(11 సర్వీసులు) ఉదయం 8 గంటలకు మైసూర్ నుం చి బయలుదేరి అజ్మీర్‌కు సోమవారం ఉదయం 6:55 గంటలకు చేరుతుం దన్నారు. అలాగే ట్రైన్ నెంబర్ 06282 ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16వతేదీలో (11 సర్వీసులు) సోమవారం సాయంత్రం 6-50కు బయలుదేరి పై తెలిపిన మార్గంలోనే బుధవారం సాయంత్రం 5:30 కు మైసూరు చేరుతుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్స్‌టైల్ పార్కును తెరిచేనా?

- కూటమి ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి-పామిడి
మహిళల ఆర్థిక స్వాలంభనలో భాగంగా చేనేత రంగంలో శిక్షణ ఇచ్చి వారికి సాయం అందించేలా పామిడి ఎన్‌హెచ్-44 వై జంక్షన్ వద్ద 2.77 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.76 కోట్ల వ్యయంతో 2004లో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో టెక్స్‌టైల్ పార్క్ కింద మహిళలకు శిక్షణ, పరిశోధన సౌకర్యాలు కల్పించే ఏర్పాటు చేశారు. దీనికి ఏర్పాటు ఆశయం బాగానే ఉన్నా ఆచరణలో పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం అడుగడుగునా కన్పించింది. మహిళా సాధికారతకు ప్రోత్సాహం అందించే దిశగా పయనించాల్సిన ప్రభుత్వాలు ఈ మేరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిధుల కొరత పేరుతో దీనిని నిర్వహణను మూలనపడేశారు. టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసిన స్థలం వివాదంలో ఉండడం దీని నిర్వహణకు అదనపు సమస్యగా మారింది. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చేందుకు టెక్స్‌టైల్ పార్క్‌కు తెచ్చిన సామగ్రిని ఉపయోగించకపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా మూలనపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ త్వరలో కొత్త వస్త్ర విధానాన్ని ఆవిష్కరిస్తామని, పామిడిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మంత్రి చేసిన ప్రకటనతో పామిడి టెక్స్‌టైల్ పార్కు మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపిస్తారా.. లేక కొత్తది ఏర్పాటు చేస్తారా అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. స్థానిక ప్రజలు మాత్రం మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపించాలని కోరుతున్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి -శాంతిపురం : తమిళనాడు నుండి కర్ణాటకకు అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, ముగ్గురు వ్యక్తులను అదుపు లోకి తీసు కున్నట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాలుబుద్గురు ఎస్ఐ నరేష్ తెలిపారు. వారి కథనం మేరకు.. బుధవా రం ఉదయం ఏపీ 39 యూజె0531 నెంబర్ కలిగిన మినీ లారీలో రూ. 90,270 రూపాయలు విలువగల మూడువేలా తొమ్మిది కేజీల బియ్యంతో అక్రమంగా వెళుతున్న వాహనాన్ని కర్ణాటక సరిహద్దుల్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బియ్యం తరలిస్తున్న శాంతిపురం మండలం నడింపల్లి గ్రామానికి చెందిన టీ వెంకటేష్ కుమారుడు టీవీ తులసి రామ్, వి కోట మండలం పత్రపల్లి గ్రామానికి చెందిన ఎస్ దామోదర్ కుమారుడు డి కుశాల్ కుమార్, గుడిపల్లి మండలం యామగాని పల్లి గ్రామానికి చెందిన వి వెంకటేష్ కుమారుడు వి నాగేంద్రను అదుపులోకి తీసు కున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ధాన్యం రైతుకు దక్కని మద్దతు ధర

- కొనుగోళ్లలో దళారులు, మిల్లర్ల పెత్తనం
- తేమ, నాణ్యత పేర తూకంలో కోత
- మిల్లర్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు



ప్రజాశక్తి-అమలాపురం
ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మితే రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పెట్టే నిబంధనలతో రైతు చేసేదేమీ లేక మళ్లీ దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మద్దతు ధర వస్తుందని ధాన్యం ప్రభుత్వానికి అమ్మితే తేమ శాతం పేరుతో తరుగు అని చెప్పి మిల్లర్లు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో అధిక మంది రైతులు దళారులు వ్యాపారులపైన మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితంగా రైతులకు మద్దతు ధర కోల్పోవాల్సి వస్తోంది. రైతు పరిస్థితి దయనీయ స్థితిలో ఉంది. రబీ సమయంలో కూడా ఒక్కోసారి అకాల వర్షాలతో చేలోనే పనలు, కల్లాల్లోనే ధాన్యం రాసులు తడిసిపోవడంతో మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో అయిన కాడికి దళారులకు అమ్మాల్సి వస్తోంది. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తానన్న ఇన్‌పుట్ సబ్సిడీ క్రాఫ్ డామేజ్ సక్రమంగా అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పంటకు పెట్టుబడులు పెట్టి మద్దతు ధర రాక నష్టపోతున్నారు.

6 లక్షల, 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా.

కోనసీమ జిల్లాలో 1,64,854 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. జిల్లా మొత్తంలో 6 లక్షల 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే కొనుగోలు కమిటీ సభ్యులకు సూచించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రామచంద్రపురం ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయని, కావున ముందుగా రామచంద్రపురం ఆర్‌బికెల పరిధిలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. ముందుగా ఆ ప్రాంతంలో గోనెసంచులు జిపిఎస్‌తో సహా వాహనాలు, అందుబాటు, కొనుగోలు సిబ్బందికి శిక్షణలు వంటి తేమ శాతం కొలిచే పరికరాలను వేయింగ్ మిషన్‌లను రైతు భరోసా కేంద్రాలవారీగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బందులూ కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు.

అమ్మిన రెండు రోజుల్లోనే నగదు చెల్లింపు

జిల్లాలో 404 ఆర్‌ఎస్‌కె కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రబీ పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో రైతు ఆర్‌బికె ద్వారా ధాన్యం అమ్మితే 21 రోజులు పూర్తయితే గాని ఖాతాలో డబ్బులు జమ అయ్యేవికావు. అదే దళారికి అమ్మితే రెండు రోజుల్లోనే నగదు చెల్లించడంతో రైతులు బస్తాకు రూ.100 నుంచి రూ.150కు తగ్గినా దళారులకే అమ్మడానికి మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు 48 గంటల్లోనే రైతులు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. రైతు కష్టపడి ఆర్‌ఎస్‌కె ద్వారా ధాన్యం అమ్మిన రైస్ మిల్లుకు తరలించిన తరువాత మిల్లర్లు నాణ్యత లోపం పేరుతో బస్తాకు 2 నుంచి 3 కిలోలు తరుగు వసూలు చేస్తున్నారు. అంతేకాక ధాన్యం తేమ శాతం సరిగా లేదు ధాన్యం నుండి వచ్చే బియ్యంలో నూక శాతం అధికంగా ఉంది అని మరింత రేటు కోసేస్తున్నారు. ఈ ఇబ్బందుల కంటే దళారికి ధాన్యం అమ్ముకోవడమే ఉత్తమమని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం 75 కిలోల బస్తా రూ.1740, సాధారణ రకం 75 కేజీల బస్తా రూ.1725 రావాలి. కానీ రూ.1450 నుంచి రూ.1550 మధ్యలోనే రైతుల నుంచి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతులు సుమారు రూ.200 నుంచి రూ.250 నష్టపోతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా

రైతులు పండించిన ధాన్యంలో మట్టి రాళ్లు చెత్త పొల్లు వంటివి ఒక శాతం మించకుండా ఉండాలని రంగు మారిన మొలకెత్తిన పురుగులు పట్టిన ధాన్యం 5 శాతం మించకూడదని నిబంధనలు ఉన్నాయి. రైతులు రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా రైతు ధాన్యం అమ్మడానికి వీలులేదు.

అగ్నిపథ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్
అగ్నిపథ్ 2025-26 సంవత్సరానికి రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం తెలియజేసిందన్నారు. మార్చి 12 నుంచి ఏప్రియల్ 10వరకూ దరఖాస్తు చేసుకునే అవకావం ఉందన్నారు. దరఖాస్తుదారులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ / స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరి కోసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరి కోసం 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

పోలీసుల చర్యలతో ఫలితాలు

- హెల్మెట్ ధారణపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
వాహనదారులు హెల్మెట్ ధరించేలా చేసేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. గతంతో పోలిస్తే ఇప్పుడు మార్పు కనిపిస్తోందని పేర్కొంది. హెల్మెట్ ధారణ, మోటారు వాహనాల చట్ట నిబంధనలు అమలు విషయంలో అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని చెప్పింది. అవగాహన కార్యక్రమాల నిర్వహణతో పాటు చట్ట నిబంధనల గురించి పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటనల జారీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. చట్ట నిబంధనల అమలు విషయంలో కొన్ని జిల్లాల పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో వారికి తగిన సూచనలు చేయాలని డిజిపిని



ఆదేశించింది. హెల్మెట్ ధరించని వాళ్లకు చలాన్లను విధించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 31 వరకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎంత మంది మరణించారో జిల్లాల వారీ వివరాలను అందజేయాలని ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

అనర్హతపై స్పీకర్ కాలయాపన చేస్తే చేతులు ముడుచుకుని కూర్చోవాలా ?

తెలంగాణ ఎంఎల్ఎల పార్టీ ఫిరాయింపు అంశంపై సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ : పార్టీ ఫిరాయించిన సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతున్న పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేస్తుంటే, రాజ్యాంగ పరిరక్షకురాలిగా దేశ అత్యున్నత న్యాయస్థానం చేతులు ముడుచుకుని కూర్చోదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం) బృహత్తర లక్ష్యాన్ని ఓడించేందుకు స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా కాలాన్ని గడపలేరని జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. నిర్దిష్టమైన పద్ధతిలో నిర్ణయించాల్సిందిగా స్పీకర్‌కు న్యాయస్థానాలు చెప్పలేవు, కానీ నిర్దిష్టమైన, సహేతుకమైన కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేవా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. కె.టి.రామారావు, పాడి కౌశిక్ రెడ్డి సహా భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. తెలంగాణాలో పాలక కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10మంది ఎంఎల్ఎలపై అనర్హతా చర్యలు పెండింగ్‌లో వున్నాయి. వాటిపై సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ వీరు పిటిషన్లు వేశారు.

రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద దాఖలైన అనర్హతా పిటిషన్లపై నిర్దిష్ట కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్లను రాజ్యాంగ న్యాయస్థానాలు ఆదేశించవచ్చా లేదా అనేది ఈ కేసులో ప్రధాన ప్రశ్నగా వుంది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఈ స్పీకర్లు క్వాసీ జ్యుడీషియల్ ట్రిబ్యునళ్ళుగా వ్యవహరిస్తారు. "ఇక్కడ మీ వాదన ఎలా వుందంటే, స్పీకర్ చర్య తీసుకోకపోతే, రాజ్యాంగ పరిరక్షకురాలిగా కూడా వుండే సుప్రీం కోర్టు చేష్టలుడిగి కూర్చోవాలా? ఐదేళ్ల సభా కాల పరిమితిలో మొదటి ఏడాదిలోనే ఫిరాయింపు జరిగితే, మిగిలిన నాలుగేళ్లు స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోతే, కోర్టు చేతులు కట్టేసుకుని కూర్చోవాల్సిందేనా, ఏం చేయలేవా? " అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

ప్రతివాదులుగా తెలంగాణ ప్రభుత్వం, స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఇసి తదితరులు వున్నారు. వీరివైపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహతగి. సీనియర్ న్యాయవాది ఎ.ఎం. సింఘ్వి, న్యాయవాది శ్రవర్ కుమార్ ప్రభృతులు వాదిస్తున్నారు. రాజ్యాంగ కోర్టులు అనర్హతా పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను అభ్యర్థించవచ్చు కానీ నాలుగు వారాలు, ఆరు వారాలంటూ గడువు విధించి దానికి కట్టుబడాల్సిందిగా ఆదేశించలేవని రోహతగి వాదించారు. స్పీకర్‌పై సూపరింటెండెంట్ అధికారాలు కోర్టులకు లేవన్నారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద స్పీకర్ కూడా ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నందున కోర్టుల జ్యుడీషియల్ సమీక్ష అధికారం స్పీకర్ తుది నిర్ణయానికే పరిమితమై వుంటుంది. అంతేకానీ స్పీకర్‌కు గడువు విధించలేరని అన్నారు. జాప్యం వద్దంటూ కోర్టు నుండి స్పీకర్‌కు వెళ్ళే సందేశం అభ్యర్థన పదజాలంగానే వుంటుంది కానీ వాస్తవానికి అభ్యర్థన కాదని జస్టిస్ గవాయ్ అన్నారు. సుప్రీం కోర్టు అభ్యర్థించినప్పటికీ స్పీకర్ ఉల్లంఘిస్తే రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద అసాధారణ అధికారాలను కోర్టు ఉపయోగించుకోవచ్చు. ఏ రాజ్యాంగ సంస్థ అయినా సుప్రీం కోర్టు అభ్యర్థన లేదా ఆదేశాలకు కట్టుబడక పోయినట్లైతే మేం చేతులు ముడుచుకుని కూర్చోబోం" అని జస్టిస్ గవాయ్ చెప్పారు. కోర్టులకు ఇలా చేయండి, అలా చేయండని ఎవరైనా చెప్పగలరా అని రోహతగి ప్రశ్నించారు. ఆరు లేదా ఎనిమిది వారాల్లో అనర్హతా పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని రాజ్యాంగ సంస్థ ఎలా అదేశించగలదు? అని ఆయన ప్రశ్నించారు. దానికి బదులుగా సహేతుకమైన కాల వ్యవధిలో స్పీకర్ నిర్ణయించాలని మాత్రం కోర్టులు చెప్పగలవని అన్నారు. గతేడాది మార్చి-ఏప్రిల్‌లో అనర్హతా పిటిషన్లు దాఖలైతే ఈ ఏడాది జనవరిలో మాత్రమే నోటీసులు జారీ చేశామని గవాయ్ చెప్పారు.

ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించలేం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తెలిపింది. ఇది ఆర్థిక సంవత్సరంతో ముడిపడిన వ్యవహారమని పేర్కొంది. ఖాళీలు భర్తీ చేయకపోవడానికి ప్రభుత్వానికి తగిన కారణాలు ఉంటాయంది. పోలీసు శాఖలో ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వివరాలను వెల్లడించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ సందర్భంగా పై విధంగా అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ, 2022 వరకు ఖాళీగా ఉన్న ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటినీ భర్తీ చేశామన్నారు. మిగిలిన ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ ముగిస్తున్నట్టు ప్రకటించింది. పోలీసు శాఖలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళల ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వివరాలను బహిర్గతం చేయడం లేదని, 246 బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ అనుముల వంశీకృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

కేసు డైరీ ఇవ్వండి

పల్నాడు జిల్లాలో రెండేళ్ల క్రితం జరిగిన ఘటనకు సంబంధించిన కేసులో అరెస్ట్ అయిన వైసిపి కార్యకర్తలు చింతపల్లి అలియాస్ సత్తెనపల్లి పెద్ద సైదాను, చింతపల్లి అల్లాభక్షును పోలీసులు కొట్టారని న్యాయవాది ఎస్ రామలక్ష్మణరెడ్డి హైకోర్టులో వాదించారు. కోర్టుకు చెబితే, కుటుంబ సభ్యులపై గంజాయి కేసుల్లో ఇరికిస్తామని హెచ్చరించారని చెప్పారు. ఈ వివరాలను అఫిడవిట్ ద్వారా తెలియజేయాలని పిటిషనర్ల న్యాయవాదికి హైకోర్టు ఆదేశించింది. పెద్దసైదా, అల్లాభక్షుపై నమోదు చేసిన కేసుకు సంబంధించిన కేసు డైరీని తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ మన్మథరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అసభ్యకర పోస్టులపై అంబటి వాదనలు

వైసిపి అధినేత వైఎస్ జగన్‌తో పాటు తనను, తన కుటుంబ సభ్యులను కించపరుస్తూ, అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు హైకోర్టులో వాదనలు వినిపించారు. స్వయంగా హైకోర్టు ముందు హాజరై తన వాదనలు వినిపించారు. వాదనలపై స్పందించిన హైకోర్టు సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని గుంటూరు, పట్టాభిపురం పోలీసులను ఆదేశించింది.

కేన్సర్‌కు 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో కష్టాలు..!

- కొత్త నిబంధనలు తెరపైకి తేవడంతో రోగుల అవస్థలు
- కీమోల అప్రూవల్ విషయంలో నానాయాతన
- ఒకే విడత కీమోకు రెండుసార్లు అప్రూవల్ అట
- ఆర్థిక భారం భరించలేక దిక్కుతోచని స్థితిలో సామాన్య కుటుంబాలు
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న కేన్సర్ రోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
కేన్సర్ రోగులకు సరైన చికిత్స అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కేన్సర్ వైద్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లో అనేక కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను ముప్పతిప్పలు పెడుతోంది. కేన్సర్ రోగులకు అందించే పలు కీమోలు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకుండా పోవడంతో సామాన్య కుటుంబాలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆర్థిక భారం భరించలేక రోగుల కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇటీవల కాలంలో కేన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో పెద్ద ఎత్తున అనుమానిత కేసులు బయటపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి రెండు లక్షల మందికీ ఒక్కశాతం కేన్సర్ అనుమానితులు ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా కేన్సర్ కబలించేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఓరల్, బెస్ట్ కేన్సర్‌లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేన్సర్ వచ్చిన రోగులకు చికిత్స అతిపెద్ద సవాల్‌గా మారింది. కేన్సర్ చికిత్స ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉందని చెబుతున్నప్పటికీ అంతంతమాత్రం అన్నట్లుగా తయారైంది. దీంతో కేన్సర్ రోగులకు వైద్యం చేయించలేక సామాన్య కుటుంబాలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. కేన్సర్ రోగం నిర్ధారణకు బయాప్సీ పరీక్ష తప్పనిసరిగా చేయాలి. దీనికి రూ.ఏడు వేల వరకూ అవుతుంది. రోగ నిర్ధారణ అయిన తర్వాత ఎంత వరకూ వ్యాప్తి చెందిందో తెలుసుకోవాలంటూ పెట్‌స్కాన్ రూ.23 వేలు పెట్టి చేయించాలి. రోగం నిర్ధారణకే దాదాపు రూ.30 వేలకు పైగా ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవేమీ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఉండడం లేదు. కేన్సర్ రోగులకు అందించే కీమోల పరిస్థితి సైతం ఇదేవిధంగా తయారైంది. కీమోలను కోడ్‌లు ప్రాతిపదికన పిలుస్తారు. కొన్ని కోడ్‌లు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడంతో రోగుల కుటుంబాలకు ఏంచేయాలో అర్థంకాకుండా పోతోంది. కీమోలు సైతం ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. దీంతో కేన్సర్ రోగులు బెంగతో కుచించుకుపోతున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఎన్‌టిఆర్ వైద్య సేవలో కీమోల అప్రూవల్ విషయంలో కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను నానా ఇబ్బంది పెడుతున్న పరిస్థితి నెలకొంది.

ఒకే కీమోకు రెండుసార్లు అప్రూవులా..

కేన్సర్ తీవ్రతను బట్టి వైద్యులు కీమోలను నిర్ణయిస్తారు. ఎంతమోదులో ఎక్కించాలి. కీమోలో ఏ మందులు వాడాలో వైద్యులు నిర్ణయించి ముందుకు సాగుతారు. ఒక్కోసారి రెండు రకాల మందులు ఒకే కీమోలో రోగికి అందిస్తారు. రెండు నెలల క్రితం వరకూ ఇలాంటి కీమోలకు ఒకేసారి ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టు నుంచి అనుమతి పొందితే సరిపోయేది. ఇప్పుడు నిబంధనలు మార్చేసి ఒక మెడిసిన్ ఎక్కించిన తర్వాత మళ్లీ డిశ్చార్జ్ చేసి, మరో మెడిసిన్‌కు అప్రూవల్ పెట్టాలి. అప్రూవల్ వచ్చిన తర్వాత ఆ మెడిసిన్ ఎక్కించి మరోసారి డిశ్చార్జ్ చేయాలి. ఒకే కీమోకు రెండు సార్లు అప్రూవల్, రెండు సార్లు డిశ్చార్జులు చేయిస్తున్నారు. దీంతో రోగులు పడుతున్న బాధలు వర్ణాతీతంగా మారుతున్నాయి. అదనంగా రోజులు కేటాయించడంతోపాటు, డిశ్చార్జ్ కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉన్న అధికారులు ఏవిధంగా ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. టెక్నాలజీ గురించి ప్రభుత్వ పెద్దలు పదేపదే వల్లిస్తున్నారు. కీమోలో అప్రూవల్ విషయంలో ఒకేసారి అనుమతి పొందే టెక్నాలజీని పక్కకు పెట్టి రోగులను ఇబ్బంది పెట్టడం ఏంటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. కేన్సర్ రోగులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వైద్యం అందించే ప్రక్రియ సులువుగా మార్చాల్సి ఉంది. అలాకాకుండా వైద్యం అందే ప్రక్రియను మరింత కష్టతరంగా మార్చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. లేకపోతే కేన్సర్ రోగుల కష్టాలు మరింత పెరగనున్నాయి.

సర్దుబాటు పేరుతో ఊరు బడికి ఎసరు..!


విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి

ప్రజాశక్తి - భీమడోలు (పశ్చిమగోదావరి జిల్లా)
నూతన విద్యా విధానంలో సంస్కరణల కారణంగా విద్యా వ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలను వ్యతిరేకించే పాఠశాల విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉన్నతాధికారులు పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదన మేరకు మండలంలోని దుద్దేపూడి, సదాశివపురం, సాయంపాలెం, పూళ్ల నెంబర్-3 ప్రాథమిక పాఠశాలలు మూతపడనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం సదరు పాఠశాలలో చేరేందుకు ఆసక్తి కనబర్చే విద్యార్థులు ఉంటే పాఠశాలలను పున్ణప్రారంభిస్తామని అధికారులు సర్దుబాటు మాటలు చెబుతున్నారు. ఇదే క్రమంలో హైస్కూల్ స్థాయిలో నిర్వహించేందుకు అనువైన వాతావరణం గల అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 130 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు వరకూ బిఇడి ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. హైస్కూల్ నిర్వహణకు అవసరమైన నాలుగు భవనాలు అదే గ్రామంలో దగ్గర ప్రాంతాల్లో అందుబాటులో



ఉన్నాయి. వీటిని సైతం పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మారుస్తున్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ఆరో తరగతిలో చేరేందుకు జాతీయ రహదారిని దాటడం, రైల్వే ట్రాక్ ఉండడం వంటి అడ్డంకులు ఉండరాదు. అన్నేవారిగూడెం పాఠశాల విషయమై ఈ విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోలేదనే ఆరోపణలున్నాయి. మండలంలో 85 మంది వరకూ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. తాజా నిబంధనల మేరకు అన్నేవారిగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఐదుగురు బిఇడిలు ఇతర ప్రాంతాలకు బదిలీ, ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు ఆరుగురు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తున్న కారణంగా మిగులు ఉపాధ్యాయులుగా వారిని చూపుతున్నారు. మండలంలో 74 మంది ఉపాధ్యాయులు అవసరమని అధికారులు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య మరింతగా తగ్గితే ఉపాధ్యాయ పోస్టులకు మరింత కోత ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. మండలంలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చనున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మోడల్ పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు. దీనివల్ల పాఠశాల నిర్వహణకు కనీసంగా అవసరమైన 60 మంది విద్యార్థులు అందుబాటులో ఉంటారని, వీరికి పూర్తిస్థాయిలో విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు ఉంటారని అధికారులు చెబుతున్నారు. మండలంలోని భీమడోలు నెంబర్-1, 4, పొలసానిపల్లి నెం-3, గుండుగొలను నెం-1, 2, పూళ్ల నెం-1, ఎంఎంపురం-1, కురెళ్లగూడెం నెం-1 పాఠశాలలు మోడల్ స్కూళ్లుగా మారనున్నాయి. ఇక మండలంలోని 17 ఇతర పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో ఒకటి నుంచి ఐదో తరగతి నిర్వహించేందుకు బేసిక్ ప్రయిమరీ స్కూళ్లుగా మార్చారు. మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహించే తొమ్మిది స్కూళ్లను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చనున్నారు. అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం 30 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నందున దాన్ని కూడా బేసిక్ పాఠశాలగా మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడ మిగిలిన విద్యార్థులు దూరప్రాంతమైన భీమడోలుకు రావాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో పూళ్ల నెం.1 పాఠశాలలో పూళ్ల నెం-2, 3 పాఠశాలలు విలీనం కానున్నాయి. ఇక కొత్త అంబరుపేట, పాత అంబరుపేట ఆవాస ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఒకటిగా చేసే ప్రయత్నానికి పాఠశాల విద్యా కమిటీలు అంగీకారం తెలపలేదు. వీరికి నచ్చజెప్పేందుకు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు. ఇదే జరిగితే ఒక ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మరో పాఠశాలకు వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. దారిలోని చెరువులు, ఇతరాలు దాటి వెళ్లేందుకు వారు ఇబ్బందులు ఎదుర్కొంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గుండుగొలను నెం-1 పాఠశాలలో నెం-3, (గతంలో సిఎస్ఐ పాత ఎయిడెడ్ పాఠశాల) ప్రస్తుతం ఎంపిపి పాఠశాలను విలీనం చేస్తున్నారు. ఇక అదే ప్రాంతంలోని సిబిసిఎన్‌సి ఎయిడెడ్ పాఠశాల నిర్వహణ బాధ్యతలను ఎయిడెడ్ పాఠశాల మండల పరిషత్ యాజమాన్యానికి అప్పగించలేదు. అలాగని చెప్పి ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం లేదు. పాఠశాల నిర్వహణను మాత్రం మండలాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక పొలసానిపల్లిలో నెం-2ను ప్రాథమిక పాఠశాల నెం.1 పాఠశాలలో విలీనం కానుంది. వీటిపై అధికారులు మాట్లాడుతూ ఇవన్నీ ప్రతిపాదనలు మాత్రమేనని తుదిరూపం వచ్చేసరికి మార్పులు, సర్దుబాట్లు జరుగుతాయని అంటున్నారు.

చతికిలపడ్డ స్మార్ట్ సిటీస్ మిషన్



- వందలో 18 నగరాల్లోనే ప్రాజెక్టులు
- మోడీ సర్కార్ వైఫల్యంతో దరి చేరని లక్ష్యం

న్యూఢిల్లీ : ప్రజల జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'స్మార్ట్ సిటీస్ మిషన్' ఘోరంగా విఫలమైంది. 2014 మే 26న భారత దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ.. దేశంలో అత్యాధునిక సాంకేతిక కమ్యూనికేషన్ సామర్థ్యాలతో కూడిన వంద స్మార్ట్ సిటీలను నిర్మిస్తామని ప్రగల్భాలు పలికారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా వంద నగరాలను ఎంపిక చేశారు. అనేక గడువులు దాటాయి. చివరకు ఈ ఏడాది మార్చి 31 వరకు దానిని పొడగించారు. అది కూడా ముగిసింది. కానీ.. అనుకున్న లక్ష్యాన్ని చేరడంలో మాత్రం మోడీ సర్కారు చతికిలపడింది. కేవలం 18 సిటీల్లో ప్రాజెక్టులు పూర్తయ్యాయని విశ్లేషకులు చెప్తున్నారు.

కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత.. స్మార్ట్ సిటీస్ మిషన్ గురించి పెద్దగా ప్రచారం చేసుకున్నారు. "గతంలో నగరాలు నదీ తీరాలపై నిర్మించబడ్డాయి. ఇప్పుడు రహదారుల వెంట ఉన్నాయి. భవిష్యత్తులో అవి ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల లభ్యత, మౌలిక సదుపాయాల ఆధారంగా నిర్మితమవుతాయి" అని మోడీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా చెప్పబడుతున్న ఈ ప్రాజెక్టులో మరుసటి సంవత్సరం 1.2 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ఆయన ప్రకటించారు. ప్రయివేటు వనరులు, విదేశాల నుంచి కూడా నిధులు వస్తాయి. అప్పట్లో దేశ ఆర్థిక మంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ వివరాలనూ వెల్లడించారు. ఈ కొత్త నగరాల్లో ఎక్కువ భాగం పెద్ద నగరాల చుట్టూ ఉన్న పట్టణాలుగా ఉంటాయని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఇటు మోడీ అనుకూల మీడియా సైతం 'స్మార్ట్ సిటీస్'కు విపరీత ప్రచారం కల్పించింది. మోడీ సర్కారు ప్రణాళికను కొనియాడింది. టైర్-2 సిటీస్‌కి ఈ ప్రణాళికతో మంచి రోజులు రానున్నాయని కోడై కూసింది. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తరలి వస్తాయని వివరించింది. సదరు నగరాల్లోని ప్రజలకు మోడీని ఒక హీరోలాగా ప్రచారం చేసింది మీడియా.

రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులు, విదేశీ సరఫరాదారులు, ప్రపంచ సాంకేతిక, ఐటీ సంస్థలు స్మార్ట్ సిటీ మిషన్‌లో మేకిన్ ఇండియా ప్రాజెక్టు కంటే ఎక్కువ ఆకర్షణీయమైన వ్యాపార అవకాశాలను చూశాయి. 2015 మధ్య నాటికి.. ఫ్రాన్స్, యూఎస్, చైనా, స్వీడన్, ఇజ్రాయెల్, జర్మనీ, బ్రెజిల్, సింగపూర్ సహా 14 దేశాలు ఆసక్తిని వ్యక్తం చేశాయి. స్మార్ట్ సిటీలలో ప్రధాన పెట్టుబడులను పరిశీలిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, యూఎస్-ఎయిడ్ వంటి దిగ్గజ అంతర్జాతీయ సంస్థలు మద్దతు ఇచ్చాయి. ప్రైస్‌వాటర్‌హౌజ్‌కూపర్స్, మెకిన్సే, లీ అసోసియేట్స్ అండ్ బాష్ ఎంప్యానెల్డ్ కన్సల్టెంట్లుగా ఉన్నాయి. ప్రయివేటు సంస్థలకు ఈక్విటీ భాగస్వామ్యం, యూజర్ ఛార్జీలు విధించే హక్కును కల్పించారు.

దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామాలను వైఫై బాక్స్‌లు, గేర్ వంటి సౌకర్యాలతో అనుసంధించటానికి 7 లక్షల కిలోమీటర్ల బ్రాడ్‌బ్యాండ్ కేబుల్ అవకాశాలు కాంట్రాక్టర్లను ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీంతో ఆ సమయంలో ప్రయివేటు, విదేశీ పెట్టుబడిదారులు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం విపరీత ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుంది. దీంతో మోడీ కలల ప్రాజెక్టు ఆర్థికంగా భారమైనదనీ, వినాశకరమైనదని ప్రభుత్వంలోని ముఖ్యులు ప్రధానికి వివరించినట్టుగా తెలిసింది.

ఈ ప్రాజెక్టు రాజకీయంగా తెలివితక్కువ నిర్ణయమని కూడా చెప్పినట్టు సమాచారం. స్మార్ట్ సిటీస్ మిషన్ మన్మోహన్ సర్కారు తీసుకొచ్చిన జవహర్‌లాల్‌నెహ్రూ నేషనల్ రెన్యూవల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం), దాని నాలుగు ఉప-మిషన్ల నుంచి భారీగా రుణాలు తీసుకున్నది. మోడీ మిషన్ ప్రస్తుతమున్న అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-యూ), నేషనల్ అర్బన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ (ఎన్ఎల్‌యూపీ)లను అతివ్యాప్తి చేస్తున్నది.

వాస్తవానికి స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రస్తుత దశను 2020 నాటికి ముగించాలని నిర్ణయించారు. కానీ, అమలులో అడ్డంకులు ఉన్నందున పలు పొడగింపులు వచ్చాయి. చివరకు ఈ ఏడాది మార్చి 31ని తుది గడువుగా నిర్ణయించారు. అయితే, ప్రధానమైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, స్మార్ట్ పరిష్కారాలు వంటివి ఈ మిషన్ సాధించలేకపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు. స్మార్ట్ సిటీ మిషన్ అనూహ్యంగా ముగిసిందని అంటున్నారు. ఇది అనేక ఉద్యోగాల నష్టం, సంబంధిత అనిశ్చితులను మిగిల్చిందని చెప్తున్నారు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆహారం, గృహనిర్మాణం, విద్యుత్, రవాణా వంటి ముఖ్యమైన విషయాలకు ప్రాధాన్యత ఉండాలని విశ్లేషకులు చెప్తున్నారు. వాటిని వదిలేసి.. స్మార్ట్ సిటీస్ అనే విస్తృతమైన అంశాన్ని పట్టుకుంటే.. ఆర్థిక నష్టం, ప్రజల ప్రయోజనాలకు నష్టం తప్పితే మరేమీ ఉండదని అంటున్నారు.

2500 కేజీల నార్కోటిక్స్ స్వాధీనం

న్యూఢిల్లీ : పశ్చిమ హిందూ మహాసముద్రంలో గస్తీ నిర్వహిస్తున్న భారత నావికాదళ యుద్ధనౌక ఐఎన్ఎస్ తర్కాష్ ఇటీవల అక్రమంగా రవాణా చేస్తున్న 2500 కేజీలకు పైగా నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ విషయాన్ని భారత నావికా దళం బుధవారం ప్రకటించింది. మార్చి 31న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో భారత నేవీ పి81 విమానం నుంచి వచ్చిన నిఘా సమాచారంతో అనుమానాస్పద నౌకలో ఐఎన్ఎస్ తర్కాష్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. మెరైన్ కమాండోలతో కూడిన ఒక ప్రత్యేక బోర్డింగ్ బృందం అనుమానిత నౌకలోకి ప్రవేశించి క్షుణ్ణంగా తనిఖీలు చేసి సీల్ చేసి ఉన్న అనేక ప్యాకెట్లను కనుగొంది. వీటిల్లో 2386 కేజీల హషీష్, 121 కిలోల హెరాయిన్‌తో పాటు మరింత మాదకద్రవ్యాలను గుర్తించింది. దీంతో అనుమానాస్పద నౌకను, అందులోని వ్యక్తులను ఐఎన్ఎస్ తర్కాష్ అదుపులోకి తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు భారత నావికా దళం తెలిపింది.

కాగా, హిందూ మహాసముద్ర ప్రాంతం (ఐఓఆర్)లోని అంతర్జాతీయ జలాల్లో భద్రత, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఏడాది జనవరి నుంచి ఐఎన్ఎస్ తర్కాష్ విధులను నిర్వహిస్తోంది.

లాలూ ప్రసాద్‌కు అస్వస్థత.. ఎయిమ్స్‌లో చేరిక

పాట్నా : అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో బుధవారం చేరారు. ఈ విషయాన్ని లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ పాట్నాలో వెల్లడించారు. వీపు, చేతిపై పుండ్లు వచ్చాయని, ఆపరేషన్ కోసం ఎయిమ్స్‌లో చేర్పించినట్లు తేజస్వీ తెలిపారు. లాలూ వెంట రబ్రీదేవి ఉన్నారని చెప్పారు. కాగా, 76 ఏళ్ల లాలూ ప్రసాద్ గత కొంతకాలంగా బహిరంగ సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. గతవారం పాట్నాలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు నిర్వహించిన ప్రదర్శనలో లాలూ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు టిడిపి, జనసేన మద్దతు

- వైసిపి వ్యతిరేకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్‌లోని అధికార టిడిపి మద్దతు ఇవ్వగా, ప్రతిపక్ష వైసిపి వ్యతిరేకించింది. బుధవారం లోక్‌సభలో బిల్లుపై జరిగిన చర్చలో టిడిపి ఎంపి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. చట్టంపై నియమాలను రూపొందించేటప్పుడు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుల కూర్పును నిర్ణయించడానికి రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించడాన్ని పరిగణించాలని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేన మద్దతు ఇస్తుందని జనసేన ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ఇది ఒక సంస్కరణ అని అన్నారు. 36.1 లక్షల ఎకరాలు వక్ఫ్ భూములు ఉన్నాయని, ఈ ఆస్తుల విలువ లక్షల కోట్లలో ఉన్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమ కోసం వీటిని ఉపయోగించాలని డిమాండ్ చేశారు. వైసిపి ఎంపి మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. జెపిసి ముందు ముస్లిం సంఘాలు, వైసిపి, ఇతర పక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. దేశంలో 14.6 శాతం (22 కోట్లు) ముస్లీములు ఉన్నారని, వారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. 'ఈ బిల్లు రాజ్యంగం వ్యతిరేకం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 14, 25, 26లను ఉల్లంఘిస్తోంది. బిల్లులోని సెక్షన్ 9లో ముస్లీమేతరులను బోర్డులో చేర్చే అంశాన్ని పొందుపరిచారు. ఇది అనవసరమైనది' అని అన్నారు. అయితే బిఆర్ఎస్, బిజెడికి లోక్‌సభలో ఎంపిలు లేరు. రాజ్యసభలో ఎంపిలు ఉన్నారు. ఈ రెండు పార్టీలు కూడా రాజ్యసభలో బిల్లును వ్యతిరేకిస్తామని

కునాల్ కమ్రా షోకు హాజరైన బ్యాంకర్‌కు పోలీసుల సమన్లు

ముంబయి : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై చేసిన వ్యాఖ్యలకు గాను కమెడియన్ కునాల్ కమ్రాపై నమోదైన కేసులో ఈ షోకు హాజరైన ఒక బ్యాంకర్‌కు పోలీసులు సమన్లు పంపారు. ఈ కేసులో సాక్షిగా ఉండాలని సమన్లు పంపినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. కునాల్ కమ్రా షోకు హాజరైన వారందర్నీ సాక్షులుగా పిలిచినట్లు వస్తున్న వార్తలను పోలీసులు ఖండించారు. బుక్‌మైషో యాప్ ద్వారా కునాల్ షోకు టికెట్ బుక్ చేసుకున్న బ్యాంకర్‌కు మొబైల్ ఫోన్ ద్వారా సమన్లు పంపినట్లు, ఖార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని సూచించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అయితే తక్షణమే హాజరుకావాల్సిన అవసరం లేదని సదరు వ్యక్తికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. శివసేన ఎమ్మెల్యే ముర్జీ పటేల్ చేసిన ఫిర్యాదు ఆధారంగా మార్చి 28న ఖార్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైన సంగతి తెలిసిందే.

కాగా, ఈ విషయంపై కునాల్ కమ్రా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తన షోకు హాజరైన కారణంగా ప్రేక్షకులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పారు. పోలీసుల సమన్ల కారణంగా బ్యాంకర్ తన సెలవులన్నీ రద్దు చేసుకోవాల్సి వచ్చిందని అన్నారు. ఈ నెల 6న సెలవుల నుంచి తిరిగిరావాల్సిన బ్యాంకర్ సోమవారమే తిరిగివచ్చినట్లు కునాల్ తెలిపారు. 'నా షోకి హాజరు కావడం వల్ల మీకు కలిగిన అసౌకర్యానికి నేను చాలా చింతిస్తున్నాను. దయచేసి నాకు ఇమెయిల్ చేయండి, తద్వారా మీరు భారతదేశంలో ఎక్కడైనా మీ తదుపరి సెలవులను షెడ్యూల్ చేసుకోగలను' అని కామ్రా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే, ఈ కేసులో కమ్రాకు మద్రాస్ హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 7కు తదుపరి విచారణను వాయిదా వేసింది.

దేశంలో పత్రికాస్వేచ్ఛ పరిఢవిల్లుతోంది !

- విదేశీ ధ్రువీకరణలు అక్కర్లేదంటూ కేంద్రం వెటకారం

న్యూఢిల్లీ : దేశంలో శక్తివంతమైన పత్రికా, మీడియా వ్యవస్థ ఉందని, పత్రికా స్వేచ్ఛ ఫరిఢవల్లుతోందని ఇందుకు విదేశీ సంస్థల నుంచి ప్రత్యేక ధ్రువీకరణ అక్కర్లేందని నిండు సభలో కేంద్రం వెటకారపు వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థ 'గ్లోబల్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్' 2024లో భారత్ వెనుకబాటు గురించి కాంగ్రెస్ ఎంపి కె సుధాకరన్ ప్రశ్నలు సంధించారు. పత్రికా స్వేచ్ఛకు సంబంధించి 180 దేశాల జాబితాలో భారత్ 159వ స్థానంలో నిలిచింది. తుర్కియే (158), పాకిస్తాన్ (152), శ్రీలంక (150) కంటే దిగువన భారత్ నిలవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై మంత్రి సమాధానం ఇస్తూ మన దేశ మీడియా వ్యవస్థ ఏవిధంగా ఉందనేందుకు విదేశీ సంస్థల ధ్రువీకరణ అవసరం లేదు, భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛకు పూర్తి రక్షణ ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన ఫిర్యాదులను స్వయం ప్రతిపత్తి సంస్థ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) విచారణ చేస్తోందని తెలిపారు.

గాజాలో 17 శాతాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్

- భూతల దాడులను విస్తరిస్తామంటూ బరితెగింపు ప్రకటనలు
- మరో ఆసుపత్రిపై దాడి.. 57 మంది మృతి



గాజా : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో రెచ్చిపోతోంది. గాజాలో వైమానిక దాడులు, భూతల దాడులతో విరుచుకుపడుతూ ఇప్పటి వరకు 17 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుంది. అంతేకాదు భూతల దాడులను మరింతగా విస్తరింపజేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బరితెగింపు ప్రకటనలు చేశారు. బఫర్ జోన్‌లకు కలిపేందుకు పెద్ద మొత్తంలో భూ భాగాన్ని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, బుధవారం తెల్లవారు జాము నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 57 మంది మరణించారు. జాబాలియాలోని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ నిర్వహిస్తున్న ఆసుపత్రిపై జరిగిన దాడిలో 22 మంది మరణించారు. వీరిలో మహిళలు, చిన్నారులే ఎక్కువగా వున్నారని స్థానిక అధికారులు తెలిపారు. అక్కడ పరిస్థితి చాలా భీతావహంగా వుందని స్థానికులు తెలిపారు. ఛిద్రమైన శరీరాలు, ముక్కలుగా పడిన అవయవాలు ఆ ప్రాంతమంతా పడి వున్నాయని, ఊహకు అందని రీతిలో ఆ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని జరిపిన వైమానిక దాడుల్లో అనేకమంది పాలస్తీనియన్లు మరణించారని గాజా హోం శాఖ వర్గాలు తెలిపాయి. గత నెల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినప్పటి నుండి ఇప్పటివరకు 1100 మందికి పైగా మరణించారు. గత 31 రోజులుగా గాజాకు నిత్యావసరాల సరఫరా నిలిచిపోయిన ఫలితంగా గాజాలోని బేకరీలు మూతపడ్డాయి. వీటిలో ప్రపంచ ఆహార కార్యక్రమం నిర్వహిస్తున్న బేకరీలే 25 వున్నాయి. ఈ చర్యల వల్ల పాలస్తీనియన్లు అందరూ ఉమ్మడిగా శిక్షను అనుభవించాల్సి వస్తోందని డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వ్యాఖ్యానించింది. ఇప్పటికి నెల రోజులుగా ఒక్క వాణిజ్య ట్రక్కు కూడా లోపలకు రాలేదని తెలిపింది. గాజాలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలను బలవంతంగా ఖాళీ చేయిస్తున్న నేపథ్యంలో ఇంకా దాడులను విస్తరిస్తామని, భూభాగాన్ని స్వాధీనం చేసుకుంటానమని ఆర్మీ ప్రకటనలు చేస్తోంది. ఇజ్రాయిల్ హక్కుల గ్రూపు గిషా డేటా ప్రకారం, మొత్తం ఏరియాలో ఇప్పటికే 17శాతాన్ని స్వాధీనం చేసుకున్నారు. రఫా, ఖాన్ యూనిస్ నగరాలను ఖాళీ చేసి అల్ మావసి వైపు తరలిపోవాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

యెమెన్‌పై అమెరికా దాడులు : నలుగురు మృతి

మరోవైపు అమెరికా యెమెన్‌పై వైమానిక దాడికి పాల్పడింది. మంగళవారం రాత్రి యెమెన్‌లోని హుడైదా ప్రాంతంలోని నీటి నిర్వహణ భవనంపై అమెరికా జరిపిన దాడిలో నలుగురు మృతి చెందినట్లు తాజాగా తహౌతి ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. మధ్యప్రాచ్యాన్ని యుద్ధ విమానాలతో మోహరిస్తున్నట్లు ఇటీవల అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా యెమెన్‌పై దాడికి పాల్పడింది. కాగా, మంగళవారం రాత్రి అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు మృతిచెందినట్లు నిర్ధారించినట్లు హౌతి ఆరోగ్యశాఖ ప్రతినిధి అనీస్ అలాస్బాహి తెలిపారు. మంగళవారం రాత్రి హుదేయిదా గవర్నరేట్‌లోని అల్ మన్సొరియా జిల్లాలోని నీటి నిర్వహణ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు జరిపిన దాడిలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ దాడిలో బలైంది ఎక్కువమంది ఉద్యోగులే అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో హౌతి అనుబంధ అల్ మసిరా టీవీ మృతుల సంఖ్య నాలుగుకి పెరిగిందని నివేదించింది. వాయువ్యంలోని హజ్జా ప్రాంతం, ఉత్తరాన సాదాపై కూడా దాడి జరిగిందని స్థానిక మీడియా వెల్లడించింది.

రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాకపోతే, పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొనే అవకాశముందంటూ ఆయన అగ్గిరాజేశారు. దక్షిణాది రాష్ట్రాల్లోని పలు ఆలయాలు, హర్యానాలో గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేస్తోందంటూ ఆయన ఆజ్యం పోశారు. రిజిజు అభిప్రాయాలపై ప్రతిపక్షాల సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముస్లింలకు, ఇతర సామాజిక తరగతులకు మధ్య విభేదాలు సృష్టించి దేశాన్ని తరగతుల వారిగా, మతాల వారిగా చీల్చేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నుతోందని విమర్శించారు.

సమాఖ్య నిర్మాణంపై దాష్టి గౌరవ్ గొగోయ్

కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణల బిల్లు రాజ్యాంగ నిబంధనలను నీరుగార్చేలా ఉందన్నారు. మైనార్టీల హక్కులను తొలగించడమే కాకుండా దేశాన్ని విభజించాలనే వినాశకర లక్ష్యాలతో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌ను తప్పుదారి పట్టిస్తోందన్నారు. ఈ బిల్లు మన సమాఖ్య నిర్మాణంపై దాడి చేస్తుందన్నారు. మైనార్టీ ప్రతినిధులతో తగినంతగా చర్చించలేదని పేర్కొన్నారు. మహిళలకు హక్కులు కల్పిస్తున్నామంటూ చెబుతూ ప్రస్తుతమున్న చట్టం మహిళల పట్ల వివక్ష చూపుతోందన్న దుష్ప్రచారానికి కేంద్రం ఒడిగట్టిందని విమర్శించారు. ప్రస్తుత వక్ఫ్ చట్టంలో వితంతువులు సహా మహిళ రక్షణ, సాధికారత కోసం అనేక నిబంధనలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతిపక్షాల సూచనలను జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదని కూడా ఆయన విమర్శించారు.

దేశ లౌకిక ప్రతిష్టను దెబ్బతీస్తుందన్న అఖిలేష్ యాదవ్

దేశాన్ని మతాల ప్రాతిపదికన విభజించాలనే లక్ష్యంతోనే వక్ఫ్ సవరణలు తీసుకొస్తున్నారంటూ ఎస్‌పి నేత అఖిలేశ్ యాదవ్ తప్పుబట్టారు. దేశ లౌకిక ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రపంచానికి తప్పుడు సందేశం పంపుతోందన్నారు. బిజెపికి తగ్గుతున్న ఓటుబ్యాంకును పునరుద్ధరించుకోవడానికే ఈ బిల్లును తీసుకొచ్చారని విమర్శించారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఓట్ల శాతం తగ్గినందున, బిజెపి ఓట్లను తిరిగి రాబట్టుకునేందుకు అది ప్రయత్నిస్తోందని చెప్పారు.

స్వయం ప్రతిపత్తిపై దాడి : సిపిఎం ఎంపి కె రాధాకృష్ణన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిపై దాడి అని సిపిఎం లోక్‌సభ పక్షనేత కె రాధాకృష్ణన్ పేర్కొన్నారు. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఈ బిల్లు ఉల్లంఘిస్తుందన్నారు. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులపై నియంత్రణను కేంద్రీకరించడం, ముస్లిం సమాజ హక్కులను బలహీనపరచడం, మతపరమైన విషయాలపై ప్రభుత్వం జోక్యం వంటి ప్రమాదకరమైన లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. బుధవారం లోక్‌సభలో జరిగిన వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చలో రాధాకృష్ణన్ మాట్లాడారు. ఈ బిల్లు అన్ని మత సమాజాలకు వారి సొంత వ్యవహారాలను నిర్వహించుకునే హక్కును ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తుందని అన్నారు. ముస్లిం సమాజానికి వారి మతపరమైన వ్యవహారాలను ఆచరించే హక్కు ఉండాలని, దానిని తిరస్కరించే విధానాన్ని మనం అవలంభించకూడదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి విధానాలను ఎందుకు అవలంభిస్తుందో ఆలోచన చేయాలని హితవు పలికారు. ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులో చేర్చడం వల్ల ముస్లిం సమాజ మతపరమైన హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. ఇతర మతాల పట్ల కూడా ప్రభుత్వం ఈ విధానాన్ని అవలంభించడానికి సిద్ధంగా ఉందా? అని ప్రశ్నించారు. ఈ దేశంలో ప్రతి మత సమూహం తమ ప్రయోజనాలను కాపాడుకోగల పరిస్థితి ఉండాలని, ముస్లిం సమాజాన్ని ఒంటరిని చేసే ఈ చర్యకు వ్యతిరేకంగా మన దేశం మేల్కొని చర్య తీసుకోవాలని అన్నారు. ఈ బిల్లును సమర్థించే వారు హిట్లర్ జర్మనీని ఫాసిజం వైపు ఎలా నడిపించాడనే చారిత్రక వాస్తవికతను గుర్తుంచుకోవాలని సూచించారు. ఆ సమయంలో హిట్లర్ ఫాసిజాన్ని సమర్థించిన కవి మార్టిన్ నీమోల్లర్ రాసిన ఎలిజీని కూడా వారు మరచిపోకూడదని అన్నారు. 'చివరికి వాళ్ళు నా కోసం వచ్చినప్పుడు, నా తరపున మాట్లాడటానికి ఎవరూ లేరు' అనే పదాలు ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే వారి కోసం ఉద్దేశించబడ్డాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వారి తరపున మాట్లాడేవారు ఎవరూ ఉండరనే వాస్తవాన్ని వారు గ్రహించాలని రాధాకృష్ణన్ హెచ్చరించారు.

ముస్లిమేతరలకు చోటు లేదు !

వక్ఫ్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం ఉండదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పుకొచ్చారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరలకు చోటు లేదని ఆయన అన్నారు. 'వక్ఫ్ చట్టం, బోర్డు 1995లో అమల్లోకి వచ్చాయి. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేరుస్తామని, వక్ఫ్‌లో జోక్యం చేసుకుంటామని కొందరు వాదనలు చేస్తున్నారు. అలాంటిదేమీ లేదు' అని ఆయన అన్నారు. ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయన్నారు.

శాంతి చర్చలకు సిద్ధం

- కేంద్రానికి మావోయిస్టుల లేఖ !

న్యూఢిల్లీ : భారత్‌ని మావోయిస్ట్ రహిత దేశంగా మార్చాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'యాంటీ మావోయిస్టు ఆపరేషన్'ను దూకుడుగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే.. కాల్పుల విరమణకు సిద్ధమని మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన చేసినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆ ప్రకటన ప్రకారం.. 'ప్రజల కోసం ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి. యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి' అని మావోయిస్టు కేంద్ర కమిటీ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొంది. శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి. అప్పుడు మేం వెంటనే కాల్పుల విరమణ పాటిస్తాం" అని మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదలైంది.

నవ భారతాన్ని నిర్మిద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కొత్త రంగాలను ప్రైవేటీకరిస్తూ గరిష్టంగా లాభాలను పోగేసుకునేందుకు బడా కార్పొరేట్లకు కొత్త మార్గాలను చూపుతోందని అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా అంతరాలు పెరుగుతున్నాయని, దేశం మొత్తం సంపదలో 40 శాతం జనాభాలో ఒక్కశాతంగా ఉన్న ధనికుల వద్ద కేంద్రీకృతం అవుతోందని చెప్పారు. యువతలో నిరుద్యోగం భారీగా పెరుగుతోందని, దీనిని అవకాశంగా తీసుకుని కార్మికులను పెద్దయెత్తున దోపిడీ చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ సంక్షోభం కారణంగా రైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితులు కూడా దారుణంగా దిగజారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో కార్మికులు, రైతులు పెద్దయెత్తున పోరాటాలు చేపట్టే అవకాశం ఉందని, వాటికి రాజకీయ నిర్దేశత్వం చేయాల్సి ఉందని అన్నారు. కార్మిక హక్కుల్ని హరించే నాలుగు కోడ్‌లను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమౌతోందని, దీనికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20న ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయని, దీనిని విజయవంతం చేయడానికి వామపక్ష పార్టీలు, వర్గ, ప్రజా సంఘాలు కృషి చేయాల్సి ఉందన్నారు. లోక్‌సభలో బిజెపికి మెజార్టీ రాకపోయినప్పటికీ, ఉభయ సభల్లోనూ ఎన్‌డిఎ కూటమికి రెండింట మూడొంతుల మెజార్టీ లేకపోయినప్పటికీ నిరంకుశపోకడలను కొనసాగిస్తున్నాయని చెప్పారు. లోక్‌సభతోపాటు అసెంబ్లీలకు కూడా ఒకేసారి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన ప్రజాస్వామ్యంపై నేరుగా దాడిచేయడమేనని అన్నారు. న్యాయవ్యవస్థను బలహీనపరచడంతో పాటు, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కూడా మోడీ ప్రభుత్వం హరించి వేస్తోందని అన్నారు. రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా ఫెడరల్ స్ఫూర్తిపై దాడి చేస్తోందని విమర్శించారు.

రాజకీయ వ్యూహాత్మక పంథాపై

'డోనాల్డ్ ట్రంప్‌నకు స్నేహితునిగా ఎవరు చెప్పుకున్నారు? .. గౌతం అదాని, ముఖేష్ అంబానీలకు సన్నిహిత స్నేహితుడు ఎవరు? ఆర్ఎస్ఎస్‌కు సంపూర్ణ విధేయత చూపేది ఎవరు?' అన్న ఈ మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం వస్తుందని, అదే మోడీ అని చెప్పారు. పేద దేశాల పట్ల ట్రంప్ క్రూరంగా అమలు చేస్తున్న చర్యలకు మోడీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతు ఇస్తూ విధేయతను చాటుకుంటున్నారని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదంతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే హిందుత్వ, కార్పొరేట్ ప్రభుత్వంగా మోడీ సర్కారు ఉందని, దీనిని ఓడించి తీరాలని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ఒంటరిపాటు చేయడం ద్వారా మితవాద ధోరణులను తిప్పికొట్టాలన్నారు. అయితే, హిందుత్వ శక్తులు కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారానే దేశంలో అధికారంలోకి రాలేదని, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విషబీజాలు చల్లడం ద్వారా వారు అధికారంలోకి వచ్చారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలను సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

మోడీ - ట్రంప్ సంబంధాలపై...

అధ్యక్షులుగా ట్రంప్ ఎన్నికైన తరువాత అమెరికా సామ్రాజ్యవాదంలో కొత్త శకం ప్రారంభమైందని ప్రకాశ్ కరత్ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సామ్రాజ్యవాద దోపిడీ సాగుతోందని, ఈ క్రమంలో మిత్ర దేశాలను కూడా ట్రంప్ వదలడం లేదని చెప్పారు. పాలస్తీనియన్ల నుండి గాజాను స్వాధీనం చేసుకునేందుకు నెతన్యాహు ప్రణాళికలకు ట్రంప్ ఆమోదముద్ర వేశారని అన్నారు. ట్రంప్ విధానాల ప్రభావం దేశంపై తీవ్రంగా పడుతున్నాయని, సుంకాలను తగ్గించడం ద్వారా మోడీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని చెప్పారు. దేశ ప్రయోజనాలకు భిన్నమైన ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు, సిపిఎం అగ్రభాగాన నిలిచి పోరాడుతుందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి, ట్రంప్ అనుసరిస్తున్న నూతన ఆర్థిక, వాణిజ్య యుద్ధాలకు, రాజకీయ, మిలటరీ జోక్యాలకు, మోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. ఇజ్రాయిల్ దాడులను 17 నెలలుగా ప్రతిఘటిస్తున్న పాలస్తీనా ప్రజలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఇజ్రాయిల్‌ను గుడ్డిగా సమర్థిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. అమెరికా సామ్రాజ్యవాదపు ఆర్థిక దిగ్బంధాన్ని ఎదుర్కొని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న క్యూబా ప్రజలకు, ప్రభుత్వానికి ఆయన సంఘీభావం తెలిపారు.

స్వతంత్ర బలంపై దృష్టి

పార్టీ మహాసభలో సిపిఎం స్వతంత్ర బలం పెంచుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ లక్ష్యంగా చేసుకుని దేశ వ్యాప్తంగా స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించే అంశాన్ని చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలను ప్రతిఘటించడంలోనూ, ప్రజానుకూల విధానాలను అమలు చేయడంలోనూ కేరళ వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వం ముందు పీఠిన ఉందని అన్నారు. తమిళనాడులో జరిగిన ప్రజా పోరాటాలను, ఇక్కడి అమరుల త్యాగాలను కరత్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. వారి బాటలో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

తల్లీకూతుళ్లపై ఉన్మాది దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ, కార్యదర్శి వై.సత్యవతి డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : పోలీసులకు ముఖ్యమంత్రి ఆదేశం

ఉన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్య అందించాలని అధికారులను ఆదేశించారు.

హోంమంత్రి ఆరా

ఈ ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరాల తీశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.

విశాఖ ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

విశాఖలో ఉన్మాది ఘాతకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై దాడులు పెరిగాయని విమర్శించారు. నక్కా దీపిక కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఉన్మాది నవీన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ఆత్మహత్యాయత్నం చేసిన ఫార్మసీ విద్యార్థిని నల్లపు నాగ అంజలి తల్లిదండ్రులు అనంతలక్ష్మి, దుర్గారావులు జగన్‌ను కలిశారు. జగన్ స్పందిస్తూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

టిటిడిలో వంద శాతం ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ఆడిట్ జరిపితే మంచిదని సిఎం పేర్కొన్నారు.

అలిపిరిలో బేస్ క్యాంప్

అలిపిరిలో 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణం జరుగుతున్న బేస్ క్యాంప్ పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలని అధికారులకు సిఎం చంద్రబాబు సూచించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాన్నారు. బర్డ్ ఆస్పత్రికి డైరెక్టర్ నియామకం, జెఇఒ, సివిఎస్‌ఒ, ఎస్‌విబిసి ఛానెల్‌కు ఛైర్మన్ నియామకాలను త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. టిటిడిలో 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు.. సిఎం దృష్టికి తీసుకురాగా, వాట్సాప్ సేవలు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతిసేవకు ఆధార్, ఫోన్ నెంబరును లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని సిఎం తెలిపారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగంచేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. టిటిడి పరిధి మొత్తం 2,677 హెక్టార్లలో విస్తరించి ఉండగా, ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉందని, దీనిని 80 శాతానికి తీసుకెళ్లాలన్నారు. టిటిడి అనుబంధ ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలపై సిఎం సమీక్షించారు. ఈ సమీక్షలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావు, అడిషనల్ ఇఒ వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.



మీకోసం

చేపముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్ ఫ్రిజ్‌లో ఉంచితే ఒకదానికొకటి అంటుకోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం.. ప్రతి వ్యక్తికి అవసరం.

చిట్టి ఉడుత - రామ చిలుక



రాజు గారి తోటలోన
తియ్యనైన జామచెట్టు
నలు వైపులా కొమ్మలు
కొమ్మ కొమ్మనా కాయలు.

రామచిలుక, గోరింక
పాలపిట్ట, పావురాయి
ఎగురుకుంటూ వచ్చాయి
ప్రతి కొమ్మన వాలాయి.

దోరకాయ లెంచి తిని
ఊసులెన్నో చెప్పకుని
ఆనందము పంచుకుని
అనుబంధం పెంచుకుని

మరల రేపొద్దామని
అంతవరకు సెలవని
కిలకిల రావాలతో
కలిసి ఎగిరి పోయాయి

అదే జామచెట్టు కింద
చిట్టి ఉడుత ఒకటుండె
రాలిన కాయలు తింటూ
అదే చాలు అంటుండే.

"ఎక్కడెక్కడో పక్షులు
ఎగిరొచ్చి తింటున్నవి
చెట్టు చెంత నున్ననీవు
రాలుకాయ తింటున్నవు

బద్ధకమా నీకు మరి
చెట్టు నెక్కలేవా మరి
మంచికాయ నెంచుకుని
తినుటకు యోచించవేమి"

అంటూ హిత బోధ చేసే
కొమ్మనున్న నల్ల కాకి
కాకి మాటలను వింది
గల గల మని నవ్వింది.

చెట్టు నెక్క లేక కాదు
బద్ధకమన్నది లేదు
దోరకాయ నెంచలేను
అందుకనే ఇట్లుందును

"ప్రయత్నం చేయకుండ
ఫలితము ఎట్లుండును?
భయపడుతూ కూర్చుంటే
బతుకంతా భారమగును."

ఆ మాటలు విన్న చిట్టి ఉడుత
గబా గబా చెట్టెక్కెను
దొరికిన కాయను కొరికి
అబ్బబ్బ పచ్చిదనెను.

నిగ నిగ లాడే కాయ
కొమ్మచాటు దాగుండును
కమ్మనైన వాసనతో
కనువిందు చేయును

అటువంటి కాయనెంచు
కడుపు నిండుగా తిను
అంటూ వివరించెను
అటువచ్చిన చిలుకమ్మ .

చిలుకమ్మ మాటలకు
పొంగి పోయె చిట్టి ఉడత
ఎంత మంచి మనసు నీది
స్నేహమంటే ఇదే మరి

నీ మాటలు నేవింటా
కలిసి మెలిసి నేవుంటా
ఫలాల్లో పక్వాలెంచుతా
మంచి నేర్పరి ఉడత అనిపిస్తా.

అనుకుంటూ దోరకాయ
వెంటనే కనిపెట్టెను
చిలకమ్మకు భాగమిచ్చి
గూటికి తిరిగొచ్చెను.

- కూచిమంచి నాగేంద్ర
91821 27880

నేను గీసిన బొమ్మ





కె.ప్రణవ్,
5వ తరగతి,
అరవింద హైస్కూల్ సిబిఎస్ఇ,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తోలుబొమ్మలాటకు తోడుగా ...

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ కాలనీకి చెందిన తోట బాలకృష్ణకు తోలుబొమ్మలాట కళ అంటే ఎంతో ప్రాణం. ఈ కళకు పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నారు. ఈ వృత్తి కళలో నిష్ణాతులైన కుటుంబంలో ఆయన ఏడోతరానికి చెందిన వ్యక్తి. తాత బిక్షమయ్య, పెద్ద హనుమంతు, చిన్న హనుమంతు, పెద్ద నారాయణ స్వామి, రామూర్తి కుటుంబాలు వారసత్వంగా ఈ కళను కొనసాగిస్తున్నారు.

రామ్మూర్తి గారి ఐదుగురి కుమారుల్లో రెండో కుమారుడు వెంకట్రావు. వారసత్వంగా ఆయా కుటుంబాలు ఇదే వృత్తితో ఉండటంతో చిన్నప్పటి నుంచే బాలకృష్ణకు ఈ కళ బాగా అబ్బింది. ఐదో తరగతి చదివే సమయానికే రంగనాథ రామాయణం, మొల్ల రామాయణం, భాస్కర రామాయణం వంటివి కథలు నేర్చుకున్నారు. యక్షగానాలైన కూచికొండ రామాయణం, ధర్మపురి రామాయణం కూడా ఔపోసన పట్టించారు. ఆయన కుటుంబంలో సూరన్న, నాగభూషణం, కొండమ్మ (పెద్దమ్మ), రంగమ్మ (అమ్మ) పెద్ద కళాకారులుగా అప్పటికే గుర్తింపు పొందారు. చదువులో చురుగ్గా ఉంటున్న బాలకృష్ణను వారు మరింతగా ప్రోత్సహించారు. అప్పట్లో ఈ కళకు విపరీతమైన ఆదరణ ఉండటంతో అప్పటి ప్రముఖ కవి, జానపద సంగీత కళాప్రపూర్ణగా ఉన్న విజయవాడ రేడియో స్టేషన్ డైరెక్టర్ కె.వి.హనుమంతరావు 60 ఎపిసోడ్లుగా ధారావాహికగా ప్రసారం చేయటానికి అవకాశం కల్పించగా 16 కళా బృందాల్లోని 160 మంది పాల్గొన్నారు. ఇది జయప్రదం కావటంతో బాలకృష్ణ కూడా ఈ కళలో బిజీగా మారారు. చదువును ఏడో తరగతితోనే ఆపేయాల్సి వచ్చింది.

ఆధునీకరణతో ఆదరణ

మాధవపట్నంలో ఇప్పుడు మూడు, నాలుగు బృందాలు మాత్రమే ఉన్నాయి. ఒక్కో బృందం ఏకధాటిగా 25 రోజులపాటు వరుసగా ప్రదర్శనలు ఇచ్చే సత్తా ఉన్న కళాకారులు ఉన్నారు. ఇప్పుడు సినిమాలకే ఆదరణ కరువైన తరుణంలో తోలుబొమ్మలాట ప్రశ్నార్థకంగా మారింది. అప్పట్లో రాత్రి 8 గంటల సమయంలో ఆట మొదలు పెడితే సూర్యోదయం అయ్యేవరకూ కథాగానం సాగేది. ఇప్పుడు ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా ఈ కళకు పదును పెట్టి తాజా పర్చితే అరగంట నుంచి గంట రెండు గంటలకు మించి ప్రేక్షకులు ఆదరించే పరిస్థితులు లేవు. అందుకే ఈ కళాకారులు కూడా సమాజ పరిస్థితులకు అనుగుణంగా తమ కళను ఆధునీకరించి సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ సమయంలో ఎక్కువ సందేశం, కళాత్మక అందాలు వచ్చేలా చూస్తున్నారు.



సాంకేతిక పరిజ్ఞానంతోపాటుగానే సామాజిక, సాంస్కృతిక రంగాల్లో నిరంతరం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. టివి, ఇంటర్నెట్, ఓటీటీల యుగంలో ప్రజలకు ఒకప్పుడు వినోదాన్ని పంచిన సినిమాలకు సైతం ఆదరణ కరువై థియేటర్లు సైతం మూతపడుతున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో మాల్స్, మల్టీ ప్లెక్స్‌లు వెలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పూర్వం ప్రజాదరణ పొందిన తోలుబొమ్మలాటకు పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు తోట బాలకృష్ణ. తోలుబొమ్మలాటను తిరిగి ప్రజలకు చేరువ చేసేందుకు చేస్తున్న కృషి బాలకృష్ణకు గుర్తింపును తీసుకొచ్చింది. ఇటీవలే ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు.

కళారూపానికి పునరుజ్జీవానికి కృషి

ప్రస్తుతం ప్రధాన కథకుడుగా తోట బాలకృష్ణ, సహాయ కథకుడిగా అనపర్తి పాపారావుతో పాటుగా బృంద సభ్యులుగా తోట నాగమణి, హార్మోనియం కళాకారులుగా తోట గణపతిరావు, తోట సత్యం, డోలకిస్టులుగా తోట అంజిబాబు, తోట పోతురాజు, స్త్రీ పాత్రల్లో నాగమణి, ఓడినేని నూకరత్నం, యువకళాకారులు మణికుమార్ (కుమారుడు), దుర్గాశాంతి (కుమార్తె) పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడ, నూజివీడు, కాకినాడ తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ ప్రదర్శనలకు ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చారు.

అప్పట్లో అద్భుత కళగా ...

కాకినాడ గోరస రాజారావు, పిఠాపురం రాజా వారు, ఆ తర్వాత జమీందారుల కాలంలో తోలుబొమ్మలాట కళకు బాగా ఆదరణ ఉండేది. ఆయా ఆస్థానాల్లో ప్రదర్శనలు ఇస్తూ జీవనోపాధి పొందేవారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఈ కళ ప్రజలను చైతన్యం చేయటానికి ఎంతగానో ఉపయోగపడింది. కథ ప్రారంభమైన తర్వాత బ్రిటీషు వారు పరిసర ప్రాంతాల్లో లేరని ధృవీకరించుకున్న తర్వాత కేతిగాడు, జుట్టుపోలిగాడు, బంగారక్క పాత్రల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి కృషిచేసేవారు. ఆ తర్వాత ఈ విషయాలను తెలుసుకుని కళాకారులపై బ్రిటీషువారు నిర్బంధం ప్రయోగించేవారు. అయినా వెనుదీయకుండా స్వాతంత్ర్య కాంక్షను తమ కళలో, కథలో భాగం చేసి, ప్రజలకు వినిపించేవారు.

పూర్వం ఏటేటా జరిగే కోటప్పకొండ తిరునాళ్లకు నెలరోజులపాటు కళా ప్రదర్శనలు చేసేవారు. అవి పూర్తయ్యాక బంధురికాలు కలుపుకోవటం, పెళ్ళిళ్లు వంటివి కుదుర్చుకోవటం వంటివి గుంటూరు కేంద్రంగా జరిగేవి.

జమునానగర్ కాలనీగా గుర్తింపు

ఎపి రంగ స్థల కళాకారుల సమాఖ్యకు అధ్యక్షురాలిగా, పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్న సమయంలో మాధవపట్నంలో 176 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపునకు సినీనటి జమున కృషిచేశారు. తోలుబొమ్మలాట సంఘం కార్యదర్శిగా అనపర్తి త్రినాథరావు, సంఘం స్థానిక అధ్యక్షులుగా తోట రంగారావు కూడా భాగస్వాములై 'జమునానగర్ కాలనీ'గా పేరు పెట్టారు. జమునా కళామందిర్ కూడా నిర్మించగా అక్కడ తోలుబొమ్మలాటపై భావితరాలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రాలో 60 వేల మంది, తెలంగాణాలో 55 వేల మంది తోలుబొమ్మల కళాకారులు ఉన్నారని అంచనా.స

డాక్టరేట్‌తో ప్రత్యేక గుర్తింపు

కేంద్ర సంగీత, నాటక అకాడమీ సౌజన్యంతో తోట బాలకృష్ణ పిల్లలకు ఏడాది కాలంలో మూడు కథలు నేర్పించారు. ఎపి భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఎనిమిదేళ్ల క్రితం యువ కళాకారులకు కళపైనా, చేతివృత్తిదారుల పరిశ్రమాభివృద్ధి సంస్థ ద్వారా తోలుబొమ్మల తయారీలో బాలకృష్ణ శిక్షణ ఇచ్చారు. ఆ సేవలను గుర్తించిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. మార్చి 23న పాండిచ్చేరిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ డాక్టరేట్‌ను స్వీకరించారు.

- యడవల్లి శ్రీనివాసరావు

కళాకారులను ప్రోత్సహించాలి

అంతరించిపోతున్న తోలుబొమ్మలాట కళను ప్రోత్సహించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలి. వివాహాలు, పుట్టినరోజు వేడుకలు, దేవాలయాల్లో ఉత్సవాలు, వేడుకల్లో వంటి కార్యక్రమాల్లో కళాకారులను పిలిపించి ప్రోత్సహించాలి. ఇదే వృత్తిలో పనిచేస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి.

- తోట బాలకృష్ణ,
తోలుబొమ్మ కళాకారుడు, కాకినాడ.



వరుసగా పాటలు వస్తున్నాయి



జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం నుండి ఏప్రిల్ 10న మూడో సాంగ్, 4వ పాటను ఏప్రిల్ 15న రిలీజ్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ రెండు పాటల్లో ఒకటి మాస్ డ్యాన్స్ కూడిన సాంగ్ కాగా, మరొకటి మెలోడీగా సాగే సాంగ్ అని సమాచారం.

రజనీ రియల్ హీరో : ముకేష్‌ఖన్నా



'నేను ఇప్పటివరకూ రజనీకాంత్‌ను వ్యక్తిగతంగా కలవలేదు. కానీ ఆయన వ్యక్తిత్వం నాకు చాలా ఇష్టం. పెద్ద స్టార్ అయినప్పటికీ చాలా సింపుల్‌గా ఉంటారు. బయటకు వెళ్లినప్పుడు కూడా మేకప్ వేసుకోరు. కనీసం విగ్గు కూడా ధరించడు. ఫ్యాన్స్‌తో ఓ సామాన్య వ్యక్తిలాగే ప్రవర్తిస్తాడు. బాలీవుడ్ హీరోల్లో ఎవరూ రజనీకాంత్‌లా ఉండలేరు. మేకప్ లేకుండా వాళ్లు బయట తిరగలేరు. వాళ్లతో పోలిస్తే రజనీకాంత్ చాలా గొప్ప వ్యక్తి. రియల్ హీరో. నా గురించి చెప్పాల్సివస్తే డైలాగ్‌లు లేని కారణంగా చాలా పెద్ద సినిమాలు వదులుకున్నాను. విలన్‌గా చేయటం ఇష్టం లేక సినిమాలను దూరంగా పెట్టాను. 'మహాభారతం' సీరియల్‌లో మొదట ధుర్యోధనుడి పాత్ర ఇస్తే నో చెప్పా. ఆ తర్వాత భీష్ముడి పాత్ర వచ్చింది' అని బాలీవుడ్ నటుడు ముకేష్‌ఖన్నా అన్నారు. తాజాగా బాలీవుడ్ నటులపై ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

'గ్యాంగర్స్' ట్రైలర్ విడుదల



దర్శక నిర్మాత, నటుడు సుందర్ సి. ప్రస్తుతం 'గ్యాంగర్స్' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో సుందర్‌తో పాటు వడివేలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం ఏప్రిల్ 24న రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా మూవీ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో పీటీ మాస్టర్‌గా సుందర్ సి నటిస్తుంటే, అదే పాఠశాలలో అతనికి సీనియర్‌గా వడివేలు నటించారు. కేథరిన్ థెస్రా, భగవతి పెరుమాళ్, మైమ్ గోపీ, హరీశ్ పేరడి ఇతర కీలక పాత్రలను చేశారు. ఎ.సి.ఎస్. అరుణ్ కుమార్ సమర్పణలో కుష్బు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

ఎల్‌వైఎఫ్ ట్రైలర్ చాలా బాగుంది : కిషన్‌రెడ్డి


'ఎ 'ఎల్‌వైఎఫ్ (లవ్ యువర్ ఫాదర్) సినిమా ట్రైలర్ చాలా బాగుంది. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమా మంచి సందేశాన్ని ఇస్తుంది. వారణాసిలోని విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలి' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. శ్రీహర్ష కషికా కపూర్ జంటగా నటించిన చిత్రం 'ఎల్‌వైఎఫ్'. సింగర్ ఎస్పీ చరణ్ ప్రధాన పాత్ర పోషించారు. పవన్ కేతురాజు దర్శకత్వం వహించారు. కిశోర్ రాఠీ, మహేష్ రాఠీ, ఎ.రామ స్వామి రెడ్డి, ఎ.చేతన్ సాయి రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈనెల నాల్గోతేదీన విడుదల కానుంది. ట్రైలర్‌ను వీక్షించి, తొలి టిక్కెట్‌ను కొనుగోలు చేసిన అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. సంగీతం మణిశర్మ.





1న 'హిట్ : ది థర్డ్ కేస్' విడుదల

నాని కథానాయకుడిగా నటించిన చిత్రం 'హిట్ : ది థర్డ్ కేస్' మే 1న విడుదల కానుంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీనిధిశెట్టి కథానాయిక. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్‌పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ సినిమా విడుదలకు 30 రోజులు మాత్రమే ఉండటంతో చిత్ర యూనిట్ ప్రచార పోస్టర్‌ను విడుదల చేసింది. నాని ఫెరోషియస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకుంటున్నాయి. కెమెరా సాను జాన్ వర్గీస్, సంగీతం మిక్కీ జేమేయర్.



బ్యాట్‌మ్యాన్ ఇక లేరు

'టాప్ గన్', 'బ్యాట్‌మ్యాన్ ఫరెవర్' లాంటి సూపర్ హిట్ చిత్రాలతో సినీ ప్రపంచాన్ని అలరించిన హాలీవుడ్ హీరో వాల్ కిల్మర్ (65) కన్నుమూశారు. కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఏప్రిల్ 1న లాస్ ఏంజెల్స్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. 1980, 90 దశకాల్లో తన నటనతో కిల్మర్ అందర్నీ ఆకట్టుకున్నారు. 1986లో రిలీజైన 'టాప్ గన్' చిత్రం వాల్ కిల్మర్‌కి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆయన నటించిన చివరి చిత్రం 'టాప్ గన్ మావరిక్' 2022లో రిలీజై మంచి విజయం సాధించింది. ప్రిన్స్ ఆఫ్ ఈజిప్ట్ లాంటి యానిమేషన్ చిత్రాలకు కిల్మర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. కిల్మర్ అతని పూర్తి పేరు వాల్ ఎడ్వర్డ్ కిల్మర్. లాస్ ఏంజెల్స్‌లో డిసెంబర్ 31, 1959లో జన్మించాడు. 1988లో తోటి నటి జోవాన్ వాలీతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి కూతురు మెర్సిడీస్, కుమారుడు జాక్ ఉన్నారు. 1996లో ఈ జంట విడాకులు తీసుకున్నారు.

బాదేసిన బట్లర్

బెంగళూరుపై గుజరాత్ ఘన విజయం



బెంగళూరు: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18లో గుజరాత్ టైటాన్స్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. కేవలం 39బంతుల్లో 5ఫోర్లు, 6సిక్సర్లతో అజేయంగా 73పరుగులు చేసి గుజరాత్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ జట్టు కేవలం 17.5ఓవర్లలో 2వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(49) తృటిలో అర్ధసెంచరీని మిస్ చేసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్(14) నిరాశపరిచాడు. వీరిద్దరు ఔటయ్యాక బట్లర్-రూథర్‌ఫోర్డ్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. రూథర్‌ఫోర్డ్ 18బంతుల్లో ఒక ఫోర్, 3సిక్సర్ల సాయంతో అజేయంగా 30 పరుగులు చేసి బట్లర్‌కు సాయపడ్డాడు. దీంతో ఈ సీజన్‌లో గుజరాత్ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. రెండో ఓవర్లోనే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(7) డీప్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత మహ్మద్ సిరాజ్ వెంట వెంటనే దేవదత్ పడిక్కల్(4), సాల్ట్(14) వికెట్లు పడగొట్టాడు. రెండు ఫోర్లు కొట్టి జోరు మీద ఉన్న కెప్టెన్ రజిత్ పటీదార్ (12)ను ఇషాంత్ శర్మ వికెట్ల ముందు దొరకబుచ్చు కున్నాడు. దీంతో 42 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ కష్టాల్లో పడింది. ఆ దశలో లివింగ్ స్టన్(54), జితేష్ శర్మ(33) వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఈ జోడీని సాయికిషోర్ విడదీశాడు. జితేష్ భారీ షాట్‌కు ప్రయత్నించి సాయి కిషోర్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ వెంటనే కనాల్ పాండ్యా కూడా సాయి కిషోర్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. చివర్లో టిమ్ డేవిడ్ (32) కీలక పరుగులు చేశాడు. దీంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 150 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ మూడు వికెట్లు పడగొట్టాడు. సాయి కిషోర్ రెండు వికెట్లు తీశాడు. అర్షద్, ఇషాంత్, ప్రసిద్ధ ఒక్కో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్‌కు దక్కింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
పంజాబ్	2	2	0	4	+1.48
ఢిల్లీ	2	2	0	4	+1.32
బెంగళూరు	3	2	1	4	+1.14
గుజరాత్	3	2	1	4	+0.80
ముంబయి	3	1	2	2	+0.30
లక్నో	3	1	2	2	+0.15
చెన్నై	3	1	2	2	-0.77
సన్‌రైజర్స్	3	1	2	2	-0.87
రాజస్తాన్	3	1	2	2	-1.11
కోల్‌కతా	3	1	2	2	-1.42

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (బి)సిరాజ్ 14, కోహ్లి (సి)ప్రసిధ్ (బి)ఆర్షాద్ ఖాన్ 7, పడిక్కల్ (బి)సిరాజ్ 4, రజత్ పటీధర్ (ఎల్‌బి)ఇషాంత్ 12, లివింగ్‌స్టోన్ (సి)బట్లర్ (బి)సిరాజ్ 54, జితేశ్ శర్మ (సి)తెవాటియా (బి)సాయి కిశోర్ 33, కృనాల్ పాండ్యా (సి అండ్ బి)సాయి కిశోర్ 5, టిమ్ డేవిడ్ (బి)ప్రసిద్ 32, భువనేశ్వర్ కుమార్ (నాటౌట్) 1, అదనం 7. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 169పరుగులు. **వికెట్ల పతనం:** 1/8, 2/13, 3/42, 4/42, 5/94, 6/104, 7/150, 8/169 **బౌలింగ్:** సిరాజ్ 4-0-19-3, ఆర్షద్ 2-0-17-1, ప్రసిధ్ 4-0-26-1, ఇషాంత్ 2-0-27-1, సాయి కిశోర్ 4-0-22-2, రషీద్ 4-0-54-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)జితేశ్ శర్మ (బి)హేజిల్‌వుడ్ 49, శుభ్‌మన్ గిల్ (సి)లివింగ్‌స్టోన్ (బి)భువనేశ్వర్ కుమార్ 14, బట్లర్ (నాటౌట్) 73, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 30, అదనం 4, (17.5ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 170పరుగులు. **వికెట్ల పతనం:** 1/32, 2/107 **బౌలింగ్:** భువనేశ్వర 4-0-23-1, హేజిల్‌వుడ్ 3.5-0-43-1, యశ్ దయాల్ 3-0-20-0, రసిక్ ధర్ 3-0-35-0, కృనాల్ 3-0-34-0, లివింగ్‌స్టోన్ 1-0-12-0.

ఐపిఎల్‌లో నేడు

కోల్‌కతా × సన్‌రైజర్స్ హైదరాబాద్
వేదిక: కోల్‌కతా; రాత్రి 7.30గం॥లకు

హార్దిక్ @ 1

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజాగా ప్రకటించిన టి20 ఆల్‌రౌండర్ల జాబితాలో భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్య సత్తా చాటాడు. బుధవారం ప్రకటించిన ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 31ఏళ్ల హార్దిక్(252 రేటింగ్ పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో టాప్-10లో మరే ఇతర టీమిండియా ఆటగాడు లేకపోవడం గమనార్హం. 12వ స్థానంలో అక్షర్ పటేల్(161) నిలిచాడు. బ్యాటింగ్ విభాగంలో టాప్ -10లోనే భారత్ నుంచి ముగ్గురు బ్యాటర్లకు అవకాశం దక్కింది. రెండో స్థానంలో అభిషేక్ శర్మ(829), నాలుగో స్థానంలో తిలక్ వర్మ(804), ఐదో ర్యాంకులో సూర్య కుమార్ యాదవ్(739) కొనసాగుతున్నారు. ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ 856పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇక టి20 బౌలర్ల జాబితాలో జాకబ్ డఫీ(న్యూజిలాండ్) 723పాయింట్లు అగ్రస్థానంలో నిలువగా.. అకీల్ హుసేన్(వెస్టిండీస్) 707పాయింట్లు, భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 706 పాయింట్లు టాప్-3లో ఉన్నారు.

వన్డే బెస్ట్ బ్యాటర్‌గా శుభ్‌మన్

వన్డేల్లో శుభ్‌మన్(784) అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. పాక్ ఆటగాడు బాబర్ అజామ్ (777) ఆ తర్వాత స్థానంలో ఉన్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ (756) మూడు, విరాట్ కోహ్లి (736) ఐదు, శ్రేయస్ అయ్యర్ (704) ఎనిమిదో స్థానంలో నిలిచారు. వన్డే బౌలర్ల జాబితాలో టాప్-10 కుల్‌దీప్ యాదవ్ (650) ఒక్క స్థానం మెరుగుపర్చుకుని మూడో ర్యాంకుకు ఎగబాకాడు. జడేజా (616) ఒక ర్యాంకు పైకి చేరి 9వ స్థానంలో ఉన్నాడు.

ముంబయికి జైశ్వాల్ టాటా..

- దేశవాళీ సీజన్‌లో గోవాకు ఆడనున్నట్లు ప్రకటన



ముంబయి: టీమిండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లలో గోవా తరఫున ఆడనున్నట్లు బుధవారం ప్రకటించాడు. గత కొంతకాలంగా ముంబయి తరఫున ఆడుతున్న అతడు.. ఉన్నట్టుండి ఆ జట్టుకు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ (ఎంసిఎ)కు లేఖ రాశాడు. గోవాకు మారేందుకు తనకు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలని కోరాడు. అతడి అభ్యర్థనను ఎంసిఎ యాజమాన్యం అంగీకరించినట్లు సమాచారం. "ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక ఏదైనా కారణం ఉండొచ్చు. అతడి రిక్వెస్ట్‌ను అంగీకరించి జట్టు నుంచి రిలీవ్ చేశాం" అని ముంబయి క్రికెట్ అసోసియేషన్ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను జట్టు మారుతున్నట్లు జైస్వాల్ తన లేఖలో పేర్కొన్నాడు. దీంతో 2025-26 సీజన్ నుంచి జైస్వాల్ గోవా తరఫున దేశవాళీ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ మధ్యకాలంలో దేశవాళీలో ముంబయి వీడిన మూడో ఆటగాడు జైస్వాల్. అంతకుముందు 2022-23 సీజన్‌లో సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్, మరో క్రికెటర్ సిద్ధేశ్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవాకు మారారు. ఇక, తాజా పరిణామాలపై గోవా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శాంబ దేశాయ్ స్పందించారు. జైస్వాల్‌ను తమ జట్టులోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని సమయంలో గోవాకు అతడు కెప్టెన్‌గానూ వ్యవహరించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు.



సిపిఎం 24వ అఖిల భారత మహాసభ



ఐక్య ప్రతిఘటన అవశ్యం

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా


సీతారాంఏచూరి నగర్ (మదురై)నుండి ప్రజాశక్తి ప్రతినిధి



అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యతతో ప్రతిఘటించాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. మదురైలో ప్రారంభమైన సిపిఎం అఖిలభారత 24వ మహాసభ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన సౌహార్ద్ర సందేశంలో సాంప్రదాయకంగా చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కన్నుసన్నల్లో మతతత్వ విధానాలను అమలు చేస్తోందని చెప్పారు.

అదే సమయంలో కార్పొరేట్లకు దేశ ప్రజల సంపదను దోచిపెడుతోందన్నారు. ఫలితంగా ఒక్కశాతం ప్రజల వద్ద కనీవిని ఎరగని విధంగా సంపద పోగుపడుతోందని, సామాన్యులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలను బలంగా ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని అన్నారు. 'జై భీమ్, లాల్ సలామ్, ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నవి ఇక ఏమాత్రం నినాదాలు కావని, అవి జాతి జీవనవిధానం కావాల్సి ఉందని చెప్పారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తున్న మోడీ పాలనపై సంఘటిత పోరాటానికి ఇదే కీలక సమయమని, రాబోయే రోజుల్లో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని చెప్పారు.

లౌకికత్వ పరిరక్షణ కీలకం



దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో లౌకికత్వ పరిరక్షణ అత్యంత కీలకమైన అంశమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. సౌహార్ధ సందేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలను, దళితులను లక్ష్యంగా చేసుకుని హిందూత్వ శక్తులు చెలరేగుతున్నాయని చెప్పారు. మావోయిస్టుల నిర్మూలన పేరుతో నరేంద్రమోడీ ప్రభుత్వం ఆదివాసీలను లక్ష్యంగా చేసుకుంటోందని, వందలాది మంది ప్రాణాలు తీస్తోందని చెప్పారు. మావోయిస్టులను వందశాతం నిర్మూలిస్తామని హెూంమంత్రి అమిత్‌షా ప్రకటించారని, ఇది మావోయిస్టుల ముసుగులో ఆదివాసీలపై దాడి చేయడమేనన్నారు.

వాస్తవానికి మోడీ ప్రభుత్వ లక్ష్యం అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమేనని చెప్పారు. ఈ అమానుష హింసాకాండకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

ఆదివాసీల పరిరక్షణకు ఉద్యమించాలి : మనోజ్ భట్టాచార్య



నయా ఫాసిస్టు, నయా ఉదారవాద విధానాలపై పోరాటాలు చేయడంతో పాటు ఆదివాసీల పరిరక్షణ కోసం కూడా పెద్దఎత్తున ఉద్యమించాల్సి ఉందని ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అన్నారు. గాడ్చిరోలి, బస్తర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చోటుచేసుకుంటున్న ఎన్‌కౌంటర్లను ఆయన ప్రస్తావించారు. మైనింగ్ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం అమాయక గిరిజనులపై హింసాకాండకు పాల్పడుతున్నారని చెప్పారు.

యువతను ఆకట్టుకోవాలి : జి. దేవరాజన్



యువతను అభ్యుదయ భావాల వైపు ఆకర్షించడంలో వామ పక్షాలు ఆశించిన ఫలితాలు సాధించడం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జనరల్ సెక్రటరీ జి. దేవరాజన్ అన్నారు.

ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలని, యువతను ఆకట్టుకుని ఉద్యమాలను ఉధృతం చేయాలని చెప్పారు. దీనికోసం సామాజిక మాధ్యమాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నిరుద్యోగం, అధికధరలు, మతోన్మాదం తదితర సమస్యలను ఆయన ప్రస్తావించారు.



సైద్ధాంతిక యోధుడు..

సెక్యులర్ పార్టీల మధ్య విశాల ఐక్యతకు తోడ్పడ్డారు
సీతారాం ఏచూరికి సిపిఐ (ఎం) అఖిల భారత మహాసభ ఘన నివాళి
కొడియేరి బాలకృష్ణన్, బుద్ధదేవ్ భట్టాచార్య, ఎన్.శంకరయ్య తదితరుల మరణం పట్ల సంతాపం

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సోవియట్ యూనియన్ పతనం తర్వాత మార్క్సిజాన్ని లోతుగా అధ్యయనం చేసిన సీతారాం ఏచూరి... సిపిఐ (ఎం)ను సైద్ధాంతికంగా, రాజకీయంగా బలోపేతం చేయటంలోను, ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సూత్రీకరణలు చేయటంలోనూ కీలక పాత్ర పోషించారని సిపిఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ స్మరించుకుంది. గతేడాది సెప్టెంబరు 12న కన్నుమూసిన పార్టీ ప్రధాన కార్యదర్శి ఏచూరి... విద్యార్థి నాయకుడి నుంచి మొదలుకుని అఖిల భారత ప్రధాన కార్యదర్శి వరకూ పార్టీకి, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంది. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొంటూ సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ బుధవారం ప్రారంభమైన మహాసభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులైన ఏచూరి... దేశంలోని కమ్యూనిస్టు అగ్రనేతల్లో ఒకరిగా నిలిచారని ఆమె కొనియాడారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఆయన తొలుత విద్యార్థి నాయకుడిగా తనదైన ముద్ర వేశారని తెలిపారు. జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అధ్యక్షుడిగా దేశంలో అభ్యుదయ విద్యార్థి రాజకీయాలకు బీజాలు వేశారని వివరించారు. 1975లో సిపిఐ (ఎం)లో చేరిన సీతారాం... 1985లో కేంద్ర కమిటీకి, 1989లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారని పేర్కొన్నారు. 1992 నుంచి ఆయన సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగారని తెలిపారు. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం, అక్కడి నాయకత్వంలో 30 ఏళ్లకు పైగా కొనసాగారని చెప్పారు.

హిందూత్వ భావజాలంపైనా, ఆరెస్సెస్‌పైనా సునిశిత విమర్శలు చేసిన ఆయన... వాటి దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టారని తెలిపారు. లౌకిక శక్తుల మధ్య విశాల ఐక్యతను తీసుకురావటంలోనూ, తద్వారా ఇండియా బ్లాక్ రూపకల్పనలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యుడిగా, పీపుల్స్ డెమోక్రసీ సంపాదకుడిగా ఎనలేని సేవలందించారని బృందా కరత్ నివాళు లర్పించారు. సీతారాం ఏచూరి మరణం దేశంలో కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని ఆమె పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల మహాసభ తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చింది.

ఏచూరితోపాటు సిపిఐ (ఎం) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు కొడియేరి బాలకృష్ణన్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సీనియర్ నేత ఎన్.శంకరయ్య తదితరుల మృతికి మహాసభ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది.

సంతాప సూచకంగా ప్రతినిధులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. వీరితోపాటు కేంద్ర కమిటీ సభ్యులు కెఎమ్ తివారీ, కేంద్ర కమిటీ మాజీ సభ్యులు బాసుదేవ్ ఆచార్య, ఎమ్ఎమ్ లారెన్స్, శివాజీ పట్నాయక్, కనయ్ బెనర్జీ, కుమార్ శిరాల్కర్, మదన్ ఘోష్, మృదుల్ దే, సునీత్ చోప్రా తదితరుల మరణం పట్ల మహాసభ సంతాపాన్ని ప్రకటించింది.

శాంతి, సుస్థిరతకు దోహదం చేయాలి

సౌహార్ద్ర సందేశంలో చైనా

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి


అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాల పురోగతికి, ప్రాంతీయ శాంతి, సుస్థిరతలకు సిపిఎం అఖిల భారత మహాసభ దోహదం చేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్షించింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగం సౌహార్ధ సందేశం పంపింది. ఈ సందేశంలో 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) 24వ మహాసభను నిర్వహించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము. ఈ మహాసభ పూర్తిగా జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాం' అని పేర్కొన్నారు. 'భారతదేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒక ముఖ్యమైన వామపక్ష శక్తిగా, దేశ ఆర్థిక, సామాజిక పురోగతికి సిపిఎం నిరంతరం కట్టుబడి ఉంది. ప్రాంతీయ శ్రేయస్సు, పురోగతిని ప్రోత్సహించేందుకు ఈ మహాసభ దోహదపడగలదని మేము నమ్ముతున్నాము' అని సందేశంలో పేర్కొన్నారు. 'మెరుగవుతున్న చైనా-భారత సంబంధాలు రెండు దేశాల ప్రజలకు, సాధారణ ప్రయోజనాలను అందిస్తాయని పేర్కొంది. ఈ కొత్త పరిస్థితుల నేపథ్యంలోభారతీయ రాజకీయ పార్టీలతో సంబంధాలను కొనసాగిస్తామని, పార్టీ, ప్రభుత్వ పాలన అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నాం' అని చైనా కమ్యూనిస్టు పార్టీ తెలిపింది.

ప్రజాపునాదిని బలోపేతం చేయాలి : వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా

24వ మహాసభ విజయవంతంగా నిర్వహించుకోవడం ద్వారా సిపిఎం ప్రజాపునాది బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా పేర్కొంది. ఈ మేరకు పంపిన సందేశంలో పార్టీ సభ్యులందరికీ హృదయపూర్వక, స్నేహపూర్వక శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్లు పేర్కొంది. ' మహాసభ పార్టీ సంస్థాగత పునాదిని, ప్రజా పునాదిని బలోపేతం చేయడంలో కొత్త మైలురాయిని నెలకొల్పే ముఖ్యమైన సందర్భం అవుతుందని విశ్వసిస్తున్నాము.' అని పేర్కొంది.. రెండు పార్టీల మధ్య దీర్ఘకాల స్నేహం, సహకారం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందన్న దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేసింది.

స్నేహ సంబంధాలు మరింత బలోపేతం : వియత్నాం కమ్యూనిస్టు పార్టీ

రెండు కమ్యూనిస్టు పార్టీలతో పాటు, దేశాల ప్రజల మధ్య కూడా స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్షించింది. ఈ మేరకు పంపిన సందేశంలో వామపక్ష ఉద్యమ సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి సిపిఎం చేసిన కృషిని ఆ పార్టీ ప్రశంసించింది. ప్రజల జీవనోపాధి, ప్రజాస్వామ్యం, శ్రామిక ప్రజలు, మైనారిటీ వర్గాల చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించడానికి చేసిన చట్టబద్ధమైన పోరాటాలను ప్రస్తావించింది. 24వ మహాసభలో చేస్తున్న తీర్మానాలు భారత రాజకీయాల్లో సిపిఎంస్థానం, ప్రభావాన్ని పెంచడానికి దోహద పడతాయని పేర్కొంది. శాంతియుత, ఐక్యమైన, ప్రజాస్వామ్య, సంపన్న భారతదేశాన్ని నిర్మించడానికి మహాసభ తీర్మానాలు సంపన్న భారతదేశాన్ని నిర్మించడానికి ఉపయోగపడగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



మార్క్స్ మహాశయుని మైనపు బొమ్మ

బిజెపి మునిగిపోతున్న నౌక

సిపిఐ (ఎం) మహాసభలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.బాలకృష్ణన్



మదురై నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

బిజెపి అనేది మునిగిపోతున్న నౌక అని సిపిఐ (ఎం) తమిళనాడు మాజీ కార్యదర్శి, పార్టీ 24వ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. బుధవారం ప్రారంభమైన మహాసభలో ఆయన స్వాగతోపన్యాసం చేస్తూ... బిజెపితో అన్నాడిఎంకె పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ కూడా మునిగిపోవటం ఖాయమని ఎద్దేవా చేశారు.

మదురై నగరం తిరుగుబాటుదారుల పుట్టినిల్లని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి నేటి కార్మిక పోరాటాల వరకు అదే ఒరవడి కొనసాగుతోందని తెలిపారు. సిపిఐ (ఎం) ఐదు మహాసభలకు తమిళనాడు ఆతిథ్యమిస్తే అందులో మూడింటికి మదురై నగరం వేదికగా నిలిచిందని వివరించారు.

ఇక్కడ తమ పార్టీ భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించిందని, దళితుల హక్కుల కోసం పోరాడిందని గుర్తు చేశారు. వాచ్చాత్తి అఘాయిత్యాలకు వ్యతిరేకంగా న్యాయపోరాటం సాగించి బాధ్యులందరికీ శిక్ష పడేలా చేసిందని తెలిపారు. 1925లో సింగారవేలర్ నేతృత్వంలో మొదటిసారి తమిళనాడులో మేడేను జరిపిన ఘనత కమ్యూనిస్టులదేనని చెప్పారు.



ప్రత్యేక ఆకర్షణగా సీతారాం ఏచూరి భారీ కటౌట్



మేలో జరగబోయే సమ్మెకు మద్దతుగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న డాక్టర్ కె హేమలత



మతోన్మాదం పై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న కేరళ ప్రతినిధి రాజీవ్

పలు కమిటీల ఏర్పాటు

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

సిపిఎం అఖిల భారత 24వ మహాసభ నిర్వహణలో భాగంగా తొలిరోజైన బుధవారం పలు కమిటీలు ఏర్పాటయ్యాయి. మహాసభకు హాజరైన ప్రతినిధులు ఈ కమిటీలను ఎన్నుకున్నారు. మహాసభ అధ్యక్షవర్గంగా మాణిక్‌సర్కార్ (కన్వీనర్), ఎంఎ గఫూర్, విక్రమ్‌సింగ్, పి.దినేషన్, బాలభారతి, మీనాక్షి ముఖర్జీ, వినోద్ నికోలే వ్యవహరిస్తారు. పొలిట్‌బ్యూరో స్టీరింగ్ కమిటీగా బాధ్యతలు నిర్వహిస్తుంది.

తీర్మానాల కమిటీ..

తీర్మానాల కమిటీకి కన్వీనర్‌గా అశోక్ ధావలే వ్యవహరిస్తారు. పి.రాజీవ్, మరియం థావలే, విజూ కృష్ణన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు.

అర్హతల కమిటీ...

అర్హతల కమిటీ కన్వీనర్‌గా మురళీధరన్ వ్యవహరిస్తారు. సిఎస్ సుజాత, సమీక్ లహరి, టి.జ్యోతి ఈ కమిటీకి సభ్యులుగా మహాసభ ఎన్నుకుంది.

మినిట్స్ కమిటీ...

మినిట్స్ కమిటీ కన్వీనర్‌గా కె.ఎన్ ఉమేష్ వ్యవహరిస్తారు. ప్రచి హతివ్లేకర్, పివి అనియాన్, మయూఖ్ బిశ్వాస్, ఎం. అనిల్‌కుమార్, ఆదర్శ్ సభ్యులుగా ఎన్నికయ్యారు.



మహాసభ ప్రాంగణ ముఖద్వారం



ప్రారంభ సెషన్‌ను కవర్ చేస్తున్న మీడియా



సిపిఎం 24వ అఖిల భారత మహాసభ






అరుణపతాక ఆవిష్కరణకు హాజరైన ప్రతినిధులు

టి.వి.రమణ

ప్రారంభ సెషన్‌లో అభివాదం చేస్తున్న వామపక్ష నేతలు

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ తమిళనాడులోని మదురైలో బుధవారం ఉత్తేజకరంగా ప్రారంభమైంది.



ప్రకాశ్ కరత్ | పినరయి విజయన్ | మాణిక్ సర్కార్ | ఎం.ఎ.బేబి | బివి.రాఘవులు | బృందాకరత్ | నీలోత్పల్ బసు | సుభాషిణి అలి | విజూ కృష్ణన్ | మరియం ధావలే

సెవ్వణక్కం.. వీర వణక్కం...

- నినాదాలతో హోరెత్తిన మదురై...
- ఒకవైపు సాంస్కృతిక సంరంభం.. మరోవైపు ఎర్రదండు కవాతు..
- ఆహ్లాదాన్ని నింపిన షేక్ మస్తాన్ బృందం నాదస్వరం
- అబ్బురపరిచిన పాప్పంపాడి పెరియ మేళమ్
- అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన బిమన్ బసు
- స్ఫూర్తిదాయక వాతావరణంలో మహాసభ ఆరంభం



షేక్ మస్తాన్ బృందం నాదస్వరం

మదురై నుంచి బి.వి.యన్.పద్మరాజు

'సెవ్వణక్కం.. వీర వణక్కం.. సెవ్వణక్కం.. వీర వణక్కం...(అరుణారుణ వందనం.. వీరులారా వందనం...) అంటూ అక్కడ రెడ్‌షర్టు వాలంటీర్లు పెద్దపెట్టున నినదిస్తూ కవాతు నిర్వహించారు. మరోవైపు తమిళనాడుకే ప్రత్యేకమైన, అక్కడి వారికే సాధ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. గత పోరాటాలను గుర్తుకు తెచ్చుకుంటూ, నాటి యోధుల త్యాగాలను స్మరించుకుంటూ గాయకులు ఆలపించిన పాటలు స్ఫూర్తినింపాయి. నాలుగేళ్ల బుడతడి నుంచి నలభై ఏళ్ల మధ్య వయస్కుడి వరకూ ఎర్ర చొక్కాలు ధరించి, ఎర్ర జెండాలు చేబూని నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ 'ఔరా...' అనిపించింది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తూ, మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తూ షేక్ మస్తాన్ బృందం నిర్వహించిన నాదసర్వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిపిఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభకు ఆతిథ్యమిస్తున్న మదురై నగరంలోని సీతారాం ఏచూరి నగర్ (మదురై కన్వెన్షన్ సెంటర్)లో ఆవిష్కృతమైన దృశ్యాలివి. అత్యంత ఉత్సాహ, ఉల్లాసపూరిత వాతావరణంలో బుధవారం మహాసభ స్ఫూర్తిదాయకంగా ప్రారంభమైంది.

అంతకుముందు ఉదయం 7 గంటలకే సీతారాం ఏచూరి నగర్‌కు సిపిఐ (ఎం) అగ్రనేతలు, నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తరలివచ్చారు. అభిమానులు, సాధారణ ప్రజలు పోటెత్తారు. ఆ జనసందోహంతో తముక్కమ్ మైదానం ఎర్రసంద్రంగా మారింది. అక్కడ ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పిస్తూ...'ఇంక్విలాబ్ జిందాబాద్.. జోహార్ సీతారాం ఏచూరి.. సిపిఐ (ఎం) జిందాబాద్...' అంటూ పెద్దపెట్టున నినాదాలిచ్చారు. అక్కడి అమరవీరుల జ్యోతికి వారు 'రెడ్ సెల్యూట్' చేసి, 'మీ త్యాగాల బాటలోనే మేం నడుస్తాం...' అంటూ ప్రతినబూనారు. అదే సమయంలో తమిళనాడులో ప్రసిద్ధిగాంచిన 'షేక్ చిన్న మౌలానా' బృంద సభ్యులు షేక్ మస్తాన్ నేతృత్వంలో నిర్వహించిన నాదస్వర కచేరి కామ్రేడ్లను విపరీతంగా ఆకట్టుకుంది. అక్కడి ప్రముఖ దేవస్థానం శ్రీరంగం ఆస్థాన విద్వాంసులైన ఈ బృంద సభ్యులు ఏకబిగిన 45 నిమిషాలపాటు వాయించిన నాదస్వరం అదరహో అనిపించింది. దీంతోపాటు తమిళనాడులోని కొన్ని దళిత, గిరిజన తెగల వారికి ప్రత్యేకమైన 'పాప్పమ్ పాడి పెరియా మేళమ్...' అనే డప్పుల నృత్యం ఆద్యంతం ఆకట్టుకోవటమేగాక అబ్బురపరిచింది. ఆగకుండా గంటపాటు కొనసాగిన ఈ నృత్యం... సభికులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. మహాసభ కొలువుదీరిన కొడియేరి బాలకృష్ణన్ ఆడిటోరియం ముందు భాగంలో ఉంచిన 'కార్ల్ మార్క్స్' మైనపు బొమ్మ 'సెల్ఫీ పాయింట్'గా మారి అగ్రనేతల నుంచి సాధారణ కార్యకర్తల వరకూ అందర్నీ విశేషంగా ఆకర్షించింది.

ఈ కోలాహలంతో కూడిన ఉత్సాహపూరిత వాతావరణంలో వెణ్మణి అమర వీరుల స్మారకార్థం అక్కడి నుంచి తెచ్చిన అరుణ పతాకాన్ని సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు యు.వాసుకి అందుకున్నారు. ఆమె ఆ పతాకాన్ని పార్టీ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎకె పద్మనాభన్‌కు అందజేశారు. అనంతరం సిపిఐ (ఎం) సీనియర్ నేత బిమన్ బసు ఆ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అగ్రనేతలు ప్రకాశ్ కరత్, మాణిక్ సర్కార్, పినరయి విజయన్, బృందా కరత్, బివి రాఘవులుతోపాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులం దరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రతినిధులందరూ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తూ మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు.



డప్పు కళాకారుల నృత్య ప్రదర్శన


వెణ్మణి నుండి ఎందుకు?

సిపిఎం 24వ అఖిలభారత మహాసభ ప్రారంభానికి సూచకంగా ఎగురవేసిన పోరాట పతాకాన్ని నాగపట్నంకు సమీపంలో ఉండే వెణ్మణి అనే చిన్న గ్రామం నుండి తీసుకువచ్చారు. స్థానిక ప్రజానీకం అత్యంత పోరాట స్ఫూర్తితో ఈ జాతాని నిర్వహించి పోరాట పతాకాన్ని బుధవారం ఉదయం మహాసభ ప్రాంగణం వద్దకు తీసుకువచ్చింది. ప్రాంగణం వద్ద కేంద్ర కమిటీ సభ్యురాలు వాసుకి ఈ పతాకాన్ని స్వీకరించారు. అనంతరం ఎకె.పద్మనాభన్‌కు అందజేశారు. ఆ పతాకాన్ని ఆ తరువాత బిమన్ బసు ఆవిష్కరించారు. అయితే, వెణ్మణికి ఆ ప్రత్యేకత ఏమిటి? అక్కడి నుండే పోరాట పతాకాన్ని ఎందుకు తీసుకువచ్చారు? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం కొన్ని దశాబ్దాల వెనక్కివెళ్లాలి. అది 1968వ సంవత్సరం. ఈ గ్రామంలోని దళిత కుటుంబాలు తరతరాలుగా స్థానిక భూస్వాముల వద్ద పనిచేసేవి. వారు నామమాత్రపు జీతపు రాళ్లతో సరిపెట్టేవారు. ఆ నికృష్ట బతుకులు భరించలేక తమ వేతనాలను పెంచాలని వారు కోరారు. ఆగ్రహించిన అగ్రకుల భూస్వామ్య పెత్తందారు లు అమానుషకాండకు తెగబడ్డారు. ఆ ఏడాది డిసెంబర్ 25వ తేదిన 44 మంది దళిత వ్యవసాయ కార్మికులకు ఒక గుడిసెలో నిర్బంధించి నిప్పు పెట్టారు. గోపాల కృష్ణనాయుడు అనే అగ్రకుల భూస్వామి చేసిన ఈ దురాగతంలో ఆ 44 మంది ప్రాణాలు విడిచారు.


ఈ అమానుష కాండపై తమిళనాడు భగ్గుమంది. సిపిఎం ఆ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లింది. ప్రతి ఏడాది అదే తేదీన ఆ గ్రామంలో ఎర్రజెండాలతో వేలాదిమంది ప్రదర్శన నిర్వహిస్తారు. పోరాటానికి, దళిత, వ్యవసాయ కార్మిక కుటుంబాల చైతన్యానికి నిదర్శనంగా నిలిచిన వెణ్మణీ గ్రామం నుండే మహాసభకు పోరాట పతాకాన్ని తీసుకురావాలని సిపిఎం తమిళనాడు రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ పిలుపునకు స్పందించిన ఆ గ్రామస్తులు ఎర్రజెండా జాతాను ఘనంగా నిర్వహించి, మహాసభ ప్రాంగణానికి తీసుకువచ్చారు.




చర్చల్లో పాల్గొన్న ఎపి ప్రతినిధి బృందం



వేదికపై ఆశీనులైన ఎస్.రామచంద్రన్ పిళ్లై, బిమన్ బసు తదితరులు



ఎంఎ బేబితో ముచ్చటిస్తున్న బృందాకరత్, పక్కన పినరయి విజయన్, ప్రకాశ్ కరత్



ప్రారంభ సెషన్‌లో పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు ఎన్.రామ్



రాఘవులుతో కరత్, బేబి



అధ్యక్ష వర్గానికి సూచనలిస్తున్న మాణిక్ సర్కార్



మహాసభకు హాజరైన ప్రతినిధులు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68